అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

బుధవారం 12-7-2023

సంపుటి : 9 | సంచిక : 192 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

యూసీసీపై 46 లక్షల స్పందనలు



న్యూఢిల్లీ : ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)పై ప్రజల నుండి అభిప్రాయాలు కోరుతూ 22వ లా కమిషన్ చేసిన జారీ చేసిన ప్రకటనకు మంచి స్పందన లభిస్తోంది. అభిప్రాయాలు తెలియజేసేందుకు మరో రెండు రోజులలో గడువు ముగియనుండగా సోమవారం సాయంత్రానికి 46 లక్షల మంది స్పందించారు. రాబోయే రోజులలో కొన్ని సంస్థలను, కొందరు వ్యక్తులను వ్యక్తిగతంగా హాజరు కావాల్సిందిగా లా కమిషన్ కోరే అవకాశం ఉంది. దీనిపై కొందరికి ఇప్పటికే లేఖలు పంపారు. రాజకీయంగా సున్నితమైన యూసీసీపై లా కమిషన్ గత నెల 14న సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించింది. ప్రజల నుండి, గుర్తింపు పొందిన మత సంస్థల నుండి అభిప్రాయాలు ...11లో



జేపీఎస్, వీఆర్ఏలకు తీపి కబురు

పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ

- ఇరిగేషన్‌తో పాటు పలు శాఖల్లో వీఆర్ఏల సర్దుబాటు : ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడి
- కేటీఆర్ ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు
- నేడు వీఆర్ఏలతో చర్చలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ), జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్)కు రాష్ట్ర సర్కారు తీపి కబురునందించింది. నాలుగేండ్ల శిక్షణా కాలాన్ని పూర్తి చేసుకున్న జేపీఎస్‌లను క్రమబద్ధీకరిస్తున్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. విద్యార్హతలు, సామర్థ్యాలను బట్టి వీఆర్ఏలను నీటిపారుదల, ఇతర శాఖల్లో సర్దుబాటు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతను కాపాడేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించడం, మొక్కలు నాటించడం, వాటిని పర్యవేక్షించడం, పలు రకాల బాధ్యతలను రాష్ట్ర సర్కారు అప్పగించిన విషయం విదితమే. నాలుగేండ్ల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తి చేసుకున్న కార్యదర్శుల పనితీరును జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీ పరిశీలించనున్నది. కమిటీ పరిశీలనలో నిర్దేశించిన లక్ష్యాలలో మూడింట రెండు వంతులకు చేరుకున్న వారిని రెగ్యులర్ చేయాలని ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయించారు. అందుకు సంబంధించిన పనులను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పంచాయతీరాజ్ శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, కమిషనర్ హన్మంతరావును సీఎం కేసీఆర్ ఆదేశించారు. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర అభినందనీయమని సీఎం కేసీఆర్ కొనియాడారు. జాతీయ అవార్డులు సాధించడంలో వారి పాత్ర మరువలేనిదన్నారు. గ్రామాల్లో మరింగ గుణాత్మక మార్పు తీసుకొచ్చేలా, ప్రజల భాగస్వామ్యంతో మరింత అభివృద్ధి చెందే దిశగా పంచాయతీ కార్యదర్శుల నిరంతర కృషి ...5లో



మనీలాండరింగ్ పరిధిలోకి జీఎస్టీ నెట్‌వర్క్

ప్రతిపక్షాల తీవ్ర అభ్యంతరం... 50వ జీఎస్టీ కౌన్సిల్‌లో గందరగోళం

- ఆన్‌లైన్ గేమ్‌లు,గుర్రపు పందెం, కాసినోలపై 28 శాతం పన్ను
- మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లో ట్రిబ్యునల్ బెంచ్‌ల ఏర్పాటు
- సినిమా హాళ్లలో ఆహార పదార్థాలపై జీఎస్టీ 5 శాతానికి తగ్గింపు
- క్యాన్సర్ మందు దిగుమతిపై మినహాయింపు

న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వాలను కానీ, రాజకీయ పక్షాలను కానీ సంప్రదించకుండానే, ఎటువంటి ముందస్తు సమాలోచనలు జరపకుండానే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మరో ఏకపక్ష నిర్ణయాన్ని బలవంతంగా రుద్దేసింది. వస్తు, సేవల పన్ను నెట్‌వర్క్ (జీఎస్టీ-ఎన్)ను మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) పరిధిలోకి చేర్చింది. దీనిపై ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు భగ్గుమన్నాయి. 'మీ పాటికి మీరు ఏకపక్ష నిర్ణయాలను నిరంకుశంగా రుద్దుతూ పోతే ఇక ఈ కౌన్సిల్‌తో పనేంటి?' అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ పరిణామాలతో న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన 50వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కాసేపు గందరగోళం నెలకొంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన విజ్ఞాన్ భవన్‌లో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐటీ సిస్టమ్ సంస్కరణలపై ప్రజెంటేషన్ అనంతరం జీఎస్టీఎన్‌ని పీఎంఎల్ఏ కింద చేర్చడంపై ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్నాటక, కేరళ, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాలు ఈ అంశాన్ని లేవనెత్తాయి. కాగా కొన్ని వస్తువులు, సేవలకు సంబంధించిన జీఎస్టీని సవరిస్తూ కౌన్సిల్ నిర్ణయాలు చేసింది. బెంగాల్, మహారాష్ట్రలో అప్పిలేట్ ట్రిబ్యునళ్లు పశ్చిమ బెంగాల్‌లో రెండు, మహారాష్ట్రలో ఏడు అప్పిలేట్ ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్ నిర్ణయించినట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కౌన్సిల్ సమావేశ అనంతరం నేషనల్ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహారాష్ట్రలో మొదటి దశలో నాలుగు జీఎస్టీఏటీ బెంచ్‌లను, రెండవ దశలో మరో మూడు బెంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. మొదటి దశలో జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్‌లు ఎక్కువగా రాష్ట్రాల రాజధాని నగరాల్లో, హైకోర్టు బెంచ్‌లు ఉన్న చోట ఏర్పాటు చేయనున్నామని ఆమె చెప్పారు.

సినిమా హాళ్లలో కాస్త ఊరట !

ప్రత్యేక వైద్య అవసరాల కోసం ఆహారం (ఎఫ్ఎస్ఎంపీ) వంటి ఫార్మా ...5లో



తెలంగాణకు జీఎస్టీ పరిహారం ఇవ్వండి

జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి టి. హరీశ్ రావు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

2020-21, 2022-23 సంవత్సరాలకుగాను తెలంగాణకు రావాల్సిన రూ.698.97 కోట్ల జీఎస్టీ పరిహారం చెల్లించాలని రాష్ట్రమంత్రి టి.హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నాడిక్కడ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షత జరిగిన 50వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, వైద్య శాఖ మంత్రి టి.హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ మాట్లాడుతూ "2021-22 కాలానికి రూ.164.43 కోట్లు బకాయి ఉంది. ఏజీ ఇప్పటికే సర్టిఫికేట్ జారీ చేసింది. కాబట్టి, ఈ పరిహారం మొత్తాన్ని వీలైనంత త్వరగా విడుదల చేయాలి. 2022-23 సంవత్సరానికి రూ.534.54 కోట్లు పెండింగ్‌లో ఉంది. దీన్ని ఏజీ ధ్రువీకరించాలి" అని అభ్యర్థించారు. తెలంగాణ రాష్ట్రానికి ఐజీఎస్టీ సెటిల్‌మెంట్ కింద ఇంటర్ హెడ్ నగదు బదిలీ ఖాతాలోకి రూ.112.99 కోట్లు రావాలని, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మే నెలలో ఆర్థిక మంత్రిత్వ శాఖ రెవెన్యూ డైరెక్టర్‌కు లేఖ రాస్తూ ఈ మొత్తాన్ని విడుదల చేయాలని అభ్యర్థించారని తెలిపారు. ఈ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. తెలంగాణ వంటి వినియోగ రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని పన్ను ఇన్ వాయిస్ ...5లో



కేంద్రానికి ఎదురుదెబ్బ

ఈడీ డైరెక్టర్ పదవీ కాలం పొడిగింపు చట్టవిరుద్ధం : సుప్రీంకోర్టు

- పదవి నుంచి వైదొలగడానికి మిశ్రాకు 31 వరకు గడువు

న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థలు బీజేపీ పెద్దల కనుసన్నల్లో పని చేస్తున్నాయనే ఆరోపణల నడుమ సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) డైరెక్టర్ సంజయ్ కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని పొడిగించడం చట్ట విరుద్ధమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మిశ్రా పదవీకాలం పొడిగింపు చెల్లదని పేర్కొంది. ఈ పదవి నుంచి వైదొలగడానికి ఆయనకు ఈ నెల 31 వరకు గడువునిచ్చింది. మిశ్రా పదవీ కాలాన్ని పొడిగించటాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేతలు జయ ఠాకూర్, రణదీప్ సింగ్ సూర్జేవాలా, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, టీఎంసీ అధికార ప్రతినిధి సాకేత్ గోఖలే, కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం విచారించింది. సుదీర్ఘ విచారణ తరువాత మే నెలలో తీర్పును రిజర్వ్ చేసింది. ఆ తీర్పును సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం మంగళవారం వెలువరించింది. ఈడీ డైరెక్టర్‌గా సంజయ్ మిశ్రా పదవీ కాలాన్ని పొడిగించడం సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ 2021లో ...11లో


ప్రతిపక్షాల కూటమిలోకి మరో ఎనిమిది పార్టీలు

17, 18 తేదీల్లో ఐక్యతా సమావేశం

- అన్ని పార్టీలకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖలు



న్యూఢిల్లీ : బీజేపీని ఓడించేందుకు సిద్ధమైన ప్రతిపక్షాలతో కలిసేందుకు మరికొన్ని పార్టీలు సిద్ధమయ్యాయి. బెంగళూరులో జరిగే ప్రతిపక్షాల కూటమిలో చేరేందుకు కొత్తగా ఎనిమిదికి పైగా పార్టీలు ముందుకొచ్చాయి. ఈ పార్టీలన్నీ బీజేపీ వ్యతిరేక కూటమి వెంట ఉంటామంటూ మద్దతు ప్రకటించాయి. ప్రతిపక్షాలకు కొత్తగా మద్దతు ప్రకటించిన పార్టీలలో మరుమలర్చి ...11లో



పెట్టుబడిదారుల ప్రయోజనాలే ప్రభుత్వాల లక్ష్యం..

మిగులు భూములను పేదలకు ఎందుకు పంచరు ? : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజల ప్రయోజనాల కంటే పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్ల వ్యాపార ప్రయోజనాలే ప్రధాన అజెండాగా పనిచేస్తున్నాయని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు విమర్శించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎం) గ్రేటర్ ...11లో

మోడీని కాపాడేందుకు బీఆర్ఎస్ పంచాయితీ



అందుకే కుట్రలు

- కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్ ఒక మోసం
- అది కాంగ్రెస్‌కే పేటెంట్
- అమెరికాలో అనని మాటలు అన్నట్టు దుష్ప్రచారం
- మంత్రులు, బీఆర్ఎస్ నేతల చిల్లర ప్రయత్నాలకు ఓ ఛానెల్ వత్తాసు
- ఆ అనుబంధాన్ని బయటపెడతా...: టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

వివరాలు 11లో..


ఉచిత విద్యుత్ రద్దుకు కాంగ్రెస్ కుట్రలు

ఆ పార్టీ దుష్ట విధానాలకు రేవంత్ వ్యాఖ్యలే నిదర్శనం : మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


'ఉచిత విద్యుత్‌కు ఉరి వేసేందుకు గాంధీభవన్ కేంద్రగా జరుగుతున్న కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి. 24 గంటల ఉచిత కరెంట్ రద్దు చేసి మూడు గంటల కరెంట్ మాత్రమే ఇస్తామని చెప్పడం కాంగ్రెస్ దుష్ట విధానాలకు పరాకాష్ట. రైతుకు ఉచిత విద్యుత్ ఊపిరిలాంటిది.. రైతుల ఊపిరిని ఆపేస్తామని, అన్నదాత ఉసురు తీస్తామని చెప్పడం ఆ పార్టీ రాక్షస బుద్ధికి తార్కాణం. కాంగ్రెస్ కాలంలో ...11లో



వరంగల్లు గరం..గరం..

కడియం శ్రీహరి, రాజయ్య మధ్య ఆరని మంటలు

- సీనియర్ నేతల మధ్య లేని సఖ్యత
- బీఆర్ఎస్‌లో టికెట్ల లొల్లి, విభేదాలతో సతమతం



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధికార బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేధాలు రచ్చకెక్కుతున్నాయి. ఆశావహులు ఒకవైపు, ప్రజావ్యతిరేకత మరోవైపు బహిర్గతమవుతున్నది. పార్టీ టికెట్‌ల కోసం ఆశావహులు వ్యూహ ప్రతివ్యూహాలతో పావులు కదుపుతున్నారు. దాంతో అన్ని రాజకీయ పార్టీల కంటే కారు పార్టీలోనే రాజకీయం వేడెక్కింది. ఏ నియోజకవర్గంలో చూసినా ఇదే పరిస్థితి.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. దాంతో ఈ వివాదంపై మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ 'తాటికొండ'ను పిలిచి మరీ క్లాస్ తీసుకున్నారు. ఇప్పటికే వీరిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే బగ్గుమంటున్న సంఘటనలు ఎన్నో చోటుచేసుకున్నాయి. ఇప్పుడు ఏకంగా ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలకు దిగడం గమనార్హం. ఇలా ఇద్దరి మధ్య రాబోయే ఎన్నికల్లో టికెట్ విషయమై గొడవలు జరుగుతున్నాయి. కాగా, ఇలాంటివి మళ్లీ పునరావృతమైతే ఎవరినీ ఉపేక్షించమని హెచ్చరించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని మహబూబాబాద్, డోర్నకల్, ములుగు నియోజకవర్గాల్లోనూ అధికార బీఆర్ఎస్‌లో పార్టీ నేతల మధ్య తీవ్ర విభేధాలున్నాయి. మహబూబాబాద్‌లో ఎంపీ కవిత పార్టీ టికెట్ ఆశిస్తున్నారు. ఇదిలా ఉంటే డోర్నకల్ నియోజకవర్గంలో సీనియర్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌ను తండాల్లో అభివృద్ధి పనులపై స్థానికులు నిలదీస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నియోజకవర్గం నుంచి మంత్రి సత్యవతి రాథోడ్ పార్టీ టికెట్ ఆశిస్తున్నారు. జనగామ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కుటుంబ వ్యవహారాలు రచ్చకెక్కాయి. మరోపక్క ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేయాలని అన్ని ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

మానుకోటలో సిట్టింగ్‌కు ఎసరు..

మహబూబాబాద్ (ఎస్టీ) నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ అనుసరిస్తున్న విధానాలు, ప్రవర్తనపై పార్టీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎంపీ కవితల మధ్య రాజకీయ ...11లో



డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శిక్షార్హుడే

- బాధితులను లైంగికంగా వెంటబడి వేధించినట్టు ఆధారాలు: ఛార్జిషీట్‌లో ఢిల్లీ పోలీసుల వెల్లడి

వివరాలు 11లో..

జాతీయ చేనేత దినోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేయాలి

వారోత్సవాలు నిర్వహించాలి : సమీక్షాసమావేశంలో మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా జరిపేలా టెక్స్‌టైల్ శాఖ అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి కేటీఆర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నేత కేంద్రాలు, ప్రాంతాల్లో వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలని, ఇందుకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. చేనేత జౌళి శాఖపై కేటీఆర్ మంగళవారం హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో సుదీర్ఘ సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతన్న చేయూత, నేతన్నకు బీమా కార్యక్రమాన్ని మరింత విస్తతంగా అమలు చేయాలని అన్నారు. చేనేత మిత్ర పథకాన్ని మరింత సరళీకరించేందుకు ఉన్న వివిధ అంశాలపైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని నేతన్నల యోగక్షేమాల కోసం తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. టెక్స్‌టైల్ రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్క కార్మికుడూ మరింతగా అభివద్ధి చెందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను మరింతగా నేతన్నల్లోకి తీసుకుపోయేందుకు అవసరమైన అవగాహన కార్యక్రమాలతో పాటు, ఇతర కార్యక్రమాలను కలిపి చేనేత వారోత్సవాలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో నేతన్నలతో పాటు, చేనేత ఉత్పత్తుల పట్ల ఆసక్తి చూపించే పలు సంస్థలు, వ్యక్తులను, రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు.



రాష్ట్రంలో ఉన్న హ్యాండ్లూమ్ సొసైటీల పనితీరును మరింతగా మెరుగుపరిచి, అందులో సభ్యులుగా ఉన్న వారి స్థితిగతులను మెరుగుపరిచేందుకు టెక్స్‌టైల్ శాఖ ద్వారా తీసుకోవాల్సిన వివిధ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను ఈ సమావేశంలో విస్తతంగా చర్చించారు. రాష్ట్రంలోని నేతన్నల సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధుల సమీకరణకు సంబంధించి అందుబాటులో ఉన్న వివిధ అంశాలను, అవకాశాలను చర్చించారు.

హైదరాబాద్ నగరంలో ఏర్పాటుచేసిన శిల్పారామాల్లో టెక్స్‌టైల్ శాఖ తరుపున మ్యూజియాలను ఏర్పాటు చేయాలని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటినుంచే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. దీంతోపాటు ఆర్టీసీ, దక్షిణ మధ్య రైల్వేను సంప్రదించి హ్యాండ్లూమ్ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అవసరమైన సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నేతన్నల సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు, వాటి పనితీరు, అమలు, ఫలితాలు, అయా కార్యక్రమాల్లో అవసరమైన మార్పు చేర్పులను సూచించేందుకు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి సంస్థలతో ఒక అధ్యయనాన్ని నిర్వహించాలని టెక్స్‌టైల్ శాఖ అధికారులకు కేటీఆర్ ఈ సందర్భంగా సూచించారు.

మారణ హోమాన్ని సృష్టించే నాటో అవసరం లేదు

ఐప్సో జాతీయ అధ్యక్షులు డాక్టర్ డి.సుధాకర్

- ఐప్సో రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ యుద్ధ ట్యాంకర్ వద్ద నిరసన

నవతెలంగాణ-అడిక్‌మెట్

దేశాల మధ్యన అస్థిరత.. ఉద్రిక్తత వాతావరణాన్ని సృష్టిస్తూ, ఆయుధ వ్యాపారాన్ని కొనసాగిస్తూ, మారణ హోమాన్ని సృష్టించే నాటో ప్రపంచానికి ఎట్టి పరిస్థితుల్లో అవసరం లేదని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) జాతీయ అధ్యక్షులు డాక్టర్ డి.సుధాకర్ అన్నారు. నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) సమ్మిట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఐప్సో రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం ట్యాంక్ బండ్ యుద్ధ ట్యాంకర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. ప్రపంచంలో తన ఆధిపత్యాన్ని చూపించుకోవడానికి, ఆసియా పసిఫిక్ ప్రాంతాల్లో విస్తరించడానికి కుట్రలను యుద్ధ తంత్రాలు చేయడానికి ఉద్వేనియా, విల్నియస్ జరుగుతున్న నాటో సమ్మిట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ మాట్లాడుతూ.. ఈ భూమి మీద నాటోకు అవకాశం ఇవ్వొద్దన్నారు. 1949 సంవత్సరంలో అమెరికా కీలుబొమ్మ సంస్థగా ఏర్పడిన నాటోలో నాడు 11 దేశాలు మాత్రమే



ఉండేవని తెలిపారు. ఇప్పుడు 31 దేశాల్లో విస్తరించి యుద్ధ కోరలతో కాటేస్తున్నదన్నారు. సామ్రాజ్యవాదం సైనిక కూటమిగా బలపడాలని చూస్తున్న నాటోకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పిడికిలి బిగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రపంచ శాంతికి నాటో పెద్ద ప్రమాదమని, ప్రమాదకర శక్తులను తరిమెయ్యాలని అన్నారు. జి.రఘుపాల్ మాట్లాడుతూ.. ప్రపంచ శాంతి గురించి ఆలోచించే అన్ని రంగాల ప్రజలు ఐక్యమై బలమైన పోరాటాలు చేయాలన్నారు. ఐప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచం సత్యనారాయణ, అధ్యక్షవర్గ సభ్యులు తిప్పర్తి యాదయ్యలు మాట్లాడుతూ.. ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐప్సో నాయకులు ఉమా మహేష్, వెంకటేష్ గౌడ్, రామ్ నారాయణ, డీజి నరేంద్ర ప్రసాద్, పోల గాని రవి కిషోర్, తిప్పర్తి మహేష్ పాల్గొన్నారు.

ఆగస్టు 25న సచివాలయంలో గుడి, మసీదు, చర్చి ప్రారంభం

- సర్వమత సమానత్వాన్ని కొనసాగిస్తాం : సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సర్వ మత సమానత్వాన్ని కొనసాగిస్తూ, రాజ్యాంగం అందించిన లౌకికవాద స్ఫూర్తి ప్రతిఫలించే విధంగా, తెలంగాణ రాష్ట్రంలో గంగా జమునా తెహెజీబ్‌ను మరో మారు ప్రపంచానికి చాటే దిశగా ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావు కీలక నిర్ణయం తీసుకున్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్మాణం పూర్తి చేసుకున్న నల్ల పోచమ్మ దేవాలయం, మసీదు, చర్చిలను ఒకే రోజున ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా మత పెద్దలను సంప్రదించి అందరికీ ఆమోదయోగ్యమైన తేదీని ఖరారు చేశారు. వచ్చేనెల 25న హిందూ సాంప్రదా యాలను అనుసరించి పూజారుల సమక్షంలో నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన చేసి దేవాలయాన్ని ముఖ్యమంత్రి పున:ప్రారంభిస్తారు. అదే రోజున ఇస్లాం, క్రిస్టియన్ మతాల సాంప్రదాయాలను అనుసరించి ఆయా మత పెద్దల ఆధ్వర్యంలో మసీదును, చర్చిని కూడా కేసీఆర్ ప్రారంభిస్తారు. మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఎంవో అధికారులు, ఆర్ అండ్ బి అధికారులతో ఆయన మంగళవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.





టమాటా ధర మంటపుట్టిస్తోంది. కిలో రూ.వంద నుంచి 250 వరకూ పలుకుతోంది. కేంద్రం తీరుపై సోషల్ మీడియాలో వ్యంగ్య పోస్టులు హల్‌చల్ చేస్తున్నాయి. అయితే ప్రధాని మోడీ ప్రాతినిథ్యం వహిస్తున్న బనారస్ నియోజకవర్గంలో టమాటా గురించి మాట్లాడితే బొక్కలో వేసేయటానికి యోగి వెనుకాడటం

టమాటా ధర పెరిగినా.. గమ్మునుండాల్సిందే!

మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న బనారస్‌లో కఠిన నిబంధనలు..

లక్నో : టమాటా ధర పెరిగాక తోటల్లోనే కాదు. వాహనాల్లోను చోరీకి పాల్పడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో యూపీలోని బనారస్‌లో టమాటాలు అమ్ముకోవటానికి బౌన్సర్లను పెట్టుకోవటం నేరమైంది. నీకు ఎంత ధైర్యముంటే మోడీ

తమ ఇంటిపై బుల్డోజర్ నడుపుతారేమోనని విక్రయదారుడికి భయం

జైలు పాలైన కూరగాయల విక్రేత, అతని తనయుడు

సొంత నియోజవర్గం లోనే టమాటాలను బౌన్సర్లను పెట్టి అమ్ముతావా..? అంటూ విక్రయదారుడితో పాటు అతని తనయుడిపై తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తండ్రీ కొడుకులిద్దరినీ అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఈ కేసులో నామినేటెడ్ ఎస్పీ నేత అజయ్ యాదవ్ అలియాస్ అజయ్ ఫౌజీ అరెస్ట్ కోసం క్రైం బ్రాంచ్ గాలిస్తోంది. టమాటా ధరపై బీజేపీ సర్కార్‌ను సమాజ్‌వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ టార్గెట్ చేశారు. దీంతో మోడీ పార్లమెంటరీ నియోజకవర్గంలో టమోటా ద్రవ్యోల్బణంపై పెరుగుతున్న ప్రశ్న కారణంగా రాజకీయాలు వేడెక్కాయి.

ఏం జరిగిందంటే..?

జులై 9, 2023న వారణాసిలోని లంక ప్రాంతంలో కూరగాయల విక్రయదారుడు రాజనారాయణ యాదవ్ ఉన్న వీడియోను వార్తా సంస్థ విడుదల చేసింది. ధరల పెరుగుదలపై వ్యంగ్య పోస్టర్ , బౌన్సర్లతో టొమాటోలు అమ్ముతున్న చిత్రం, కొన్ని వీడియోలు గత మూడు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అందులో ఇద్దరు బౌన్సర్లు కూరగాయల దుకాణం వెలుపల ఉన్నారు. వారు నల్ల చొక్కాలు, ముదురు గ్లాసెస్ ధరించి ఉన్నారు. ఇద్దరు బౌన్సర్లు వాకీ-టాకీలతో సెక్యూరిటీగా నిలబడి ఉండగా.. దుకాణ దారుడు నేలపై కూర్చున్నాడు. అతని ముందు టమోటాలు, మిరపకాయలు, కొత్తిమీర సహా పలు రకాల కూరగాయలు ఉన్నాయి. ధరల పెరుగుదలను వ్యతిరేకిస్తూ ప్రింటవుట్‌లు తీసి కొందరు ప్లకార్డులు కూడా ప్రదర్శించారు. ఒకదానిపై టమాటా, మిరపకాయలు ముట్టుకోకూడదని బోర్డు పెట్టారు. మరొకదానిపై మొదట డబ్బు తరువాత టమోటాలు అని రాశారు. తొమ్మిదేండ్ల ద్రవ్యోల్బణం అని మూడోదానిపై రాసి ఉంది. ఇది పొలిటికల్ సెటైర్ అని, అలాగే ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో సామాన్యులపై ఘాటైన వ్యాఖ్య అని బీజేపీ, యోగి సర్కార్ భావించింది.



టమాటా ధరల పెరుగుదలకు సంబంధించి పీటీఐ వీడియోను విడుదల చేసిన వెంటనే, ప్రజలు సోషల్ మీడియాలో బీజేపీ ప్రభుత్వాన్ని ట్రోల్ చేయడం ప్రారంభించారు. బనారస్ కమిషనరేట్ పోలీసులు రంగంలోకి దిగడంతో పాటు పరిపాలన కూడా రంగంలోకి దిగింది. లంక పోలీస్ స్టేషన్ ఏరియాలోని నాగ్వా ఔట్‌పోస్టు ఇన్‌చార్జి మిథిలేశ్ యాదవ్ కూరగాయల విక్రేత రాజనారాయణ యాదవ్, అతని కుమారుడు వికాస్ యాదవ్, ఎస్పీ నాయకుడు అజయ్ ఫౌజీతో సహా ఐదుగురిపై తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

భేల్‌పూర్ ఏసీపీ ప్రవీణ్ సింగ్ మాట్లాడుతూ, శత్రుత్వాన్ని పెంపొందించడం, సామరస్యానికి భంగం కలిగించడం వంటి సెక్షన్లు, 295 ఏ (మత మనోభావాలను దెబ్బతీయడం) , సెక్షన్ 505 (2) (అబద్ధాలు చెప్పి వివిధ వర్గాల మధ్య గొడవలు పెట్టడం) కింద కేసులు నమోదు చేశారు.కూరగాయల వ్యాపారి రాజనారాయణ యాదవ్ , అతని కుమారుడు వికాస్ యాదవ్‌లను అరెస్టు చేసి పంపారు.

ఈ చర్యపై అఖిలేశ్ ఆగ్రహం



టమాటా ద్రవ్యోల్బణంపై ప్రశ్న లేవనెత్తిన సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అజయ్ ఫౌజీ, కూరగాయల అమ్మకం దారులైన తండ్రీకొడుకులపై చర్యలు తీసుకోవటంపై జాతీయ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ బీజేపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టమాటాను బౌన్సర్‌తో విక్రయిస్తున్న వీడియోను విడుదల చేసిన ఏజెన్సీ పీటీఐ విచారం వ్యక్తం చేస్తూ ఆ వార్తలను తొలగించింది. అయితే కూరగాయల విక్రేతకు మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ అనుకూలంగా నిలిచారు. అతను వరుసగా రెండుసార్లు ట్వీట్ చేసాశారు. 'మదర్ ఆఫ్ డెమోక్రసీ' అనే మాట ఈ వాతావరణంలో అర్థంలేనిది. ఇది జుమ్లాలా కనిపిస్తోంది. దేశంలోని ప్రధాన పార్లమెంటరీ నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం పరిస్థితి ఇలా ఉంటే, దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో ఏం జరుగుతుంది.? కూరగాయల విక్రయదారుడిని వెంటనే విడుదల చేయాలి అని ఎస్పీ అధ్యక్షుడు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కూరగాయల విక్రయదారులు కూడా యోగి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బనారస్ కమిషనరేట్ పోలీసుల చర్య ఏకపక్షం, చట్ట విరుద్ధం. ఈ కేసు ఎత్తివేయాలి. పోలీసుల నుంచి కార్మికుడిని విడుదల చేయాలని ఎస్పీ నేతలు డిమాండ్ చేశారు. లంక పోలీస్ స్టేషన్‌లో పోలీసులు, ఎస్పీ నేతల మధ్య గంటల తరబడి పంచాయితీ కూడా సాగింది, అయితే అదుపులోకి తీసుకున్న కూరగాయల వ్యాపారులిద్దరినీ విడుదల చేసేందుకు పోలీసులు అంగీకరించలేదు. ఈ వార్త రాష్ట్రవ్యాప్తంకావటంతో.. యూపీలోని కూరగాయల వ్యాపారులంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టమాటా విక్రయదారుడ్ని,అతని కుమారుడ్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు తమ ఇండ్లను బుల్డోజర్లతో యోగి సర్కార్ ఎక్కడ కూలదోస్తుందోనన్న భయం కూరగాయల విక్రేతను వెంటాడుతోంది.

వ్యవసాయ రంగంలో

అద్భుతమైన పురోగతి

వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

- ఏసీఎఫ్ఐ 10 మొబైల్ వ్యాన్లు ప్రారంభం



నవతెలంగాణ-రాజేంద్రనగర్

రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చి అద్భుతమైన పురోగతిని సాధించిందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఏసీఎఫ్ఐ ఆధ్వర్యంలో 'జాగో కిసాన్ జాగో' అవగాహన కార్యక్రమం చేపట్టింది. ప్రచారంలో భాగంగా 10 మొబైల్ వ్యాన్‌లను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నుండి వివిధ రంగాల్లో, మరీ ముఖ్యంగా వ్యవసాయ రంగంలో అద్భుతమైన పురోగతిని సాధించామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ప్రారంభించిన ప్రత్యేక పథకాలు, రైతు వేదికలు.. పంచాయతీ స్థాయిలో ఏకీకృత పరిష్కారంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నీటిపారుదల సౌకర్యాల విస్తరణ, చెరువుల పునరుద్ధరణ కారణంగా పత్తి, వరి విస్తీర్ణంలో గణనీయమైన పెరుగుదల సాధ్యమైందని, ఫలితంగా ఉత్పాదకత మెరుగుపడిందన్నారు. నాణ్యమైన వ్యవసాయ దిగుబడి, రైతుల ఆదాయం మెరుగుపడటానికి నాణ్యమైన వ్యవసాయ ఇన్పుట్స్ (ఆగ్రో కెమికల్స్) ఆవశ్యకతపై అవగాహన కల్పించడానికి ఏసీఎఫ్ఐ 10 మొబైల్ వ్యాన్లను ప్రారంభిం చామని తెలిపారు. అనంతరం తెలంగాణ వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి రఘునందన్ రావు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ని వ్యవసాయ శాఖ ప్రవేశపెట్టడం వల్ల ఇన్‌పుట్‌ల రంగంలో మరింత విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. తెలంగాణ ఇప్పుడు వేగంగా రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా అభివృద్ధి చెందుతోందన్నారు. రైస్ మిల్లింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించ డానికి, జాప్యాలను తొలగించడానికి, సమర్ధ వంతమైన ప్రాసెసింగ్‌ను నిర్ధారించడానికి ప్రభుత్వం ఆధునిక, అధిక సామర్థ్యం గల రైస్ మిల్లులను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఏసీఎఫ్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మెన్, ధనుకా గ్రూప్ చైర్మెన్ ఆర్‌జీ అగర్వాల్ మాట్లా డుతూ.. తెలంగాణలో ఈ మొబైల్ ఆడియో విజువల్ వ్యాన్‌లతో భారీ ప్రచారం, పురుగుమందుల సురక్షిత వినియోగంపై రైతులకు అవసరమైన శిక్షణను అందిం చడంలో గణనీయమైన పురోగతిని సాధించ గలమన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎఫ్ఐ ట్రెజరర్, ఇండోగల్ఫ్ క్రాప్ సైన్స్ ఎండీ సంజయ్ అగర్వాల్, ఏసీఎఫ్ఐ సెక్రటరీ డాక్టర్ కళ్యాణ్ గోస్వామి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక గుంతలో ఇద్దరు బాలురు మృతి

నవతెలంగాణ- హన్వాడ

ఫిల్టర్ ఇసుక తయారీ కోసం తీసిన నీటి గుంతలో పడి ఇద్దరు బాలురు మృతిచెందారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల పరిధిలోని చిన్నదర్పల్లి గ్రామ శివారులోని సిరిమలకుచ్చ తండాలో మంగళవారం జరిగింది. ఎస్ఐ రవి నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమల్ తండాకు చెందిన కేతావత్ గోపి, రవి మహబూబ్‌నగర్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గోపి కొడుకు గణేష్(9), రవి కొడుకు శివ(9) పట్టణంలోని మాడ్రస్ స్కూల్లో నాలుగో తరగతి చదువుతున్నారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామానికెళ్లారు. ఈ క్రమంలో ఇద్దరు బాలురులు సమీపంలోని ఫిల్టర్ ఇసుక తయారీ కోసం తీసిన గుంతలో స్నానం చేసేందుకు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండటం.. వీరికి ఈత రాకపోవడంతో మునిగిపోయి ప్రాణం కోల్పోయారు. రెండు కుటుంబాల వారు పిల్లల కోసం వెతుకుతూ వెళ్లగా.. నీటి గుంతల వద్ద బట్టలు చూసి అందులో వెతికారు. ఇద్దరి మృతదేహాలు బయటపడ్డాయి. దాంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు దర్యాప్తులో ఉంది.



ఉప్పొంగిన బొగత జలపాతం

50 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతున్న నీటి ప్రవాహం

నవతెలంగాణ-వాజేడు : ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి గ్రామ సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో నెలకొన్న పచ్చటి ప్రకృతి అందాల జలపాతం బొగత. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బొగత జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు నీటి ప్రవాహ ఉధృతి పెరిగి 50 అడుగుల ఎత్తు నుంచి తెల్లటి పాలనురగలా జలపాతం జాలువారుతోంది. దాంతో పర్యాటకులను జలపాతం కట్టి పడేస్తుంది. ఏటా వర్షాకాలం సీజన్‌లో జలపాతాన్ని సందర్శిం చడానికి మూడు రాష్ట్రాల ప్రజలు సుదూరా ప్రాంతాల నుంచి వస్తారు. పర్యాటకుల కోసం ఫారెస్ట్‌శాఖ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్య క్రమాలు చేపట్టారు. జలపాతంలో ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలూ చేపట్టింది.

జీపీ కార్మికులకు బెదిరింపులు

సమ్మె విచ్ఛిన్నానికి కుట్ర

- దినసరి కూలీలతో పారిశుధ్య పనులు చేయించేందుకు యత్నం
- అడ్డుకున్న కార్మికులు.. కొనసాగుతున్న సమ్మె

తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు అధికారులు బెదిరింపులకు దిగుతున్నారు. విధుల్లో చేరకుంటే కొత్తవారిని తీసుకుంటామంటూ హెచ్చరిస్తూ దినసరి కూలీలతో పనులు చేయించేందుకు యత్నించారు. కార్మికులు అడ్డుకోవడంతో వెనక్కి తగ్గారు. తమ గోడును వినాలంటూ అంబేద్కర్ విగ్రహాలకు వినతులు అందించారు.



నవతెలంగాణ- విలేకరులు

ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మెకు అడ్డంకులు ఏర్పడ్డాయి. మంగళవారం బెజ్జూర్ గ్రామ ఉప సర్పంచ్, కార్యదర్శి కలిసి దినసరి కూలీలతో పారిశుధ్య పనులు చేయించారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులను రప్పించి పనులు చేయించారు.

ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలో జీపీ కార్మికులు కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. తల్లాడలో కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ సంఘీభావం తెలిపారు. అనంతరం కార్మికులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ పర్యటన నేపథ్యంలో నరసాపురం, రెడ్డిపాలెం, లక్ష్మీపురం గ్రామాల నుంచి కార్మికులను రప్పించి పోలీస్ బలగాల పహారా మధ్య పారిశుధ్య పనులు చేయించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామపంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులు ఎంబి నర్సారెడ్డి, మర్లపాటి రేణుక, నాగరాజు, లక్ష్మణ్, ఏఐటీయూసీ నాయకులు సునీల్ పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు పంచాయతీ కార్మికుల మధ్య కొంతసేపు వాగ్వాదం, తోపులాట జరిగింది. నాయకులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా కార్మికులు పోలీసులను చుట్టుముట్టడంతో వెనక్కి తగ్గారు. తమపై గ్రామపంచాయతీ ఈవో కావాలనే కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో జీపీకార్మికుల సమ్మె శిబిరాన్ని జీపీ ఉద్యోగ, కార్మిక సంఘాల జిల్లా జేఏసీ చైర్మెన్ దాసరి పాండు సందర్శించి మాట్లాడారు. జెడ్పీ కార్యాలయం ఎదుట కార్మికులు రోడ్లు ఊడ్చుతూ నిరసన తెలిపారు. నల్లగొండ జిల్లా చండూరు, మర్రిగూడ మండలాల్లో సమ్మె శిబిరాలను సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చిన్నపాక లక్ష్మినారాయణ సందర్శించారు. సూర్యాపేట జిల్లా కోదాడరూరల్ మండలంలో జీపీ కార్మికుల సమ్మెకు సీఐటీయూ రాష్ట్ర నాయకులు సోమపంగు రాధాకృష్ణ మద్దతు తెలిపారు. బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. హుజూర్‌నగరకు వచ్చిన అదనపు కలెక్టర్ మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. పెన్‌పహాడ్‌లో జీపీ కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ ఎంపీటీసీ గద్దల నాగరాజు సంఘీభావం తెలపడంతోపాటు రూ.1000 అందజేశారు.

నడిగడ్డ ప్రాంత సీడ్ రైతులను

ప్రభుత్వం ఆదుకోవాలి

తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

నడిగడ్డ ప్రాంతంలో నష్టపోయిన విత్తన పత్తి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నష్ట పోయిన సీడ్ పత్తి రైతుల పొలాలను మంగళవారం గద్వాల జిల్లా మల్దకల్, బిజ్వారం గ్రామాల్లో ఆయన పరిశీలించారు. 30 ఏండ్ల నుంచి ఈ ప్రాంతంలో రైతులు వాణిజ్య పంటలవైపు వెళ్లారని చెప్పారు. గద్వా ప్రాంతంలోనే 60 వేల ఎకరాల్లో సీడ్ పంటలు వేస్తున్నారని తెలిపారు. 2015-16లో ఎర్రతెగులు సోకి 57 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. పెట్టుబడులు సైతం చేతికి రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాస్త పెరిగిన మొక్కలు క్రాసింగ్ చేద్దామన్నా.. సుంకు రాకపోవడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారన్నారు. విపత్తుల నుంచి ప్రభుత్వం రైతాంగాన్ని కాపాడటం లేదన్నారు. విత్తన బంఢాగారంగా చేసేందుకు విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్న పాలకుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని విమర్శించారు. రైతులకు నష్టం వస్తే.. ఈ ప్రాంత ఓట్లతో గెలిచిన నాయకులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విత్తన కంపెనీలతో మాట్లాడి నష్టం ఎంత జరిగిందో అంచనా వేసి రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

రైతులకు ఫౌండేషన్ సీడ్ ఉచితంగా ఇచ్చి.. ఎకరాకు రెండు లక్షల రూపాయలు వడ్డీ లేని రుణం ఇవ్వాలని, జిన్నింగ్ ఖర్చులు కంపెనీలే భరించాలని రాతపూర్వక ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు కంపెనీలకు విత్తనాలు ఇచ్చిన తర్వాత 90 రోజుల్లో డబ్బులు చెల్లిం చాలని కోరారు. ఆయన వెంట తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు వీవీ నరసింహా, పందు రంగారెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు శివన్న, సీతారాములు, సామేలు, బుచ్చన్న, ప్రభుదాసు, గోపాల్ తదితరులు ఉన్నారు.

ఓయూ కాంట్రాక్టు ఉద్యోగులకు ఈపీఎఫ్

- ఉత్తర్వులు జారీ చేసిన వీసీ రవీందర్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న టైం స్కేల్, కాంట్రాక్టు ఉద్యోగులందరికీ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్(ఈపీఎఫ్) అమలు చేస్తూ ఓయూ వీసీ ఆచార్య రవీందర్ చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో సుమారు 1000 మంది జీవితాల్లో వెలుగు ప్రసరించనున్నదని ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. చాలా కాలంగా ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు చేసిన పోరాటానికి దక్కిన ఫలితం ఈ విజయమని.. ఈ సందర్భంగా ఓయూ ఎన్‌జీఓఎస్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, ఉద్యోగ సంఘాల నాయకులు శివశంకర్, నాగరాజు, విజయకుమార్ అన్నారు. ప్రధానంగా ఓయూ వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మినారాయణకు కృతజ్ఞతలు తెలియజేశారు. కాంట్రాక్టు, టైం స్కేల్ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికుల.. పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా



నవతెలంగాణ- విలేకరులు

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, సమస్యలు పరిష్కారించాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) డిమాండ్ చేస్తూ మంగళవారం కార్మికులు టోకెన్ సమ్మె చేపట్టారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వీరికి సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు కురమయ్య మద్దతు తెలిపారు. ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెండో రోజు దీక్షలు కొనసాగాయి. మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా కార్యదర్శి ఏలమోని స్వప్న, తదితరులు పాల్గొన్నారు. యాచారం తహసీల్దార్ కార్యాలయంలో చేపట్టిన దీక్షలకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. వరంగల్ జిల్లా డీఈఓ ఆఫీస్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. హన్మకొండ జిల్లాలో జిల్లా అధ్యక్షులు ధర్మల రామ్మూర్తి ఆధ్వర్యంలో డీఈవో ఆఫీసు ఎదుట ధర్నా చేపట్టారు. కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ బీజేపీతో కలిస్తే రాజీనామా చేస్తా

- బీజేపీకి బీ టీమ్ కాంగ్రెస్సే : రవాణా శాఖ మంత్రి పువ్వాడ



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బీజేపీకి బీటీమ్ కాంగ్రెస్సు అని ప్రజలు గ్రహిస్తున్నారని, బీజేపీకి అనుకూలంగా బీఆర్ఎస్ కలిస్తే తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఉమ్మడి పౌరస్మృతి విషయంలో సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తూ ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. విడగొట్టడం, విభజించి పాలించడం, అన్ని వర్గాలకు అన్యాయం చేయడం అనే బీజేపీ విధానానికి తాము వ్యతిరేకమన్నారు. అందరి కలిసిమెలిసి ఉండాలన్నదే సీఎం కేసీఆర్ అభిమతమన్నారు. వ్యవసాయానికి మూడు గంటల పాటు కరంటు ఇస్తే చాలని రేవంత్ రెడ్డి మతిభ్రమించిన మాటలు మాట్లాడుతున్నారని మంత్రి అన్నారు. గాంధీభవన్ లో దూరిన గాడ్సే రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు.

సంపాదకీయం

రుణ భార(త)ం

దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదంటూ మన ప్రధాని అవకాశం దొరికన ప్రతిచోట ఊదరగొడుతున్నాడు. అదే సమయంలో దేశం అప్పుల ఊబిలో పీకల్లోతు కూరుకుపోయిందని రిజర్వ్ బ్యాంక్ స్పష్టం చేస్తున్నది. ఈ తొమ్మిదేండ్లలో కేంద్రం చేసిన అప్పులు 150శాతం పెరిగాయని అప్పుల చిట్టాను బయటపెట్టింది. ఇక రాష్ట్రాల అప్పు ఏకంగా 200శాతం పెరిగిందని తేలింది. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా! దీన్ని బట్టి మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం ప్రగతి సాధించిన రంగం ఏదైనా ఉంది అంటే అది 'రుణ రంగం' అని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. ఈ అప్పుల వల్ల దేశం మౌలిక వనరుల పరంగానో, అభివృద్ధి పరంగానో ఏమైనా సాధించిందా అంటే అదీ లేదు.

> మోడీకి సన్నిహితంగా ఉండే వ్యాపారవేత్తల ఆస్తులు ఎంతగా పెరిగిపోయాయో చూస్తే కండ్లు బైర్లు కమ్ముతాయి. 2020 లెక్కల ప్రకారం ముఖేశ్ అంబానీ ఆస్తులు 350శాతం, గౌతమ్ అదానీ ఆస్తులు ఏకంగా 700 శాతం ఇవి పెరిగాయి. ఈ మూడేండ్లలో మరింత పెరిగాయి. కరోనా సైతం వీరి వృద్ధిని ఏ మాత్రం అడ్డుకోకపోవటం వైచిత్రి. తెచ్చిన అప్పుల్లో సగానికి పైగా ఇలాంటి కార్పొరేట్ల రాయితీలకే ఖర్చు చేస్తుంటే వాళ్ల ఆస్తులు పెరగవా మరి!

ఈ అప్పుల వెనుక ఉన్న అసలు కారణాలు పరిశీలించాలి. 2016 నవంబర్‌లో అకస్మాత్తుగా ప్రకటించిన పెద్దనోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది. మరుసటి ఏడాది జులైలో హడావుడిగా తీసుకొచ్చిన జీఎస్టీ మరింత దెబ్బతీసింది. ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకింది. దీన్నుండి బయటపడేందుకు అప్పుల మీద అప్పులు చేయాల్సి వచ్చింది. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 62శాతం అప్పులున్నాయని కేంద్ర ఆర్థికశాఖ ఇటీవల లోక్‌సభలో వెల్లడించింది. ఇది 152లక్షల కోట్లకు సమానం. ఈ రుణ భారం ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉన్నది. దీనివల్ల ఆర్థికాభివృద్ధి జరుగుతున్నదా అంటే అదీ లేదు. 2019-20లో ఏకంగా నాలుగు శాతానికి పతనమైంది.



అయితే ఆర్థిక సంక్షోభానికి కారణం కరోనా అని ప్రభుత్వం చెప్పుకొస్తున్నది. నిజమే... కరోనా వల్ల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమయ్యాయి. మన దేశమే కాదు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు ఈ పరిస్థితిని ఎదుర్కొన్నాయి. ప్రభుత్వాల సామర్థ్యానికి కరోనా ఒక పెద్ద పరీక్ష పెట్టింది. అటువంటి సంక్షోభంలోనూ ప్రజలను సమస్యల నుంచి తప్పించే విధంగా విధానాలను రూపకల్పన చేయటం, ఉపశమన చర్యలను కల్పించటం పాలకుల బాధ్యత. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం ఎటువంటి చర్యలూ చేపట్టలేదన్నది స్పష్టం. అసలు మన ఆర్థికవ్యవస్థ పతనానికి కరోనానే కారణమా అనే విషయాన్ని పరిశీలించాలి. కొన్ని గణాంకాలు చూస్తే కరోనా కంటే ముందే దేశ ఆర్థిక వ్యవస్థ దిగజారటం మొదలైందని స్పష్టమవుతున్నది.

2018 జనవరి నుంచే భారత్ వృద్ధి క్రమంగా పడిపోవటం మొదలైంది. యేటా దేశ జీడీపీ వృద్ధి రేటు పడిపోతూనే ఉంది. గతేడాది ఉన్న వృద్ధి ఈయేడు లేదు. రెండేండ్ల కింద ఉన్నంత గతేడాది లేదు. ఈ అంతరం రాబోయే రోజుల్లో మరింత పెరుగుతుందని ఐఎంఎఫ్ వంటి ఆర్థికసంస్థలు అంచనా వేస్తున్నాయి. ఒకపక్క మౌలిక వసతులు, మానవ వనరులు సరిగాలేని బంగ్లాదేశ్ వంటి చిన్న దేశం కూడా నైపుణ్యం లేని మానవ వనరులనే పెట్టుబడిగా పెట్టి ఆర్థికంగా ముందంజ వేస్తున్నది. కార్మికులు అవసరమయ్యే వస్త్ర ఉత్పత్తిపై దృష్టిపెట్టి ఎగుమతుల్లో దూసుకుపోతున్నది. వస్త్ర పరిశ్రమలోకి మహిళలు భారీ సంఖ్యలో వచ్చేలా ప్రోత్సహించింది. కానీ మన దేశంలో మహిళలను పారిశ్రామికోత్పత్తిలో భాగస్వాముల్ని చేయడం కన్నా వాళ్ల ఏ మతం వాళ్లను పెండ్లి చేసుకుంటున్నారు? ఎటువంటి దుస్తులు ధరిస్తున్నారు? అన్న విషయాలు ప్రధానమైపోయాయి. అంతర్జాతీయంగా పేరున్న థామ్సన్ రాయిటర్స్ ఫౌండేషన్ 2018లో విడుదల చేసిన (ప్రపంచంలో మహిళల భద్రతపరంగా అత్యంత ప్రమాదకర దేశాలు) జాబితాలో భారత్ నెంబర్‌వన్‌గా నిలిచింది. అంటే మన దేశంలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించవచ్చు.

ఇదే సమయంలో మోడీకి సన్నిహితంగా ఉండే వ్యాపారవేత్తల ఆస్తులు ఎంతగా పెరిగిపోయాయో చూస్తే కండ్లు బైర్లు కమ్ముతాయి. 2020 లెక్కల ప్రకారం ముఖేశ్ అంబానీ ఆస్తులు 350శాతం, గౌతమ్ అదానీ ఆస్తులు ఏకంగా 700 శాతం ఇవి పెరిగాయి. ఈ మూడేండ్లలో మరింత పెరిగాయి. కరోనా సైతం వీరి వృద్ధిని ఏ మాత్రం అడ్డుకోకపోవటం వైచిత్రి. తెచ్చిన అప్పుల్లో సగానికి పైగా ఇలాంటి కార్పొరేట్ల రాయితీలకే ఖర్చు చేస్తుంటే వాళ్ల ఆస్తులు పెరగవా మరి! ఈ విధంగా దేశాన్ని రుణభారతంగా మార్చింది మోడీ ప్రభుత్వం. లేదంటే దేశంలో మౌలిక సౌకర్యాలను పెంచటానికో, ఏవైనా భారీ ప్రాజెక్టులు ప్రారంభించటానికో ఈ అప్పుల్ని ఉపయోగించారా వీరు? ఈ తొమ్మిదేండ్లలో కొత్తగా నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల్లేవు, నెలకొల్పిన భారీ పరిశ్రమల్లేవు. నిరుద్యోగాన్ని తగ్గించింది లేదు. ప్రజల ఆదాయాన్ని పెంచిందీ లేదు. పేదోళ్ళ కడుపు కొట్టి కార్పొరేట్లకు పెట్టడంలో మన పాలకులకు మించినవారు లేరు. సామాన్యుల జీవితాలను మరింత హీనస్థితికి దిగజారుస్తున్నది మోడీ ప్రభుత్వం. ఇప్పటికైనా మతోన్మాద రాజకీయాలను పక్కనపెట్టి సామాన్యుల జీవితాలను మెరుగుపరచాలి. దేశాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. అప్పుల ఊబి నుంచి దేశాన్ని కాపాడాలి.



ప్రభుత్వ విద్యను పరిరక్షించాలి...

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నది. కేజీ నుంచి పీజీ వరకు సమస్యలతో సతమతమవుతున్నది. ఇదే సందర్భంలో ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు మాత్రం బలోపేతమవుతున్నవి. సరైన నాణ్యతా ప్రమాణాలు లేకున్నా ఇష్టానురీతిలో ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నవి. దీన్ని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైంది. ప్రయివేటు పాఠశాలలో నర్సరీకి రూ.40వేల నుంచి మొదలుకుంటే స్కూల్‌ను బట్టి రూ.2లక్షల వరకు వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ దీన్ని పర్యవేక్షించే నాథుడు లేడు. ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలని విద్యార్థి సంఘాలు ఎన్నో రోజులుగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీన్నిబట్టి చూస్తే ప్రభుత్వం ప్రయివేటు, కార్పొరేట్ వర్గాలకు కొమ్ముకాస్తోందని స్పష్టంగా తెలుస్తోంది. ఈ సంవత్సరం పాఠశాలల పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్‌లోనూ దేశంలో మన రాష్ట్రం 31స్థానంలో ఉంది. విద్యలో నాణ్యతా ప్రమాణలు పాటించడంలో వెనుకబడింది. విద్యా రంగానికి ప్రభుత్వం కేటాయించే నిధులు అరకొరగా ఉండగా కేటాయించిన నిధులను కూడా పూర్తిగా ఖర్చుపెట్టిన పరిస్థితి. ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు సమస్యలతోనే కొట్టుమిట్టాడుతున్న దుస్థితి ఉంది.

రాష్ట్రంలో 26,065 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారుగా 26లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. మిగతా 40లక్షల విద్యార్థులు ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వ మొదటి దఫా పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగా ఉన్నారని కారణం చూపి సుమారు నాలుగు వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసింది. దీంతో పేదవర్గాలకు ప్రాథమిక విద్య భారమైంది. మరిన్ని పాఠశాలలను మూసివేయాలనే ధోరణి ప్రభుత్వంలో కనపడుతోంది. మొత్తంగా ఈ ఎనిమిదేండ్ల పాలన చూసినట్టయితే పాఠశాల విద్యకు కేటాయించింది అరకొర బడ్జెట్‌యే. ఆ నిధులు కూడా పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదు. అందుకే పాఠశాలల్లో చాలావరకు శిథిలావస్థకు చేరాయి. అలాగే కనీస వసతులులేవు. విద్యార్థులు ఆడుకోవడానికి ప్లే గ్రౌండ్, టాయిలెట్స్, మంచినీటి వసతులు మృగ్యమనే చెప్పాలి. ఈ విద్యాసంవత్సరం స్వచ్ఛ కార్మికులు లేకపోవడంతో కొన్ని పాఠశాలల్లో విద్యార్థులే తరగతి గదులను ఊడ్చుకుంటున్న పరిస్థితి. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు పూర్తయిన యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు పూర్తిగా విద్యార్థులకందనేలేదు. 'మన ఊరు మనబడి' పథకం కింద ప్రభుత్వం రూ.7వేల కోట్లు కేటాయించగా, దీంతో పాఠశాలల రూపురేఖలు మారుతాయని అనుకుంటే నిధుల విడుదలలో జాప్యం కనబడుతోంది. దీంతో విద్యా సంవత్సరం ప్రారంభమైనా సగంపనులే జరిగాయి. రాష్ట్రంలో సుమారుగా 26వేలకు పైగా టీచర్ ఉద్యోగాలు ఖాళీలున్నాయి. కనీసం బడులను పర్యవేక్షించే డీఈఓలు, ఎంఈఓలు కూడా లేరంటే మన విద్యారంగం పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇంటర్మీడియట్ విద్య పూర్తిగా ప్రయివేటు, కార్పొరేట్ సంస్థల్లో బంధీ అయింది. ఉద్యమ కాలంలో శ్రీ చైతన్య, నారాయణ లాంటి కార్పొరేట్ విద్యాసంస్థలు తెలంగాణలో ఉండవని మాట్లాడిన పాలకులు నేడు వాటిని అన్ని జిల్లాల్లో విస్తరించడానికి అనుమతులిస్తున్నారు. రకరకాల పేర్ల మీద లక్షల రూపాయలు వసూళ్లకు పాల్పడుతూ, కనీస ప్రమాణాలు లేకుండా విద్యాసంస్థలు నడుపుతున్నా యాజమాన్యలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు చేస్తున్నా అధికారుల పట్టింపు లేదు. ప్రభుత్వం గొప్పగా చెపుతున్న గురుకులాలకు కూడా సొంత భవనాలు లేవు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎండకు ఎండి, వానకు తడిసి చలికి వణికే పరిస్థితి ఉంది. పౌష్టికాహారమైతే అందని ద్రాక్షగా మారింది.

ఉన్నతవిద్యకు కేంద్రాలైన విశ్వవిద్యాలయాలు నేడు సకల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయనేది వాస్తవం. అన్ని విశ్వవిద్యాలయాల్లో సుమారు రెండు వేల ప్రొఫెసర్ ఉద్యోగాలు ఖాళీలున్నాయి. వీటిని భర్తీ చేయకపోవడంతో విభాగాలు మూతపడే పరిస్థితి దాపురించింది. కొన్ని డిపార్ట్‌మెంట్స్ కాంట్రాక్ట్ పార్ట్ టైం లెక్చరర్లతో నడుస్తున్నాయి. పీజీ సెంటర్స్, డిగ్రీ కళాశాలలో కూడా ఆధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. మొత్తం కళాశాలలో ఒకరిద్దరు పూర్తి కాలం అధ్యాపకులున్నారు. మిగతా అంతా కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీతోనే కళాశాలలు నడుస్తున్నాయి. ప్రభుత్వం ఉన్నత విద్యకు కేటాయించే నిధులు కేవలం అధ్యాపకులకు జీతాలివ్వడానికి సరిపో తున్నాయి. సరిపడా నిధులు లేకపోగా వివిధ కోర్స్ ఫీజులు భారీగా పెంచారు. దీంతో పేద సామాన్య విద్యార్థులు చదువుకోవడం గగనమవుతున్నది. గత నాలుగేండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.5,117 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పూర్తిగా విడుదల చేయకపోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు నేడు పెరుగుతున్న ధరలకనుగుణంగా మెస్‌ఛార్జీలు పెంచలేదు. రీసెర్చ్ చేసే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఫెలోషిప్ సహకారం లేదు. ఘనమైన చరిత్ర కలిగిన ఉస్మానియా, కాకతీయ లాంటి విశ్వవిద్యాలయాలు కూడా నేడు సమస్యలతో బోసిపోతున్నాయి. దీన్నిబట్టి చూస్తే రాష్ట్రంలో అట్టడుగు పేద వర్గాలకు ప్రభుత్వ విద్య రోజురోజుకూ దూరమవుతున్నదనేది స్పష్టమవుతున్నది. ప్రయివేటు, కార్పొరేట్ వర్గాలు విద్య పేరుతో తల్లిదండ్రులను దోచుకోవడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం నిర్లక్ష్యం ఓవైపు, ప్రయివేటు ఫీజుల దోపిడీ మరోవైపు విద్యారంగ అభివృద్ధిని అడ్డుకుంటున్నది. అందుకే విద్యారంగాన్ని పరిరక్షించాలని, పాఠశాలలు, కళాశాలల్లో టీచర్లు, లెక్చరర్ల పోస్టుల ఖాళీలను భర్తీచేయాలని నేడు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించతలపెట్టడం జరిగింది. దీనికి అన్నివర్గాల ప్రజలు, విద్యార్థులు సంపూర్ణ మద్దతు ప్రకటించి జయప్రదం చేయాలి.



ఆర్.ఎల్.మూర్తి
8257672658

'ఐరోపా' సభ్యత్వంపై స్వీడన్‌కు మెలికపెట్టిన టర్కీ!



ఎం. కోటేశ్వరరావు

ఐరోపా సమాఖ్య తలుపులు తెరుస్తారేమోనని ఐదు దశాబ్దాలుగా గుమ్మం ముందు పడిగాపులు కాస్తున్నాం. సమయం వచ్చింది గనుక చెబుతున్నా మాకు సమాఖ్యలో సభ్యత్వానికి అంగీకరిస్తే మేము నాటోలో స్వీడన్ ప్రవేశానికి అడ్డుతొలుగుతామని టర్కీ అధ్యక్షుడు రిసెప్ తాయిప్ ఎర్డోవాన్ సోమవారంనాడు మెలిక పెట్టాడు. లిథువేనియా రాజధాని విలినస్‌లో మంగళ, బుధవారాల్లో జరగనున్న నాటో కూటమి వార్షిక సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్లే ముందు టీవీలో చెప్పాడు. ఆదివారంనాడు తాను అమెరికా అధినేత జో బైడెన్‌తో చర్చలు జరిపినప్పుడు ఈ అంశాన్ని స్పష్టం చేసినట్లు కూడా వెల్లడించాడు. ఈ అనూహ్య ప్రకటనతో పశ్చిమ దేశాలు కంగారుపడ్డాయి. ఇలా వివాదపడితే అంతిమంగా రష్యా అధినేత వ్లదిమిర్ పుతిన్ లబ్దిపొందుతాడంటూ నష్టనివారణకు పూనుకున్నాయి. మరోవైపున సోమవారం నాడే విలినస్‌లో ఎర్డోవాన్- స్వీడన్ ప్రధాని క్రిస్టెర్‌సన్ భేటీ జరిగింది. తరువాత స్వీడన్‌కు చారిత్రాత్మక క్షణం అంటూ తమ దేశ టీవీలో ప్రకటించినట్లు వార్తలు వచ్చాయి. కొత్త మెలిక తప్ప గతంలో విధించిన షరతులను టర్కీ పునరుద్ఘాటించలేదు గనుక మద్దతు ఖాయం అని భావించిందా లేక ఎర్డోవాన్ విలినస్ చేరుకున్న తరువాత తెరచాటు మంత్రాంగం ఏదైనా జరిగిందా అన్నది ఇది రాస్తున్న సమయానికి వెల్లడి కాలేదు. వైఖరిని మార్చుకున్నట్లు టర్కీ నుంచి ఎలాంటి సూచనా లేదు. ఎవరి ప్రయోజనం వారు చూసుకుంటున్నందున మీరు మాకది ఇస్తే మేం మీకిది ఇస్తాం అన్నట్లుగా అందుకోసం ఎత్తులు జిత్తులు వేస్తున్నందున ఏం జరుగుతోంది అన్నది చూడాలి. తమ గడ్డ మీద ఉన్న రష్యా సేనల మీద ఎదురుదాడులు జరిపి పోగొట్టుకున్న ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకుంటామని ప్రతిజ్ఞలు చేసిన ఉక్రెయిన్ తీవ్రంగా నష్టపోతున్నదనే వార్తలు వస్తున్నాయి. జెలెన్‌స్కీ దళాలకు అవసరమైన ఆయుధాలు, ఇతర సాయం ఎలా అందించాలా అని నాటో నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. నాటోలో చేరేందుకు ఫిన్లండ్, స్వీడన్ దరఖాస్తు చేసుకోగా ఈ ఏడాది ప్రారంభంలో ఫిన్లండ్‌కు ఆమోదం తెలిపారు. సంస్థ నిబంధనల ప్రకారం సభ్యదేశాలన్నీ అంగీకరిస్తేనే కొత్త దేశాలను చేర్చుకోవటానికి వీలుంటుంది. ప్రస్తుతం ఈ కూటమిలో 31 దేశాలు ఉన్నాయి.

> గ్రీసును బెదిరించకుండా ఉండేట్లైతే, నాటోలో స్వీడన్ చేరికను ఆమోదిస్తే తాము టర్కీకి ఎఫ్-16 విమానాలను విక్రయించేందుకు సిద్ధమే అని అమెరికా గతంలో సందేశం పంపింది. విలినస్‌కు బయలు దేరిన జో బైడెన్ ఆదివారం నాడు విమానం నుంచే ఎర్డోవాన్‌తో గంటసేపు సంభాషించినప్పటికీ ఎలాంటి పురోగతి లేదని అమెరికా అధికారవర్గాలు చెప్పినట్లు వార్తలు. గ్రీసు పట్ల శతృత్వం, రష్యానుంచి క్షిపణి రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు టర్కీ నిర్ణయించిననందున ఎఫ్-16 విమానాలను విక్రయించకూడదని గతంలో అమెరికా నిర్ణయించింది.

విలినస్ సమావేశాల్లో స్వీడన్ ప్రవేశానికి ఆమోదముద్ర కూడా అజెండాలో ఉంది. టర్కీ దానికి మోకాలడ్డటంతో పాటు ప్రస్తుతం జరుగుతున్న పోరు ముగిసేంత వరకు నాటోలో ఉక్రెయిన్ చేరకూడదని అమెరికా అధినేత జో బైడెన్ చేసిన ప్రకటన కూడా తలనొప్పిగా మారింది. టర్కీ షరతులను తాము అంగీకరించేది లేదని ఐరోపా సమాఖ్య ప్రకటించగా స్వీడన్‌కు ఆమోదం తెలిపితేనే తాము ఎఫ్ 16 యుద్ధ విమానాలను టర్కీకి విక్రయిస్తామని అమెరికా మెలిక పెట్టింది. "ముందు ఐరోపా సమాఖ్యలో టర్కీ చేరికకు మార్గాన్ని సుగమం చేయాలి, తరువాత ఫిన్లండ్ మాదిరి స్వీడన్‌కూ మేము దారి ఇస్తాము. మేము 50సంవత్సరాలుగా గేటు ముందు వేచి చూస్తున్నాం, నాటోలోని దేశాలన్నీ దాదాపు సమాఖ్యలో సభ్యులే" అని ఎర్డోవాన్ చెప్పాడు. తమ దేశంలో వేర్పాటు వాదులు, కుర్దిష్ వర్కర్స్ పార్టీ వంటి ఉగ్రవాదులను స్వీడన్ బలపరుస్తున్నదని, ఖురాన్ దహనంతో సహా ఇస్లాం వ్యతిరేక ప్రదర్శనలను అనుమతించిన కారణంగా తాము అంగీకరించేది లేదని గతంలో టర్కీ ప్రకటించింది. ఇప్పుడు తమకు ఐరోపా సమాఖ్యలో సభ్యత్వానికి లంకె పెట్టింది. టర్కీని సంతుష్టీకరించేందుకు స్వీడన్ ఉగ్రవాద చట్టాల్లో మార్పు చేసింది. వాటితో టర్కీ సంతృప్తి చెందలేదు.

ప్రపంచ రాజకీయాల్లో టర్కీ అనుసరిస్తున్న విధానాలే దానికి అమెరికా యుద్ధ విమానాల విక్రయం, ఐరోపా సమాఖ్యలో చేర్చుకొనేందుకు ప్రధాన ఆటంకాలుగా ఉన్నాయి. ఐరోపా ఆర్థిక సమాఖ్యలో చేరేందుకు 1963 సెప్టెంబరు 12న ఒక ఒప్పందం చేసుకుంది. అది మరుసటి ఏడాది డిసెంబరు ఒకటి నుంచి అమల్లోకి వస్తున్నట్లు చెప్పినప్పటికీ సంపూర్ణం కాలేదు.అది నత్తనడక నడుస్తోంది. మొత్తం 35 నిబంధనలకు గాను ఇంతవరకు టర్కీ 15 మాత్రమే, అదీ పాక్షికంగా నెరవేర్చింది. కేవలం శాస్త్ర, పరిశోధనా రంగాలకు సంబంధించిన అంశమే సంపూర్ణంగా అమలు చేసింది. ఏదో ఒకసాకుతో ఇతర దేశాలు పూర్తి సభ్యత్వానికి అడ్డుపడుతున్నాయి. అక్కడ ప్రజాస్వామ్యం, మానవహక్కులను కాలరాస్తున్నారని విమర్శిస్తున్నాయి. తాజా పరిణామాలకు వస్తే 2016లో ఎర్డోవాన్‌ను పదవి నుంచి దించేందుకు ఒక విఫల కుట్ర జరిగింది. తరువాత తన పదవిని సురక్షితం కావించుకొనేందుకు చేసిన రాజ్యాంగ సవరణలతో మానవహక్కులు, చట్టపరమైన ఆటంకాలను కల్పిస్తున్నట్లు వాటిని తొలగించి నిబంధనలన్నింటినీ పూర్తి చేస్తేనే చేర్చుకుంటామని సమాఖ్య చెబుతోంది. వీటికంటే పుతిన్‌తో స్నేహం, ఇతర అంశాలు ప్రధానంగా పని చేస్తున్నాయని చెప్పవచ్చు. సిరియాలో పశ్చిమ దేశాలు మద్దతు ఇస్తున్న కిరాయి మూకలు, ఉగ్రవాదులను అణచేందుకు రష్యా తోడ్పడుతున్నది, దానికి టర్కీ మద్దతు ఇస్తున్నది. ఉక్రెయిన్ సంక్షోభాన్ని సృష్టించింది, దాన్ని కొనసాగించాలని చూస్తున్నది పశ్చిమ దేశాలు కాగా తాను మధ్యవర్తిగా ఉంటానని టర్కీ ముందుకు రావటం వాటికి సుతరామూ ఇష్టం లేదు. టర్కీకి అవసరమైన మిలిటరీ పరికరాలను నాటో, అమెరికా నుంచి కొనుగోలుకు వీల్లేకుండా ఆంక్షలు విధించారు. సిరియా నుంచి ఐరోపాకు వచ్చే 40లక్షల మంది కాందిశీకులను రాకుండా చేసినందుకు ఇప్పటి వరకు ఐరోపా సమాఖ్య బిలియన్లమేర యూరోలను అందచేసింది. మరో ఆరు బిలియన్లను అందచేసేందుకు కుదిరిన ఒప్పందాన్ని టర్కీ నిలిపివేసింది. ఐరోపా సమాఖ్య తల మీద తుపాకి గురిపెట్టినట్లుగా తమ షరతులను అంగీకరించకపోతే ఇతర ఐరోపా దేశాలకు కాందిశీకుల వరద పారిస్తామని టర్కీ బెదిరిస్తున్నది. ఈ పూర్వరంగంలో స్వీడన్ సభ్యత్వాన్ని అవకాశంగా తీసుకొని తన ప్రయోజనాలను నెరవేర్చుకోవాలని చూస్తున్నది.

ఎర్డోవాన్ పెట్టిన మెలికను ఐరోపా కమిషన్ తిరస్కరించింది. స్వీడన్ నాటోలో, టర్కీ ఐరోపా సమాఖ్యలో చేరటం రెండూ వేర్వేరని, సమాంతరంగా జరుగుతున్న పరిణామాలు గనుక ఒకదానికి మరొకదాన్ని పోటీ పెట్టరాదని ప్రతినిధి దానా సిపినాంట్ స్పష్టం చేసింది. జర్మన్ ఛాన్సలర్ షుల్జ్ కూడా ఆ వైఖరిని బలపరిచాడు. టర్కీ కోర్కెను తాను సమర్థిస్తున్నట్లు నాటో ప్రధాన కార్యదర్శి జేన్స్ స్టోల్టెన్‌బర్గ్ చెప్పాడు. స్వీడన్ చేరికను టర్కీ బలపరుస్తుందని కూడా అన్నాడు. ఎర్డోవాన్ మెలిక పెట్టినప్పటికీ ఇప్పటికీ ఆమోదించే అవకాశం ఉందనే ఆశాభావం వెల్లడించాడు. విస్తరణకు సంబంధించి 2022 నివేదికలో సమాఖ్య పేర్కొన్న అంశాలు టర్కీ చేరిక అంత తేలిక కాదని స్పష్టం చేస్తున్నాయి. అక్కడ ప్రజాస్వామ్యం క్షీణిస్తున్నదని, చట్టబద్ధపాలన, ప్రాథమికహక్కులు, స్వతంత్ర న్యాయవ్యవస్థల గురించి తీవ్ర ఆందోళన వెల్లడించింది.

గ్రీసును బెదిరించకుండా ఉండేట్లైతే, నాటోలో స్వీడన్ చేరికను ఆమోదిస్తే తాము టర్కీకి ఎఫ్-16 విమానాలను విక్రయించేందుకు సిద్ధమే అని అమెరికా గతంలో సందేశం పంపింది. విలినస్‌కు బయలు దేరిన జో బైడెన్ ఆదివారం నాడు విమానం నుంచే ఎర్డోవాన్‌తో గంటసేపు సంభాషించినప్పటికీ ఎలాంటి పురోగతి లేదని అమెరికా అధికారవర్గాలు చెప్పినట్లు వార్తలు. గ్రీసు పట్ల శతృత్వం, రష్యానుంచి క్షిపణి రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు టర్కీ నిర్ణయించినందున ఎఫ్-16 విమానాలను విక్రయించకూడదని గతంలో అమెరికా నిర్ణయించింది. ఇప్పుడు ఒక అడుగు దిగివచ్చినట్లు కనిపిస్తోంది. స్వీడన్ చేరికకు మద్దతు ఇస్తే టర్కీకి విమానాలు విక్రయించేందుకు అమెరికా పార్లమెంటు ఆమోదించవచ్చని వార్తలు వచ్చాయి. వాటిని తమకు వ్యతిరేకంగా వినియోగించరాదని గ్రీసు డిమాండ్ చేస్తోంది. ఏజియన్ సముద్ర జలాల్లో నౌకా సంచార హక్కుల గురించి వివాదం ఉంది. తమ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తూ రోజూ తమ దీవుల మీదుగా విమానాలు ఎగురుతున్నట్లు గ్రీసు చెబుతున్నది. ఆ దీవుల మీదుగా ఎఫ్16 విమానాలను అనుమతించకూడదని ఆరుగురు అమెరికన్ ఎంపీలు తమ విదేశాంగ మంత్రికి లేఖలు రాశారు.



విలినస్ నాటో వార్షిక సమావేశాల్లో ఉక్రెయిన్‌కు అవసరమైన ఆయుధ సాయం గురించి తప్ప నాటోలో ప్రవేశం మీద ఎలాంటి నిర్ణయమూ తీసుకొనే అవకాశం లేదు.

> కొన్ని ప్రాంతాలు ఉక్రెయిన్ నుంచి వేరుపడి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాయి. క్రిమియా ద్వీపం తమదే అంటూ 2014లోనే రష్యా స్వాధీనం చేసుకుంది. మరికొన్ని ప్రాంతాలు ఇప్పుడు దాని ఆధీనంలో ఉన్నాయి, అటువంటప్పుడు మధ్యలో సభ్యత్వం ఇవ్వటం, గతం నుంచి వర్తింపచేసి ఎదురుదాడులకు పూనుకోవటం నాటో ఐదవ ఆర్టికల్ నిబంధన పరిధిలోకి రాదని చెబుతున్నారు. దాన్ని సవరించి నాటోలో చేర్చుకొని రష్యాతో నేరుగా తలపడేందుకు నాటో కూటమి ప్రస్తుతం సిద్ధంగా లేదన్నది స్పష్టం.

అక్కడ పోరు ముగిసిన తరువాతే దాన్ని గురించి పరిశీలిస్తామని జో బైడెన్ సిఎన్ఎన్ టీవీతో చెప్పాడు. నాటో కుటుంబంలో ఉక్రెయిన్‌ను చేర్చుకోవాలా వద్దా అనే అంశం మీద సభ్యదేశాల్లో ఏకీభావం లేదని కూడా అన్నాడు. ఇప్పుడు గనుక చేర్చుకుంటే మేమంతా యుద్ధంలో ఉన్నట్లే అవుతుంది. ఇప్పుడే ఓటింగ్ జరపాలనటం అపరిపక్వత అవుతుంది, ఒక దేశాన్ని చేర్చుకోవాలంటే ప్రజాస్వామీకరణతో సహా కొన్ని అర్హతలు ఉండాలి అని కూడా బైడెన్ చెప్పాడు. జర్మనీ కూడా అమెరికా వైఖరితో ఏకీభవిస్తోంది. నాటో నిబంధన ఐదును పరీక్షించే అవకాశం పుతిన్‌కు ఇవ్వకూడదని జర్మనీ కోరుకొంటోందని ప్రభుత్వ వర్గాలు చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఉక్రెయిన్‌కు తక్షణమే నాటో సభ్యత్వం అన్న చర్చ అసంగతం, దానికి చేస్తున్న మంచిని మరచి దీని గురించి చర్చను అనుమతించటం విచారకరం. ఎవరూ ఇప్పటికిప్పుడు నాటోలో చేరాలని గట్టిగా చెప్పటం లేదు, దానికి తగిన మార్గం గురించి మాట్లాడుతున్నాం, ఇప్పుడు ఎలా సాయం చేయాలా అని ఆలోచిస్తున్నాం. దీని గురించి గాక సభ్యత్వం గురించి చర్చ పెట్టటం అంటే సమావేశాన్ని పక్కదారి పట్టించటమే, పశ్చిమ దేశాల్లో విబేధాలు ఉన్నట్లు అని చెప్పటమే, దీన్ని రష్యా స్వాగతిస్తుందని నాటో అధికారులు చెప్పినట్లు మీడియా పేర్కొన్నది.

తమను వెంటనే నాటోలో చేర్చుకోవాలని, ఆధునిక అస్త్రాలను పెద్ద ఎత్తున సరఫరా చేయాలని ఉక్రెయిన్ డిమాండ్ చేస్తున్నది. అదే గనుక జరిగితే ఉక్రెయిన్ సంక్షోభ స్వభావమే మారిపోతుంది. పుతిన్ మీద నేరుగా ఆ కూటమి సేనలు యుద్ధానికి దిగవచ్చు. రష్యా దాడులకు దిగకముందున్న పరిస్థితి వేరు, తరువాత తమ ప్రాంతాలను ఆక్రమించుకున్నందున నాటో సభ్యత్వం ఇవ్వాలని గతేడాది సెప్టెంబరులో జెలెన్‌స్కీ దరఖాస్తు చేశాడు. అనేక దేశాలు అందుకు మద్దతు తెలిపినా అమెరికా, జర్మనీ సిద్ధం కాలేదు. కొన్ని ప్రాంతాలు ఉక్రెయిన్ నుంచి వేరుపడి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాయి. క్రిమియా ద్వీపం తమదే అంటూ 2014లోనే రష్యా స్వాధీనం చేసుకుంది. మరికొన్ని ప్రాంతాలు ఇప్పుడు దాని ఆధీనంలో ఉన్నాయి, అటువంటప్పుడు మధ్యలో సభ్యత్వం ఇవ్వటం, గతం నుంచి వర్తింపచేసి ఎదురుదాడులకు పూనుకోవటం నాటో ఐదవ ఆర్టికల్ నిబంధన పరిధిలోకి రాదని చెబుతున్నారు. దాన్ని సవరించి నాటోలో చేర్చుకొని రష్యాతో నేరుగా తలపడేందుకు నాటో కూటమి ప్రస్తుతం సిద్ధంగా లేదన్నది స్పష్టం.

సెల్: 8331013288

'మంటల్లో మౌనరాగం'



కె. శాంతారావు

'మణిపూర్ మారణహోమంపై ప్రధాని మోడీ మౌనం.'

- నిజమే కానీ చాలా పొడిగా పొడుగ్గా ఉంది. వెరైటీగా ఉండాలి టైటిల్.
- కథ వెరైటీ కాదుగా, వాస్తవం కదా...
- వాస్తవమే. సినిమాగా మలచాలన్నప్పుడు దృశ్యకావ్యంగా ఆవిష్కృతం కావాలి. ఆ మణిపూర్ ప్రజల ఆత్మఘోష కొంతలో కొంతైనా జనానికి అర్థం కావాలి.
- మౌనమేలనోయి?
- మంచి పాట
- మౌనం అర్థాంగీకారం.
- సుభాషితం
- మొండి మౌనం
- జర్నలిస్టులు వాడారు.
- మోడీ మౌనంపై బెట్టింగ్
- సోషల్ మీడియా టచ్. స్వతంత్ర దేశంలో చావుకూడా పెళ్ళివంటిదే అని ఆత్రేయ అన్నట్టు ప్రధాని మౌనం కూడా బెట్టింగే. సరే ఓసారి కథలోకి వెళ్దాం.
- అందానికి అందం, పచ్చటి కొండల్లో ఆదివాసీలతో అలరారే ఒకానొక ఈశాన్య రాష్ట్రం మణిపూర్. రెండున్నర నెలలుగా అగ్నికీలల్లో దహించుకుపోతున్నది. నాలుగు వేలకు పైగా గృహాలు భస్మీపటలం అయ్యాయి. వందమందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. తాము చేయని తప్పుకు అమాయకులు బలైపోతున్నారు.

కనీవినీ ఎరుగని రీతిలో ఆ ప్రజల మధ్య కక్షలూ కార్పణ్యాలు చెలరేగాయి. కారణం ఏమిటి? అసలు ఈ మంటలు ఎప్పటికి చల్లారుతాయి? ప్రాణాలు అరచేత పట్టుకుని ఆదివాసులు అలా తమ కొంపాగోడూ వదిలి పారిపోవల్సిందేనా? ఎంతకాలం ఈ నరకం? మంటలను ఆర్పే నాథుడే లేడా? కన్నీరు తుడిచే స్నేహ హస్తమే కరువైందా?

- మణిపూర్ ప్రజల ఆక్రోశం, మనోగతం ప్రతిఫలిస్తూనే ఉన్నది...
- కానీ అక్కడ ఉన్నది ప్రజా ప్రభుత్వమే. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్.

మణిపూర్ ఒకపక్క మండుతుండగానే మరోపక్క ప్రధాని మోడీ అమెరికా వెళ్ళాడు. రక్షణరంగంలో ఆ దేశంతో కీలక ఒప్పందాలు చేసుకున్నాడు. దిగ్గజ కంపెనీలు ఎన్నో ఆ సందర్భంగా భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ 'తాను మోడీకి అభిమాని' అని గర్వంగా ప్రకటించుకున్నాడు. తన కంపెనీ టెస్లా భారత్‌లో అరంగ్రేట చేస్తున్నదని చెప్పాడు.

- అక్కడ అలా... ఇక్కడ ఇలా...
- అవును. నిజమే. మణిపూర్ సరిహద్దు రాష్ట్రం. పొరుగుదేశాల నుండి శరణార్థులు రావచ్చు. కానీ వారూ మనలాంటి మనుషులే. మణిపూర్‌లో ప్రధాన తెగలు మైతేయి, కుకీ, నాగాలు. ఈ తెగల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నది.

సంఖ్యాపరంగా అధికంగా ఉన్న మైతేయి తెగను షెడ్యూల్ తెగల జాబితాలో చేర్చమని కేంద్రానికి సిఫారసు చేస్తూ రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పే తమకు శిరోధార్యమైనట్టు రాష్ట్ర ప్రభుత్వం అమలుకు పూనుకున్నది. కారణం రాష్ట్ర ముఖ్యమంత్రి బిరేన్‌సింగ్ మైతేయి తెగకు సంబంధించిన వ్యక్తి గనుక.

ఇక్కడే ఘర్షణకు బీజం పడింది. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా శక్తి సంపన్నులైన మైతేయిలకు కూడా షెడ్యూల్ తెగల్లో స్థానమిస్తే ఆదివాసీల మనుగడ ఏమిటి? వారి బిడ్డల భవిష్యత్ ఏమిటి? ఈ ప్రశ్నే జీవన్మరణ సమస్యలు ఇంతింతై... వటుడింతై మాదిరిగా కుకీ, నాగాల ముందు సాక్షాత్కరించింది.



తాము భయపడిందే జరుగుతున్నట్టు బిరేన్ ప్రభుత్వం కొండ ప్రాంతాల్లోని ఆ ఆదివాసిలను వేటాడి తరమడం మొదలైంది. మనుగడ కోసం పోరాటంలో ఆదివాసి యువత కొందరు ఉగ్రవాదులుగా మారుతున్నారు. ఆయుధాలు ధరిస్తున్నారు. మరికొందరు పాలకుల అండతో గంజాయి సాగు చేస్తున్నారు. 'ఉగ్రవాదం, గంజాయి సాగు' ఈనెపంతో కేంద్రం, రాష్ట్రం తమ దళాలను పంపుతూ ఆదివాసులపై దాడులను ముమ్మరం చేసింది.

రాష్ట్ర భూభాగంలో తొంభైశాతం కొండ ప్రాంతమే. అదే ఆదివాసీల జీవనాధారం, అభయారణ్యం, రిజర్వు ఫారెస్టు భూమి పోనువారి సాగుకు మిగిలింది స్వల్పభూమే. అదికూడా అన్యాక్రాంతమైతే ఎలా? బతుకు దారేది?

అందుకే పోరాటం అనివార్యమైంది వారికి. విజయమో.. వీరమరణమో అన్న పరిస్థితికి ఆదివాసిల స్థితి నెట్టబడింది. భావి భారతదేశంలో ఆదివాసీల స్థితి ఇకముందు ఇలా మారనుందా? అనే భయంకర ప్రశ్న ఉత్పన్నమయింది.

- ఓ.కే. బాగానే ఉన్నది. ముగింపు ఎలా...?
- ప్రకృతితో ఆదివాసి జీవనం సహజంగా పెనవేసుకుపోయి ఉంటుంది. విడదీయడం సాధ్యం కాదు. ఎవరైనా ఈ సత్యం తెలుసుకోవాలి. కొమరం భీమ్ నినదించినట్టు జల్ జంగ్ జమీన్ హమారా హై. ఎవడో వచ్చి ఎవడికో ఇమ్మంటే ఆదివాసిలు కొండప్రాంతం ఎందుకిస్తారు? ఎలా ఇస్తారు?

భారత రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్ తెగల జాబితాలోకి ఒకరిని చేర్చాలన్నా, జాబితా నుండి ఒకరిని తొలగించాలన్నా ఆ అధికారం రాష్ట్రపతికే ఉన్నది. ఏ కోర్టుకూ, ఏ ప్రభుత్వానికీ లేదు. చివరకు పార్లమెంటుకు కూడా.

మధ్యలో హోం మంత్రి అమిత్‌షా వచ్చాడు. చర్చలు జరిపాడు. కేవలం శాంతి భద్రతల విషయంగా పైపైన చూస్తే ఏం అర్థమవుతుంది. పైగా ఆదివాసులను రెండవ తరగతి పౌరులుగా అణచాలనే దుష్టబుద్ధి కూడా ద్యోతకమవుతున్నట్టు తెలుస్తున్నది. ఈ దేశ మూలవాసులైన ఆదివాసులే ఈ దేశస్థులు కాదనే విధంగా కొందరు మంత్రులు, అధికారులు, పోలీసులు వ్యవహరించడం సమస్యను మరింత జటిలం చేస్తున్నది.

- స్థానికతను ఆధారంగా చేసుకునే జమ్మూ కాశ్మీర్‌ను రెండు భాగాలుగా విడగొట్టినట్టు బీజేపీ చెప్పుకున్నది. కాశ్మీర్ ఫైల్స్ చిత్రంలో పండిట్స్ తమ ప్రాంతాల నుండి ఎందుకు పారిపోయారో చూపించారు కదా!
- కరెక్టుగా చెప్పారు. కానీ మణిపూర్‌లో బీజేపీ తత్ విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. ఇదే ముగింపు.
- భాషా సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు అన్ని అస్తిత్వంతో ముడిపడి ఉన్నాయి. చీమల పుట్టలోకి పాములను ఎగదోయాలని చూస్తే ఎలా కుదురుతుంది. మనుగడ కోసమే పోరాటమైనప్పుడు ప్రాణాలను ఎవరు మాత్రం లక్ష్యపెడతారు?

అలాగే మంటలను ఎగదోసేవారు చల్లారని ఎలా మాట్లాడతారు?

- స్థూలంగా బాగానే ఉంది స్టోరీ లైన్. స్క్రీన్‌ప్లే ప్లాన్ చేసుకోండి మరి టైటిల్?
- పాలకులకు ప్రజల పట్ల, ముఖ్యంగా బాధితుల పట్ల ప్రేమ ఉండాలి. శాంతిస్థాపన పట్ల చిత్తశుద్ధి ఉండాలి. అది లేనప్పుడు రోమ్‌నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తిలా ఫిడేలు వాయిస్తూనే ఉంటాడు. 'మంటల్లో మౌనరాగం'.

సెల్: 9959745723

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

చీల్చటం.. భయపెట్టడం

ఫిరాయింపులు, దర్యాప్తు సంస్థలే బీజేపీ బలం

- ప్రజల మద్దతు లేకున్నా అధికారం చెలాయిస్తున్న కాషాయపార్టీ
- ప్రతిపక్ష ప్రభుత్వాల కూల్చివేత
- దారికి రాకుంటే ఈడీ, సీబీఐల ప్రయోగం : విశ్లేషకులు



ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, భయపెట్టేందుకు, వేధించేందుకు అందివచ్చిన ఏ అవకాశాన్నీ బీజేపీ వదులుకోవడం లేదు. కమలదళం ప్రయత్నాలకు కొన్ని మీడియా సంస్థలు కూడా వంత పాడుతున్నాయి. అధికారాన్ని నిస్సిగ్గుగా దుర్వినియోగం చేయడం ఎంతమాత్రం ఆశ్చర్యాన్ని, దిగ్భ్రాంతినీ కలిగించడం లేదు. ఇటీవల మహారాష్ట్రలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు ఈ బీజేపీ నిజ స్వరూపాన్ని మరింత బయటపెట్టాయి. ఎన్నికలలో ప్రజల మద్దతు పొందడంలో విఫలమైనప్పటికీ ఎలాగైనా అధికార దర్పాన్ని అనుభవించాలన్న కోరికతో బీజేపీ ఆ రాష్ట్రంలో రెండు పర్యాయాలు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది. తాజాగా శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీని నిట్టనిలువుగా చీల్చడం బీజేపీ అధికార వ్యామోహానికి పరాకాష్టగా చెప్పవచ్చు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ ఎత్తుగడలు మరింతగా పెరిగే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

న్యూఢిల్లీ : కేంద్రంలోనూ, పలు రాష్ట్రాలలోనూ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు వాస్తవానికి ప్రజాబలంపై అధారపడి మనుగడ సాగించడం లేదు. ఆ పార్టీ కొన్ని రాష్ట్రాలలో ఫిరాయింపులను ప్రోత్సహించి దొడ్డిదారిన అధికారాన్ని అనుభవిస్తున్నది. మరికొన్ని రాష్ట్రాల్లో సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించి ప్రతిపక్ష నేతలను తన దారికి తెచ్చు కుంటున్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత సంవత్సరం జూన్‌లో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో 40 మంది శివసేన ఎమ్మెల్యేలు గోడ దూకారు. దీంతో అప్పటి వరకూ అధికారంలో ఉన్న మహారాష్ట్ర వికాస్ అఘాడీ (ఎంవీఏ) ప్రభుత్వం కుప్పకూలింది. శివసేనలో చీలికకు కారణమైన షిండేను ముఖ్యమంత్రి పదవి వరించింది. ఆ పార్టీని చీల్చడంలో తెరవెనుక పాత్ర పోషించిన బీజేపీ, ప్రభుత్వంలో భాగస్వామిగా కొనసాగుతున్నది. అయినా దాని అధికార దాహం తీరలేదు. ప్రభుత్వాన్ని సుస్థిరం చేసుకునేందుకు ఈసారి ఎన్సీపీపై కన్నేసింది. అప్పుడు షిండే పోషించిన పాత్రను ఇప్పుడు అజిత్ పవార్ తలకెత్తుకున్నారు. ఫలితంగా అజిత్ పవార్, మరో ఎనిమిది మంది ఎన్సీపీ ఎమ్మెల్యేలు మంత్రులయ్యారు.

కాంగ్రెస్ బలహీనపడడంతో...

వాస్తవానికి పార్టీ ఫిరాయింపులు ఈ దేశంలో కొత్తేమీ కావు. ఒకప్పుడు రాష్ట్రాల్లో ఫిరాయింపులను ప్రోత్సహించి, అధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ ఆ తర్వాత వాటికే బాధితురాలిగా మారింది. 'ఆయారాం గాయారాం'ల కారణంగా పలు రాష్ట్రాల్లో అధికారాన్ని కోల్పోయింది. నరేంద్ర మోడీ ప్రధాని పదవి చేపట్టకముందే బీజేపీ మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, గోవా రాష్ట్రాల్లో సొంతంగా ప్రభుత్వాలు ఏర్పాటుచేసింది. బీహార్, పంజాబ్ ప్రభుత్వాల్లో భాగస్వామిగా కొనసాగిం ది. 2014లో నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై దృష్టి సారించింది. అవి అధికారంలో ఉన్న చోట సామ దాన బేధ దండోపాయాలను ప్రయో గించింది. ఒక్కో రాష్ట్రాన్ని తన ఖాతాలో వేసుకుంటూ అధికారాన్ని పటిష్టం చేసుకుంది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం బలహీనంగా ఉండటం బీజేపీకి వరంలా మారింది. పలు రాష్ట్రాలలో కాంగ్రెస్ బలహీనపడడం, ఆ పార్టీ నుంచి పలువురు ప్రజా ప్రతినిధులు కమలదళంలోకి క్యూ కట్టడంతో బీజేపీ పరిస్థితి రొట్టె విరిగి నేతిలో పడినట్లయింది.

2014 లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పూర్తిగా చతికిలబడింది. కాంగ్రెస్‌కు ఎన్నడూ లేనంత కని ష్టంగా కేవలం 44 స్థానాలు మాత్రమే లభించాయి. ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకున్న కమలనాథులు హర్యానా, అసోం, ఉత్తరాఖండ్, ఉత్త రప్రదేశ్ రాష్ట్రాల్లో అధికారాన్నికైవసం చేసుకున్నారు. అదే సమయంలో బీజేపీ 'కాంగ్రెస్ ముక్త్ భారత్' ప్రాజెక్టును చేపట్టింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తన బుట్టలో వేసుకోవడానికి బలహీనంగా ఉన్న ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని వాడుకుంది. మూడింట రెండు వంతుల మంది ఎమ్మెల్యేలు పార్టీని వీడితే వారికి చట్టం వర్తించదన్న నిబంధన కమల దళం పాలిట వరంగా మారింది.

ప్రభుత్వాలను కూలుస్తూ...

2014 అసెంబ్లీ ఎన్నికలలో 60 స్థానాలున్న అరుణాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ 47 స్థానాలు గెలుచుకున్నప్పటికీ రెండు సంవత్సరాలు తిరగకుం డానే దాని బలం కేవలం ఒకే ఒక్క స్థానానికి పరి మితమైంది. ముఖ్యమంత్రి పెమా ఖండూ నేతృత్వం లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు గంపగుత్తగా పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్‌లో చేరిపోయారు. ఆ తర్వాత ఆయన బీజేపీతో చేతులు కలిపి ముఖ్య మంత్రిగా కొనసాగారు. 2017లో జరిగిన మణిపూర్ అసెంబ్లీ ఎన్నికలలోనూ కాంగ్రెస్‌కే ఎక్కువ స్థానాలు లభిం చాయి. అయినప్పటికీ ప్రాంతీయ పార్టీలైన ఎన్‌జీఎఫ్, ఎన్‌పీపీ, ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే మద్దతుతో బీజేపీ గద్దె ఎక్కింది. ఆ ఒకే ఒక్కడికి ఆ తర్వాత మంత్రి పదవి దక్కింది.

కర్నాటకలో 2008లో 'ఆపరేషన్ లోటస్'ను విజయవంతంగా అమలు చేసిన బీజేపీ, 2019లో కూడా దానిని పునరావృతం చేసింది. 13 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తన గూటికి చేర్చుకుంది. ముగ్గురు జేడీ(ఎస్) ఎమ్మెల్యేలు, ఒక కేపీజేపీ ఎమ్మెల్యే కూడా జత కలవడంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చింది.

కోవిడ్ సమయంలోనూ...

ఏడీఆర్ నివేదిక (2020) ప్రకారం 2014 తర్వాత వివిధ రాష్ట్రాలలో 405 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారారు. వీరిలో 182 మంది (44.9%) బీజేపీలో చేరారు. 170 మంది (42%) కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. 2020లో కోవిడ్ మహమ్మారి దేశం తలుపు తట్టిన సమయంలో కూడా బీజేపీ తన కుయుక్తులు మానలేదు. మధ్యప్రదేశ్‌లో 21 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను లాక్కుని కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చింది. ప్రజల మద్దతు లేకపోయినప్పటికీ మరో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగలిగింది.

బీజేపీలో చేరితే పవిత్రులే...

ఫిరాయింపులను ప్రోత్సహించి దొడ్డిదారిన అధికారంలోకి రావడంతో బీజేపీ సంతృప్తి చెంద లేదు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై తన అధీనంలోని దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం మొదలు పెట్టింది. ప్రతిపక్షాలకు చెందిన పలువురు నేతలను కేంద్ర దర్యాప్తు సంస్థలు వేధించాయి. 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత 121 మంది నేతలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ జరిపింది. వీరిలో 115 మంది బీజేపీ యేతర పార్టీ లకు చెందిన వారే. వేధింపులు భరించలేక బీజేపీ పంచన చేరాలని నిర్ణయించుకునే వారిపై మాత్రం దర్యాప్తు సంస్థలు కరుణ చూపాయి. కాంగ్రెస్ నుండి బీజేపీలో చేరిన అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మతో పాటు సువేందు అధికారి వంటి నాయకులపై నమోదైన కేసులు ఇప్పుడు ఎటు పోయాయో తెలియదు. కొందరి పైన నడుస్తున్న కేసులను ఉపసంహరించారు. అంటే బీజేపీలో చేరగానే వీరందరూ పవిత్రులు అయ్యారన్న మాట.

ఎన్నికలకు ముందు దాడులు

ఎన్నికలకు ముందు కేంద్ర దర్యాప్తు సంస్థల చేత ప్రతిపక్ష నేతల నివాసాలు, ఆస్తులపై దాడులు చేయించి వారిని చీకాకు పరచడం మరో ఎత్తుగడ. 2021 ఏప్రిల్‌లో... అసెంబ్లీ ఎన్నికలకు ముందు డీఎంకే అధినేత, ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమార్తె సెంథామరై ఆస్తులపై ఐటీ అధికారులు దాడులు చేశారు. తృణమూల్ ఎంపీ అభిషేక్ బెనర్జీ, ఆయన కుటుంబసభ్యుల ఆస్తులపై కూడా ఇలాగే దాడులు జరిపారు. కేరళ ఎన్నికలకు ముందు కూడా ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను అప్రదిష్టపాలు చేసేందుకు కుట్రలు చేశారు. బంగారం స్మగ్లింగ్ కేసులో పట్టుబడిన స్వప్న సురేష్ ముఖ్యమంత్రి ఆదేశానుసారమే నేరానికి పాల్పడ్డా రంటూ కట్టుకథలు అల్లారు. ఇక 2020 అక్టోబర్‌లో కర్నాటక కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ నివాసాలపై సీబీఐ దాడులు చేసింది. రాజస్థాన్‌లో ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, కాంగ్రెస్ నేత సచిన్ పైలెట్ మధ్య రాజకీయ వైరం కొనసాగుతున్న సమయంలోనే గెహ్లాట్ సన్నిహితులపై దాడులు జరిగాయి. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు హర్యానా కాంగ్రెస్ నేత భూపేందర్ సింగ్ హుడాపై భూసేకరణ కేసు పెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బీజేపీకి రాంరాం చెప్పిన తర్వాత ఆయనకూ ఇలాంటి పరిస్థితే ఎదురైంది.



దారికి రాకపోతే...

బీజేపీ దారికి రాని వారిపై మాత్రం దర్యాప్తు సంస్థల వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి. సీబీఐ, ఈడీలు ఒక దాని వెంట మరొకటి కేసుల మీద కేసులు పెడుతూ ప్రతిపక్ష నేతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీనికి ఉదాహరణ ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఆయన కుటుంబమే. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా మరో ఉదాహరణ. ఆయన ఇప్పటికీ ఊచలు లెక్కబెడుతూనే ఉన్నారు. రాజకీయ శత్రువులను అతి క్రూరమైన మనీ లాండరింగ్ చట్టంలోని నిబంధనల కింద నిర్బంధించడం పరిపాటిగా మారింది. బిశ్వశర్మ, అధికారి, నారాయణ్ రాణే వంటి నాయకులు బీజేపీలో చేరి కేసుల నుంచి బయటపడగా మిగిలిన వారు విచారణలను ఎదుర్కొంటూనే ఉన్నారు. ప్రత్యర్థులను దారికి తెచ్చుకునే ఎత్తుగడలను ప్రయోగించి గత సంవత్సరం మహారాష్ట్రలో ఎంవీఏ ప్రభుత్వాన్ని కూల్చారు. షిండే శిబిరంలో చేరక ముందు పలువురు ఎమ్మెల్యేలపై ఈడీ కేసులు ఉన్నాయి.

ఇటీవల బీజేపీలో చేరిన ఎన్సీపీ నేత అజిత్ పవార్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై సైతం ఈడీ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే అవకాశం ఉన్నప్పటికీ ఆయా శాసనసభాపతులు సకాలంలో నిర్ణయం తీసుకోవడం లేదు. మహారాష్ట్రలో షిండే నేతృత్వంలోని ఎమ్మెల్యేలపై శివసేన అనర్హత పిటిషన్ దాఖలు చేసినప్పటికీ సంవత్సర కాలంగా అది స్పీకర్ వద్ద పెండింగులోనే ఉంది.

బెంగాల్ పంచాయతీ ఎన్నికల ఫలితాలు వెల్లడి

- కౌంటింగ్ రోజునా రెచ్చిపోయిన టీఎంసీ గూండాలు



కొల్‌కతా : పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపును మంగళవారం ఉదయం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 జిల్లాలోనూ 339 కౌంటింగ్ కేంద్రాల వద్ద ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. సాయంత్రం 5:30 గంటల సమయానికి 23,344 గ్రామ పంచాయతీ స్థానాల ఫలితాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఇందులో అత్యధికంగా 16,330 స్థానాల్లో టీఎంసీ విజయం సాధించింది. బీజేపీ 3,790 స్థానాలను గెలుచుకుంది. వామపక్ష అభ్యర్థులు 1,365 స్థానాల్లో విజయం సాధించారు. ఇందులో సీపీఐ(ఎం) అభ్యర్థులే 1,206 మంది ఉన్నారు. వామపక్ష అభ్యర్థులు మరో 621 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారు. కాంగ్రెస్ 886 స్థానాల్లో విజయం సాధించింది. కొత్తగా ఏర్పడిన ఐఎస్‌ఎఫ్ 219 స్థానాల్లో విజయం సాధించింది. స్వతంత్రులు 718 స్థానాల్లో విజయం సాధించారు. పంచాయతీ సమితిలో 60 స్థానాల్లో టీఎంసీ విజయం సాధించింది. జిల్లా పరిషత్‌ల్లో టీఎంసీ 154 స్థానాల్లోనూ, 1 స్థానంలో సీపీఐ(ఎం) విజయం సాధించింది.

గ్రామపంచాయతీ మొత్తం సీట్లు 63,229. ఇందులో 6,238 సీట్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. పంచాయతీ సమితిలో మొత్తం సీట్లు 9,730. ఇందులో 759 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. జిల్లా పరిషత్‌లో మొత్తంగా 928 స్థానాలు ఉండగా, ఏకగ్రీవంగా 8 స్థానాలు ఎన్నికయ్యాయి. మొత్తంగా పశ్చిమ బెంగాల్‌లో 73,887 గ్రామ స్థానిక సంస్థల స్థానాలు ఉండగా, ఇందులో 7005 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో ఈ ఏడాది పోటీ లేకుండా ఎన్నికైన సీట్ల శాతం 9.48 శాతంగా ఉంది. మిగిలిన స్థానాలకు ఈ నెల 8న ఎన్నికలు జరిగాయి. ఈ పోలింగ్‌లో హింసాకాండ చోటు చేసుకోవడం అనేక స్థానాల్లో తరువాత రోజున రీపోలింగ్ నిర్వహించారు.

కౌంటింగ్ రోజునా రెచ్చిపోయిన టీఎంసీ గూండాలు

బెంగాల్‌లో పంచాయతీ ఎన్నికల ప్రారంభం నుంచి విధ్వంసానికి పాల్పడుతున్న టీఎంసీ గూండాలు చివరి అంకం కౌంటింగ్ రోజున కూడా రెచ్చిపోయారు. అనేక కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రతిపక్ష పార్టీల ఏజెంట్లపై దాడులకు దిగారు. అధికారులను భయభ్రాంతులకు గురి చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడి నిర్బంధం

పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో డైమండ్ హార్బర్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రాతికూర్ రహ్మాన్‌ను మంగళవారం పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. రహ్మాన్ అక్రమ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు ఆందోళనలకు దిగారు. సెంట్రల్ కొల్‌కతాలోని కాలేజ్ స్ట్రీట్‌ను దిగ్బంధించారు.

తృణమూల్ హింసాకాండను సమర్ధవంతంగా ఎదుర్కొన్నాం :సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ పంచాయితీ ఎన్నికల సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ కనివినీ ఎరుగని రీతిలో సాగించిన హింసాకాండను, ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ పోషించిన హేయమైన పక్షపాత పాత్రను అత్యంత సాహసోపేతంగా ఎదుర్కొన్నందుకు పశ్చిమ బెంగాల్ ప్రజలకు, వామపక్ష సంఘటన, ఇతర ప్రజాతంత్ర శక్తులకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో అభినందనలు తెలియచేసింది. జులై 8న రాష్ట్రవ్యాప్తంగా ఈ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల పోరు సందర్భంగా 60మంది చనిపోయారు. వందలాదిమంది గాయపడ్డారు. స్వేచ్ఛగా, సక్రమంగా జరిగే ఎన్నికల్లో ప్రజలు తమకు ఇష్టమైన వారికి ఓటు వేసుకునే ప్రజాస్వామ్య హక్కును తిరస్కరించడమే నిర్దిష్ట లక్ష్యంగా హింస చెలరేగింది. నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడంతో మొదలుపెట్టి, బలవంతంగా వాటిని ఉపసంహరించుకునేలా ఒత్తిడి తీసుకురావడం, స్క్రూటినీ క్రమాన్ని తారుమారు చేయడం, ఓటింగ్ రోజున హింసకు పాల్పడడం ఇలా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని దశల్లో భయంకరమైన రీతిలో భయోత్పాతాన్ని సృష్టించారు. చివరకు ఓట్ల లెక్కింపు రోజున కూడా ఈ హింసాకాండ తప్పలేదు.

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో భద్రతా సిబ్బందే తగినంత మంది లేరు, ఇక కోల్‌కతా హైకోర్టు ఆదేశించిన విధంగా కేంద్ర భద్రతా బలగాల మోహరింపు గురించి మాట్లాడే పనే లేదు. ఓట్ల లెక్కింపు కేంద్రాల నుండి ప్రతిపక్షాలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లను బయటకు పంపివేయడం, బ్యాలట్ బాక్సులు పగలగొట్టడం, ప్రతిపక్షాలకు ముఖ్యంగా వామపక్షాలు, వారి మిత్రపక్షాలకు ఓటు వేసిన బ్యాలట్ పత్రాలను విసిరివేయడం,గెలుపొందిన అభ్యర్ధులకు జారీ చేసే సర్టిఫికెట్లు బలవంతం గా లాక్కోవడం, ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఎంఎల్‌ఎలు, ఇతర అనధికార వ్యక్తులతో పెద్ద సంఖ్యలో తృణమూల్ కాంగ్రెస్ గూండాలు వుండడం వంటి ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. పాలక పార్టీ, ప్రభుత్వం ప్రతిపక్షా లను లక్ష్యంగా చేసుకున్నాయి. ప్రధానంగా వామపక్షాలు, కాంగ్రెస్, ఇతర మిత్రులపై దృష్టి కేంద్రీ కరించారు. బీజేపీతో మాత్రం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తూ వచ్చారు. అంటే ఇక పాలక పార్టీ గూండా యిజాన్ని ప్రధానం గా ఎదుర్కొన్నది వామపక్షాలు, కాంగ్రెస్, ఇతర బీజేపీ వ్యతిరేక, తృణమూల్ వ్యతిరేక శక్తులే అన్నది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వామ పక్షాలు, ఇతర లౌకిక మిత్ర పక్షాలకు చెందిన అభ్యర్థులను పెద్ద సంఖ్యలో గెలిపించి నందుకు ప్రజలను పొలిట్‌బ్యూరో ప్రత్యేకంగా అభినందించింది. పశ్చిమ బెంగాల్‌లో ప్రజా స్వామ్యం, ఐక్యత, శాంతి కోసం జరిగే పోరాటంలో ప్రజా ప్రతిఘటన అనేది కొత్త అంశంగా వుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

మనీలాండరింగ్ పరిధిలోకి జీఎస్టీ నెట్‌వర్క్

(మొదటిపేజీ తరువాయి)

ఉత్పత్తులపై జీఎస్టీని మినహాయించినట్టు తెలిపారు. కాగా సినీ ప్రేక్షకులకు కాస్త ఊరట నిచ్చే కబురును మంత్రి తెలియజేశారు. సినిమా హాళ్లలో విక్రయించే ఆహార పదార్థలపై జీఎస్టీ రేటును 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని కౌన్సిల్ నిర్ణయించినట్టు ఆమె తెలిపారు. కాగా ప్రయివేటు అంతరిక్ష పరిశోధన సంస్థలకు మరో నజరానా ప్రకటించారు.

ప్రయివేట్ సంస్థలు ప్రయోగించే ఉపగ్రహలపై జీఎస్టీ పూర్తిగా మినహాయింపు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఎంయూవీలపై 22 శాతం సెస్ రేటును కౌన్సిల్ ఆమోదించినట్టు తెలిపారు. కరిగే పేస్ట్, ఎల్‌డీ స్లాగ్‌తో సహా నాలుగు వస్తువులపై రేట్లను 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించామని తెలిపారు.

క్యాసినోలపై 28 శాతం జీఎస్టీ

ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలపై ఇక నుంచి 28 శాతం జీఎస్టీ విధించనున్నట్టు తెలిపారు. అయితే ప్రత్యేక పరిశ్రమను లక్ష్యంగా చేసుకొని ఈ నిర్ణయం చేయలేదని మంత్రి వ్యాఖ్యానించారు. పర్యాటక రంగంలో క్యాసినో కీలక భాగమని ఆమె అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ ఉద్దేశం కాసినోలతో ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమను లేదా రాష్ట్రాలను దెబ్బతీయడం తమ ఉద్దేశం కాదన్నారు. అయితే దీనిపై కొన్ని రాష్ట్రాలు ఆందోళనలను వ్యక్తం చేశాయని పేర్కొన్నారు.



తెలంగాణకు జీఎస్టీ పరిహారం ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

నిబంధనలకు సవరణలను సిఫార్సు చేసినందుకు లా కమిటీ సకాలంలో జోక్యం చేసుకోవడం అభినందనీయ మన్నారు. అదే సందర్భంలో లావాదేవీలు చేస్తున్న ఇతర రాష్ట్రాల్లో రిజిస్టర్ చేయబడిన నిర్దిష్ట పన్ను చెల్లింపుదారులు తప్పుగా సరఫరా స్థలాన్ని ప్రకటించారు. దాంతో వినియోగ స్థితి పేరు తప్పుగా ఉంటుందని, దీనివల్ల జీఎస్టీ ఆదాయం మళ్లిందని అన్నారు. ఐసీఐసీఐ లిమిటెడ్, మహారాష్ట్ర విషయంలో తెలంగాణ రాష్ట్రానికి రూ.82.38 కోట్ల బకాయిలు ఉన్నాయని, ఈ సమస్య కేవలం తెలంగాణాలోనే కాదు, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, లడఖ్, ఢిల్లీ వంటి ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కూడా ఉందని అన్నారు.

ఈ సమస్యను గతంలో (47వ జీఎస్టీ సమావేశం) కౌన్సిల్ దృష్టికి కూడా తీసుకొచ్చానని, దానికి రెవెన్యూ కార్యదర్శి త్వరితగతిన పరిష్కారాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయినప్పటికీ, ఇప్పటి వరకు అటువంటి యంత్రాంగాన్ని ఏర్పాటు చేయలేదని, సమస్య పరిష్కరించలేదని అన్నారు. అందువల్ల, ఈ సమస్యపై ప్రత్యేకంగా ఒక మంత్రుల గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు.

వెనుకబడిన జిల్లాలకు నిధులు విడుదల చేయాలి

తెలంగాణలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

2015-16, 2016-17, 2017-18, 2018-19, 2020-21 సంవత్సరా లకు గాను ఏడాదికి రూ.450 కోట్లు మేర నిధులు ఇచ్చా రని, 2014-15, 2019-20, 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాలకు గాను తెలంగాణకు నిధులు మంజూరు చేయలేదని తెలిపారు. అందువల్ల తెలంగాణలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు గాను ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

జేపీఎస్, వీఆర్‌ఏలకు తీపి కబురు

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు.

వీఆర్‌ఏలతో చర్చలకు కేటీఆర్ నేతృత్వంలో మంత్రి వర్గ ఉపసంఘం

రాష్ట్రంలో పనిచేస్తున్న విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (వీఆర్‌ఏ)లను, వారి విద్యార్హతలు, సామర్థ్యాలను అనుసరించి ఇరిగేషన్ సహా ఇతర శాఖల్లో సర్దుబాటు చేసి వారి సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు నిర్ణయించారు.

ఈ నేపథ్యంలో వీఆర్‌ఏలతో సమావేశమై, చర్చించి వారి అభిప్రాయాలను సేకరించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఇందుకు గాను మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆధ్వర్యంలో మంత్రులు జి.జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్‌లతో కూడిన మంత్రి వర్గ ఉప సంఘాన్ని సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారు. ఆయన ఆదేశాల మేరకు మంత్రివర్గ ఉపసంఘం వీఆర్‌ఏలతో బుధవారం నుంచి చర్చలు ప్రారంభించనుంది. చర్చల అనంతరం ఉప సంఘం సూచనల ప్రకారం నిర్ణయాలు తీసుకుని వీఆర్‌ఏల సేవలను వినియోగించుకునే దిశగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఉప సంఘం కసరత్తు పూర్తయి తుది నివేదిక సిద్ధమైన తర్వాత మరోసారి చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం వారంలోపు పూర్తి కావాలని ఆదేశించారు.

హిమాచల్ బాధితులకు ఏపీ, తెలంగాణ భవన్‌లో హెల్ప్ లైన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

భారీ వర్షాల కారణంగా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరా ఖండ్‌తో పాటు ఇతర ప్రభావిత రాష్ట్రాలలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసులకు సహకారం అందించటానికి ఏపీ ప్రభుత్వం హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. బాధితులు ఓఎస్‌డి పి.రవి శంకర్ (ఫోన్ నెంబర్ 9871999055), జూనియర్ అసిస్టెంట్ కె. సునీల్ కుమార్ (ఫోన్ నెంబర్ 8800924911)లను సంప్రదించాలని కోరింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కూడా హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. బాధితులు జి.రక్షిత్ (ఫోన్ నెంబర్ 9643723157), వందన (9871999044)ను సంప్రదించాలని కోరింది.

శాసనసభలో బోనాలు

మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర శాసనసభా ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన బంగారు మైసమ్మ బోనాలకు శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు. పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సకాలంలో వానలు కురిసి రాష్ట్రం పచ్చగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలనీ, కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రిగా కావాలని అమ్మ వారిని కోరుకున్నారు. శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్, విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట్ మహంకాళి బోనాలకు

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆహ్వానం

నవతెలంగాణ -హైదరాబాద్



అంబర్‌పేట్ మహంకాళి దేవస్థాన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించే ఆషాడ మాస బోనాలకు తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రివర్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆహ్వానిస్తూ అంబర్‌పేట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కె. దుర్గాప్రసాద్ రెడ్డి, మాజీ కార్పొ రేటర్ జ్ఞానేశ్వర్ గౌడ్, దేవస్థాన సమితి అధ్యకులు శంకర్ గౌడ్‌తో పాటు కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ బోనాలకు కుటుంబ స మేతంగా విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. కార్య క్రమంలో అంబర్‌పేట్ దేవస్థాన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఒడి బియ్యం సమర్పించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ-నాగోల్

హైదరాబాద్‌లోని జియాగూడ, ఇందిరా నగర్ కాలనీలోని నల్ల పోచమ్మ, ముత్యాలమ్మ దేవాలయాల్లో ఆషాఢ మాస బోనాల పండుగ (ఉత్సవాలు) సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అంతర్జాతీయ వైశ్య సామాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి, టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త ఒడి బియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా పోత రాజుల విన్యాసాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం మూడో సారి కూడా అధికారం చేపట్టాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాద శ్రీనివాస్, కృష్ణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాలనీల్లో రోడ్లు వేయాలని వినతి



నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో క్రిస్టియన్ కాలనీ, శ్రీనివాసపురం కాలనీ, నాగార్జున కాలనీల ప్రెసిడెంట్లు మంగళవారం కాలనీల్లో సీసీ రోడ్లు వేయాలని కోరుతూ జోనల్ కమిషనర్ పంకజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వనస్థలిపురం డివిజన్ పరిధిలోని కాలనీల్లో వచ్చే వానకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, మోహన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని జల్ పల్లి మున్సిపాలిటీలో 4 కోట్ల రూపాయల నిధులతో 11,12,13,14,15 వార్డులలో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా రూ.100 కోట్లతో జల్‌పల్లి మున్సిపల్‌లో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ అన్ని వార్డుల్లో వాటర్ లైన్లు, డ్రైనేజీ, వీధి లైట్లు లాంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారని.. ఆ దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

షెడ్యూల్ కులాల సేవా సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ ఇచ్చారు. జల్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రీమియర్ ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను మంత్రి పంపిణీ చేశారు. ఇప్పటివరకు 500 మందికి శిక్షణ ఇప్పించి..మిషన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మన్ సయ్యద్ యూసుఫ్ పటేల్, కమిషనర్ వసంత, కో ఆప్షన్ సభులు సూరెడ్డి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు శంషోద్దీన్, కే.లక్ష్మినారాయణ, పి.శంకర్, షేక్ పమిద అఫ్జల్, యాహియా, మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు నాసర్ వల్లి, మీడియా సెల్ కన్వీనర్ వాసు బాబు, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు, తోపుడు బండ్ల పంపిణీ



నవతెలంగాణ -నాగోల్

జేసీఐ హైదరాబాద్ రాయల్స్ టీం, రైస్ ఏటీఎం వారి సంయుక్త ఆధ్వర్యంలో నిరుపేదలకు మంగళవారం కుట్టు మిషన్లు, తోపుడు బండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైస్ ఏటీఎం వ్యవస్థాపకులు, సామాజిక కార్యకర్త దోస పాటి రామ్ మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుండి హైదరాబాద్ నగరానికి వలసలు వచ్చిన పేదలకు సకాలంలో సరైన జీవనోపాధి దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కుటుంబాలకు తోచిన సహాయ, సహకారాలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. 16 మందికి కుట్టు మిషన్లు, 6 మందికి తోపుడు బండ్లను అందజేసినట్లు తెలిపారు.

పీర్జాదిగూడలో ఘనంగా సీత్ల భవాని పండుగ



నవతెలంగాణ - బోడుప్పల్

సంత్ సేవాలాల్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సీత్ల భవాని పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ సుభాష్ నాయక్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... గిరిజనులు సంప్రదాయం ప్రకారం ఆషాఢ మాసంలో తొలకరి విత్తనాలు వేసిన తర్వాత సీతాల భవాని పండుగను జరుపుకుంటారని తెలిపారు. అనంతరం కార్పొరేటర్ సుభాష్ నాయక్ మాట్లాడుతూ... కోరిన కోర్కెలు తీర్చే తల్లి సీతాల దేవి పండుగను ప్రతియేట ఐక్యమత్యంతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అనంతరం వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, పోచారం డిప్యూటీ మేయర్ రెడ్యానాయక్, బోడుప్పల్ కార్పొరేటర్ సుమన్ నాయక్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు తుంగతుర్తి రవి, మహిళ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీలత బద్రు నాయక్, బంజారా సంఘం అధ్యక్షుడు సక్కునాయక్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రాథోడ్, కోశాధికారి లింగు నాయక్, కమిటీ సభ్యులు, బంజారా పెద్దలు, నాయకులు, బంజారా కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'కొండాపూర్

రైల్వే బ్రిడ్జి నిర్మాణం మంత్రి మల్లారెడ్డితోనే సాధ్యం'



నవతెలంగాణ- ఘట్కేసర్

కొండాపూర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం ఒక్క రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డితోనే సాధ్యం అవుతుందని ఘట్కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది మంత్రులు వచ్చారు కానీ కొండాపూర్ రైల్వే వంతెన నిర్మాణం కాలేదన్నారు. మంత్రి మల్లారెడ్డి నాలుగైదు నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయబోతున్నారని తెలిపారు. మూడు రోజుల కిందట మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు 400 మంది రాజీనామా చేస్తున్నారని కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. 400 మందిలో ఏ ఒక్కరూ రాజీనామా చేయలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, వైస్ చైర్మన్ పలువుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు కొమ్మగోని రమాదేవి, మైపాల్ గౌడ్, బండారి ఆంజనేయులు, కొమ్మిడి అనురాధ, కడుపోల్ల మల్లేష్, సల్లూరి జ్యోతి, జాంగిర్ భాయ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మేకల నరసింహారావు, సుధాకర్ రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి'



నవతెలంగాణ-ఘట్కేసర్

అకారణంగా తమపై దాడిచేసి, గాయపరిచిన వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని బాధిత వ్యక్తులు డిమాండ్ చేశారు. ఘట్కేసర్ మండలం చౌదరిగూడ అనుబంధ గ్రామం మక్తా గ్రామంలో మంగళవారం బాధితులు నర్సింగ్‌యాదవ్, క్రాంతి, పోచయ్య, భరత్, సాయికుమార్‌లు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాధితులు దాడికి సంబంధించిన విషయాలను వెల్లడించారు. పాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తాము సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల వద్ద గొడవ జరుగుతుందని తెలుసుకుని అక్కడికి చేరుకున్నట్లు చెప్పారు. మేము పోట్లాడుకోవద్దని వారిని మందలించిన పాపానికి నారపల్లికి చెందిన అజర్, సమీర్, జయప్రకాష్, శివ, అవినాష్, సాయి, జహీర్ తమపై కత్తులు, కర్రలతో దాడికి దిగి తీవ్రంగా గాయపరిచినట్లు వివరించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ కేసు పెట్టలేదన్నారు. నిందితులకు కాపాడేందుకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు ఈ కేసును నొక్కి పెడుతున్నారని ఆరోపించారు. తమపై దాడులు చేసిన వ్యక్తులపై అనేక కేసులు ఉన్నాయని, తమకు బెదిరింపు ఫోన్లు కూడా వస్తున్నాయని, మాకు ప్రాణభయం ఉందని..తమకు ఏమి జరిగినా వారిదే బాధ్యత అని పేర్కొన్నారు. పోలీసులపై తమకు నమ్మకం ఉందని.. దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

'గాయత్రీ నగర్ బ్యాంక్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా'



నవతెలంగాణ -వనస్థలిపురం

గాయత్రీ నగర్ బ్యాంక్ కాలనీలోని ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్ బ్యాంక్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలోని డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి పైప్లైన్, రోడ్లు, వీధి దీపాలు, తదితర సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే ఒక్కొక్కటిగా కాలనీలోని ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షురాలు సరస్వతి, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఉపాధ్యక్షులు రవీందర్, కార్యవర్గ సభ్యులు మధు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడు.. దొరకడు..

- ప్రజలకు అందుబాటులో ఉండని కమిషనర్
- ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండానే సెలవులు
- టీఎస్ బీపాసుకు తూటు పొడుస్తూ.. అనుమతి పొందిన భవన నిర్మాణలకు సైతం కూల్చివేతలు...
- ఆఫీస్ వాహనాలతో పాటు వ్యక్తిగత వాహనాలలో సైతం మున్సిపల్ డీజిల్...
- బాధితుల నుండి మేయర్‌కు ఫిర్యాదుల వెల్లువ...





నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ పనితీరు పేరు గొప్ప ఊరు దిబ్బగా తయారైంది... ఒకవైపు మేయర్, పాలకవర్గం సమిష్టి కృషితో నగరం జాతీయ, రాష్ట్ర స్థాయిలో అనేక అవార్డులు అందుకుని అభివద్ధిలో శరవేగంగా దూసుకుపోతూ ప్రశంసలు పొందుతుంటే... మరో వైపు కొత్తగా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన పనితీరు సర్వత్రా విమర్శలకు తావిస్తున్నది. సాధారణ ప్రజల నుంచి ప్రజా ప్రతినిధులు వరకు ఆయన పనితీరు పట్ల అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మొదలు అసలు ఆఫీసుకు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో కూడా తెలియకుండాపోయిందని పలువురు వాపోతున్నారు. పలు సమస్యల గోడు చెప్పుకుందామని వచ్చే ప్రజలు వెనుతిరిగిపోవడం పరిపాటిగా మారింది. నగర పరిధిలో మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా రూ.4.92 కోట్లతో చేపట్టిన పలు అభివద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి సైతం ఆయన డుమ్మా కొట్టడం పలువురికి ఆశ్చర్యానికి గురిచేసింది. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన టీఎస్ బీ పాస్‌కు తూట్లు పొడుస్తూ షో కాజ్ నోటీసులు అందజేస్తూ, కాలయాపన చేస్తూ.. ఇచ్చిన అనుమతులు సైతం రద్దు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. అలాగే అనుమతి పొందిన భవన నిర్మాణం సైతం కూల్చివేసినట్టు తెలిసింది. ఒకవైపు అనుమతులు రాకపోవడం మరో వైపు కట్టిన డబ్బులు సైతం తిరిగి రాకపోవడంతో ప్రజలు ఏం చేయాలో తెలియక దిక్కుతోచని పరిస్థితిలో మేయర్, కార్పొరేటర్లకు మొరపెట్టుకుంటున్నారు. సొంత ఇల్లు కట్టుకోవడం దేవుడెరుగు... కట్టుకున్న గూడు కూడ కూల్చేస్తారేమోనని భయాందోళనలో పక్క ప్రాంతాలకు వెళ్లి నివాసం ఉండే ఆలోచన చేస్తుండటం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మొదలు నేటి వరకు కనీసం పుట్టిన బిడ్డకు, చనిపోయిన వారి కుటుంబ సభ్యులు చెప్పులు అరిగే దాకా కార్యాలయం చుట్టూ తిరిగినా ఇప్పటివరకు ఒక్క సర్టిఫికెట్ సైతం జారీ చేయకపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 50 మంది ఇంటి అనుమతులకోసం దరఖాస్తులు చేసుకుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవిన్యూ అధికారులు అనుమతులు ఇచ్చినప్పటికి అందులో కనీసం 30 మంది దరఖాస్తులకు ఎలాంటి ఫీల్డ్ వెరిఫికేషన్ చేయకుండానే తిరస్కరిస్తుండడంతో ప్రజలు, ప్లానర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెప్పాపెట్టకుండా సెలవులు

కార్యాలయానికి రాకపోవడం కనీసం మున్సిపల్ అధికారులకు గాని ఉన్నతాధికారులకు కలెక్టర్, అడిషినల్ కలెక్టర్‌కు సైతం ఎలాంటి సమాచారం అందించకుండా వారానికి 3 పని దినాలు కమిషనర్ సెలవులపై వెళ్లి ప్రజల సమస్యలను గాలికొదిలేస్తున్నారని, మున్సిపల్ వాహనాలతో పాటు వ్యక్తిగత వాహనాలకు సైతం మున్సిపల్ డీజిల్ వాడుకోవడం, అలాగే హొటల్స్, రెస్టారెంట్ లలో సైతం మున్సిపల్ సిబ్బందిపై ఒత్తిడి చేసి బిల్లులు కట్టిస్తున్నారని విశ్వసనీయ సమాచారం. ఇదిలా కొనసాగితే అభివద్ధిలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిన నగరం భవిష్యత్ అగమ్యగొచరంగా మారుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ పై వస్తున్న విమర్శలపై వివరణ అడిగేందుకు "నవతెలంగాణ ప్రతినిధి" ప్రయత్నం చేయగా కార్యాలయంలో ఆయన అందుబాటులో లేరు. అలాగే ఫోన్‌లో కూడా అందుబాటులోకి రాలేదు.

మార్నింగ్ వాక్‌లో కాలనీల సందర్శన



నవతెలంగాణ- వనస్థలిపురం

హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి మంగళవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా కమల నగర్, పలు కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాలనీ వాసులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



- బ్యాంక్ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్ పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతులు, పేద ప్రజల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని నాదర్‌గుల్ ది భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం బ్యాంకు చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని రైతు సేవా సహకార సంఘం బ్యాంకు కార్యాలయంలో మంగళవారం ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం..సహకార సంఘం బ్యాంకు డైరెక్టర్ల, ఖాతాదారుల సహకారంతో ప్రస్తుతం రూ.30 కోట్ల రూపాయల నిధులతో లావా దేవీలు జరుగుతున్నాయన్నారు. రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఆర్థికాభివద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా అన్ని రకాల విత్తనాలు, ఎరువులను రైతులకు ఎల్లపుడు అందుబాటులో ఉంచుతుందన్నారు. బ్యాంకు ద్వారా ఇప్పటికీ రూ.13కోట్ల బంగారు ఆభరాణాలపై రుణాలు, రూ.8కోట్ల వివిధ రకాల వ్యాపార రుణాలు, రూ.2కోట్ల పంట రుణాలు, రూ.50లక్షల దీర్ఘ కాలిక రుణాలను అందచేయటం జరిగిందన్నారు. ప్రస్తుతం బ్యాంకు రూ.4కోట్ల రూపాయల నిధులతో లాభాల బాటలో నడుస్తుందన్నారు. 12మంది బ్యాంకు డైరెక్టర్లు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారుల సహకారంతో బ్యాంకు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు.

ఎన్నికలు సమీపిస్తున్నప్పుడే

ప్రజా సమస్యలు గుర్తుకొస్తాయా..?



నవతెలంగాణ- ఉప్పల్

ఉప్పల్ నియోజకవర్గంలో నాలుగున్నర సంవత్సరాలలో ఎలాంటి అభివృద్ధి చేశారని..ఎన్నికల సమీపిస్తున్నప్పుడే ప్రజా సమస్యలు గుర్తుకొస్తాయా అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాగిడి. లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా కొబ్బరికాయలు కొట్టడం, శిలాఫలకాలు ఏర్పాటు చేయడమే అభివృద్ధా అని నిలదీశారు. ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి పాదయాత్ర చేసిన పలు డివిజన్లో ప్రజా సమస్యలు తాండవిస్తున్నాయని ఆరోపించారు. చిల్కానగర్ మల్లాపూర్ డివిజన్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని.. రోడ్లు మొత్తం గుంతల మయంగా మారాయని వెల్లడించారు. చిల్కానగర్ డివిజన్లోని ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నా ఎందుకు అడ్డుకోవడం లేదని..ప్రజా సమస్యలపై చిల్కానగర్ రచ్చబండకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వినోద్ కుమార్ ,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బోనాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



నవతెలంగాణ-సంతోష్ నగర్

బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఓల్డ్ మలక్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ ఎండీ సైఫుద్దీన్ షఫీ అన్నారు. డివిజన్ పరిధిలో దేవాలయం వద్ద పరిశుభ్రత, పరిరక్షణ, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, యువకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలపై ప్రభుత్వం చిన్న చూపు'



నవతెలంగాణ-హయత్ నగర్

కార్మికుల సమస్యలపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ మండిపడ్డారు. మధ్యాహ్న భోజన కార్మికులు వంట వార్పు చేయకుండా, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న టోకెన్ సమ్మెలో భాగంగా మంగళవారం హయత్ నగర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గతంలో మధ్యాహ్నం భోజన కార్మికుల జీతాలు పెంచామని చెప్పి.. ఇప్పటికీ వారికి పెండలేదని విమర్శించారు. దానికి తోడు మరెన్నో సమస్యలు వారిని వెంటాడుతున్నా తమకేమీ పట్టనట్లు ప్రభుత్వం వ్యవహరించడం చాలా బాధాకరమైన విషయమన్నారు. నేడు కలెక్టర్ ఆఫీస్ దగ్గర జరిగే ధర్నాకి కార్మికులందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. అప్పటికీ సమస్యలు పరిష్కరించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు, లక్ష్మమ్మ, రమాదేవి, మంజుల, భాగ్యం తదితరులు పాల్గొన్నారు.

జనాభా పట్ల అవగాహన కల్పించాలి

- మేడ్చల్-మల్కాజిగిరి డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్



నవతెలంగాణ-సిటీబ్యూరో/ ఉప్పల్

జనాభా సమస్యలు, కుటుంబ నియంత్రణ ప్రాముఖ్యత, మాతా శిశుఆరోగ్యం, గర్భనిరోధక సాధనాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తెలిపారు. రామంతపూర్‌లోని మల్టీ పర్పస్ జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కల్పించాలన్నారు. పెరుగుతున్న జనాభా కొరత వనరులను దెబ్బతీస్తోందనీ, దీంతో నిరుద్యోగం, పేదరికం వంటి సమస్యలు సమాజానికి పెద్ద సవాళ్లుగా మారుతున్నాయని తెలిపారు. ఎప్పటికికప్పుడు మంత్రి హరీశ్‌రావు, మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ ఆదేశాలను పాటిస్తూ ముందుకెళ్తున్నట్టు చెప్పారు. ఆరోగ్య తెలంగాణ దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. తర్వాత తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి అన్నారు. అనంతరం వైద్య, ఆరోగ్య శాఖలో ఉత్తమంగా పని చేస్తున్న సిబ్బందికి మెరిట్ సేవలకు సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి అండ్ కీసర డివిజన్ ఉప జిల్లా వైద్యాధికారులు డా.నారాయణరావు, డాక్టర్ ఆనంద్, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సంధ్య, డాక్టర్ సరస్వతి, డాక్టర్ రఘునాథ్ స్వామి, డాక్టర్ కౌశిక్, శేషుపద్మ, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది పాలుబాయి ఈశ్వర్, మంజుల (డిపిఓ) సూపర్‌వైజర్స్ విజయ్ కుమార్, బోగి ప్రకాష్, శ్రీనివాస్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని వివిధ పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇదేనా విశ్వ నగరం..?: మల్‌రెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

హైదరాబాద్‌ను విశ్వ నగరంగా తీర్చిదిద్దామని చెప్పుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి నెలల తరబడి ఏరులై పారుతున్న మురుగునీరు కనిపించడం లేదా అని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాంరెడ్డి ప్రశ్నించారు. నాగోల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మంజులా రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నాగోల్‌లోని పలు కాలనీలలో మల్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని నెలలుగా బండ్లగూడ ఆనంద్ నగర్ మెయిన్ రోడ్‌లో మురుగునీరు రోడ్డుపై పారుతోందని..అయినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ ప్రాంతంలో గత మూడు నెలలుగా చాలా ప్రమాదాలు జరుగుతాయని కాలనీ వాసులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోనులో మాట్లాడి తక్షణమే సమస్య పరిష్కారించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధీర్ రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ గాంధీ నాయక్, కొత్తపేట డివిజన్ అధ్యక్షులు కిషోర్ గౌడ్, గడ్డి అన్నారం డివిజన్ అధ్యక్షులు వేణు యాదవ్, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, యూత్ కాంగ్రెస్ జైపాల్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ సాయి, శ్రీరాములు, ప్రభాకర్ రెడ్డి, అరుణ్, లాలయ్య గౌడ్, సత్యనారాయణ రెడ్డి, రమేష్ రెడ్డి, మహేష్, బాలచందర్, కల్పనా రెడ్డి, వై భాను, సంగీత పాల్గొన్నారు.

ఆలయ కమిటీలకు చెక్కులు అందజేత



నవతెలంగాణ-కంటోన్మెంట్

బోనాలను ఘనంగా నిర్వహించాలని కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పలు దేవాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను ఆలయ కమిటీలకు మంగళవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. వెస్ట్ మారేడ్ పల్లిలోని మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీనివాసుయాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్య, నందిత, నివేదిత, రాష్ట్ర బేవరేజ్ కార్పొరేషన్ ఛైర్మెన్ గజ్జల నాగేష్ చెక్కులను అందజేశారు.

బాలరాజు కుటుంబానికి అండగా బొంతు రామ్మోహన్



నవతెలంగాణ-కాప్రా

రెండు నెలల క్రితం మృతిచెందిన జీయూటీఎస్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ బాలరాజు కుటుంబానికి బొంతు రామ్మోహన్ దంపతులు మంగళ వారం ఆర్థిక సాయం అందజేశారు. ఇంతకుముందే బాలరాజు కుమారులు చరణ్‌సాయి, ధనుష్ చదువులకు అయ్యే ఫీజు, పుస్తకాలు అందజేశారు. ఆయన భార్య మనీషాకు జీహెచ్‌ఎంసీలో ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. రామ్మోహన్ వెంట చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, సీనియర్ నాయకులు నాగిళ్ల బాల్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, ధనుంజయ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, భాను చందర్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు బండారి లక్ష్మారెడ్డి ఆర్థిక సాయం




నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ ఈసీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నాగరాజు కొన్ని రోజుల నుంచి హార్ట్ సంబంధిత వ్యాధితో బాధపడు తున్నారు. విషయం తెలుసుకున్న బీఎల్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బండారి లక్ష్మారెడ్డి మంగళవారం బాధితుడిని పరా మర్శిం చి ఆర్థిక సాయం చేశా రు. బీఎల్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ నేమూరి మహేష్‌గౌడ్, రాష్ట్ర ఆటో, వ్యాన్ డ్రైవర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నబి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సారయ్య యాదవ్ ,జాయింట్ సెక్రెటరీ సతీష్‌గౌడ్, చర్లపల్లి ఆటో అధ్యక్షుడు అశ్విన్ రాజ్, ఉప్పల్ బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

3 ఎకరాల్లో డ్వాక్రా భవనం నిర్మాణం చేస్తా

- మోడల్ సిటీగా జవహర్‌నగర్
- కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- రూ.12 కోట్ల రుణాల చెక్కు అందజేత



నవతెలంగాణ-జవహర్‌నగర్

మహిళలకు మూడు ఎకరాల్లో డ్వాక్రభవనం నిర్మాణం చేస్తామని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మహిళలు బాగుపడితేనే దేశం బాగుపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు రాజకీయాల్లో అవకాశం కల్పిస్తే పరిపాలనలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాల యంలో మేయర్ మేకల కావ్య అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమానికి హాజరై డ్వాక్రా సంఘాలకు రూ.12కోట్ల రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడారు. మహిళ రక్షణలో దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చే రుణాలతో మహిళలు వ్యాపారాలు చేసి కోట్ల రూపాయల టర్నోవర్ రాబట్టాలన్నారు.కోట్ల రూపా యలతో జవహర్ నగర్ కార్పొరేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఆర్థికంగా ఉంటే ప్రతి కుటుంబంలో మహిళలే మహారాణులని సూచించారు. కార్పొరేషన్‌లో డ్వాక్రా భవనం ఏర్పాటుకు 3ఎకరాల స్థలం కేటాయించి విశాలమైన భవనం నిర్మాణం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డులో చెత్త నుంచి విద్యుత్ ఉత్పతి చేస్తున్నది తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. డ్వాక్రా మహిళలు చనిపోతే బ్యాంక్‌లోన్ మాఫీ చేసేందుకు సీఎం కేసీఆర్‌తో మాట్లాతానని తెలిపారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను మాడల్ సీటీగా మారుస్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, బ్యాంకు అధికారులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మహిళా సంఘాల నాయకురాలు శోభారెడ్డి, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

యాప్రాల్‌లో ప్రభుత్వ భూమిని కాపాడాలి





- సీపీఐ అల్వాల్ మండల కార్యదర్శి సహదేవ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ అల్వాల్ మండల కార్యదర్శి సహదేవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో భూ బకాసురులు విచ్చలవిడిగా భూ కబ్జాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సర్వే నెంబర్ 171లోని భూమిని కబ్జా చేసి రాత్రి సమయాల్లో ట్రాక్టర్లతో మట్టిని నింపుతున్నారని పేర్కొన్నారు. గతంలో యాప్రాల్ లోని ప్రభుత్వ భూమిలో బోర్డు పెట్టినా అక్రమార్కులు బోర్డును మట్టిలో కప్పారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ భూములను కాపాడాలని ఆయన కోరారు. విషయం ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వ భూములో ట్రాక్టర్లతో మట్టి నింపినా, కబ్జా చేయాలని చూసినా చర్యలు తప్పవని హెచ్చరించారని తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ



నవతెలంగాణ-మల్కాజిగిరి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి బంగారు నర్సింగారావు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ పిలుపులో భాగంగా మల్కాజిగిరి మండల పరిధిలోని మండల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ ఆఫీస్ ముందు మధ్యాహ్న భోజన కార్మికులతో నిర్వహించి ఎంఈవో శశిధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా పెంచిన వేతనాన్ని అమలు చేయా లని కోరారు. జీవో ఎంఎస్ నెంబర్ 8 ప్రకారం ఏరియల్ ఇవ్వాలన్నారు. పెండిం గ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన నిర్వహణ స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వకూ డదని పేర్కొన్నారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని వివరించారు. గ్యాస్ సబ్సిడీ మీద ఇస్తూ, కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాల న్నారు. కార్మికులను అక్రమంగా తొలగించ కుండా ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాన్నారు. పమాద బీమా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. వంటషెడ్లు, వంట పాత్రలు, కనీస వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ధర్నాలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కృపాసాగర్, సీఐటీయూ మల్కాజిగిరి మండల నాయకురాలు ఎర్రోళ్ల సుమిత్ర, మధ్యాహ్న భోజన కార్మికరాలు సువర్ణ, షాహిన్, నాగేశ్వరి, కాంచన , మంగమ్మ , షహదాబీ, శంకర్ భాయ్, పుష్పమ్మ, భాగ్య లక్ష్మీ, శైలజ, చంద్రకళ, అరుణ, సునీత పాల్గొన్నారు.

బీసీ బంధు ఎంపిక సరళతరం చేయాలి

- బీఎస్పీ మల్కాజ్‌గిరి నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే మాణిక్యం



నవతెలంగాణ-బేగంపేట్

బీసీ బంధు ఎంపికను సరళతరం చేయాలని మల్కాజిగిరి బీఎస్పీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే జే. మాణిక్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేతివృత్తుల అభివృద్ధి కోసం లక్ష రూపాయల చొప్పున అందజేస్తామని చెప్పడంతో బీసీ కులాలలోని అన్ని రకాల చేతి వృత్తుల వారు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. లబ్దిదారు లను ఎంపికకు ప్రభుత్వం పెట్టిన నిబంధనలు ఒక దానికి ఒకటి సంబంధం లేకుండా ఉన్నాయని తెలిపారు. దీంతో ఎక్కువ మందిని అనర్హులు అయ్యేలా ఉన్నాయని తెలిపారు. ఈ నిబంధనలు మోకాలికి బోడిగుండుకు ముడ పెట్టినట్లుగా ఉందని వాపోయా రు. పథకానికి ఎంపికైన వారికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగు ల కమలాకర్ బ్యాంకు ఖాతాల లోనే డబ్బులు జమ చేస్తామని చెప్పినా లబ్దిదారులకు అందని దాక్షగా మారిందని పేర్కొన్నారు. ఓట్ల కోసం కాకుండా నిజమైన లబ్దిదారులకు ప్రయోజనం చేకూరేలా నిబంధనలు సరళతరం చేయాలని కోరారు. కొంతమంది దళారులు రూ.10వేలు ఇస్తేనే జాబితాలో పేరు ఉంటుందని దరఖాస్తుదారుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

నీటి ఎద్దడిని నివారిస్తాం : కార్పొరేటర్ సునీత



నవతెలంగాణ-మల్కాజిగిరి

కాలనీలల్లో, బస్తీలల్లో నీటి సమస్యను అరికట్టి ప్రజల దాహార్తిని తీరుస్తామని కార్పొరేటర్ మేకల సునీతారాము యాదవ్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశల మేరకు గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని బీహార్ బస్తిలో పవర్‌బోర్ వేయించారు. ఈ సందర్భంగా కార్పొరే టర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో బీహార్ బస్తీ, ఐఎన్‌నగర్ వారి కోరిక మేరకు పవర్‌బోర్ వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ దివ్యజ్యోతి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మేకల రాముయాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, నాయకులు కార్యకర్తలు బస్తీ వాసులు పాల్గొన్నారు.

టీపీసీసీ ఛీఫ్ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-కంటోన్మెంట్

రైతులకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 24 గంటలు ఉచిత విద్యుత్ పై తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలను నిరసిస్తూ రాష్ట్ర ఖనిజ సంపద అభివృద్ధి సంస్థ చైర్మెన్ క్రిశాంక్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను హై వోల్టేజ్ విద్యుత్ స్తంభానికి వేలాడదీసి గుడ్లతో కొట్టి నిరసన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మల్కాజిగిరి పార్లమెంటర్ సభ్యుడిగా ఉండి కనీసం ఒక్క సమస్యను పరిష్కరించలేదని క్రిశాంక్ విమర్శించారు. కేసీఆర్ విమర్శించే అర్హత రేవంత్‌రెడ్డికి లేదన్నారు. కార్యక్రమంలో నందు, ఈశ్వర్, సునీత, బి.రాజు, సీను, రాజు, గణేష్, సాయి, శేఖర్, మోని, రఘు . ఎం. నాగరాజు, కిట్టు, రాకేష్ చారి పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే బోనాలు సక్సెస్



- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

అందరి సహకారంతోనే సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ప్రశాం తంగా జరిగాయని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళ వారం సాయంత్రం మహంకాళి అమ్మవారి ఆల యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బోనాల ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కేసీఆర్ ఆదేశాలతో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోలీసు, ట్రాఫిక్, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్, పారిశుధ్య కార్మికులు చేసిన సేవలను ప్రశంసించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో బోనాల విశిష్టతను తెలియజెప్పే విధంగా త్రీడీ మ్యాపింగ్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మంత్రి వెంట ఆలయ ఈవోమనోహర్ రెడ్డి, ఛైర్మెన్ రమేష్, మహంకాళి ఏసీపీ రమేష్, ఇన్‌స్పెక్టర్ కావేటి శ్రీనివాసులు, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, కమిటీ సభ్యులు కిషోర్, జగదీశ్ వర్మ కృష్ణ, మహేందర్, చారి, ఉన్నారు.

జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిం చాలని తెలంగాణ గ్రామ పంచాయతీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం కీసరలో అంబేద్కర్ విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. అనంత రం ఆయన మాట్లాడు తూ..తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్, (సీఐటీయూ, ఈఫ్‌టీయూ, ఏఈటీయూ) ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల సమస్యల సాధన కోసం సమ్మె చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి 11పీఆర్సీ ప్రకారం రూ.19వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించి ప్రమాదంలో మరణిస్తే కార్మికుల కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తెలుగుదేశం పార్టీకి ఆకర్షితులైన మీర్‌పేట్ కార్పొరేషన్ వార్డు సభ్యులు సిట్టింగ్ కార్పొరేటర్ ఎర్ర మల్లేష్ ముదిరాజ్ ఇటీవల



తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన నగర టీడీపీ పార్టీ కార్యాలయంలో సికింద్రాబాద్ మంగళవారం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పీ.సాయిబాబా ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నల్లెల్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

మోండా డివిజన్‌లో బోర్వెల్ ఏర్పాటు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మోండా డివి జన్ లోహియా నగర్‌లో స్థానికుల దాహం తీర్చేందు కు ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్యనందిత బోరు వేయించారు. ఎమ్మెల్సీ ప్రభాకర్ నిధులతో బోరు ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నేతలు ఉన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానాన్ని సందర్శించిన
మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి



నవతెలంగాణ- నేరేడ్‌మెట్

తిరుమల తిరుపతి దేవస్థానాన్ని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మంగళవారం తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించు కున్నారు. ఆయన వెంట కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేంద్ర నాథ్, సబితాఅనిల్, కిశోర్ గౌడ్ ఉన్నారు.

పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ అంతరాయం



నవతెలంగాణ - కూకట్‌పల్లి

నేడు కూకట్ పల్లి సర్కిల్ ఆల్విన్ కాలని సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడునని ఆల్విన్ కాలనీ సబ్ స్టేషన్ ఏ ఈ శరత్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 కే వి ఫీడర్ నిర్వహణలో బాగంగా కరెంట్ తీగలపై పడి ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు గాను బుధవారం కూకట్‌పల్లి పాపారాయుడు నగర్, రామారావు నగర్, వైష్ణవి నగర్, సాయిబాబా నగర్, ఎన్విరాన్ మెంటల్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు, 11 కే వి ఆల్విన్ కాలని ఫీడర్ మధ్యాహ్నం 2:30 గంటల నుండి,సాయంత్రం 5 గంటల వరకు ఆల్విన్ కాలని ఫేస్ వన్,జలకన్య ,ఈస్ట్ ఆండ్ వెస్ట్ సాయి నగర్ కాలనీ ప్రాంతాల్లో కరెంట్ తీగలపై వేలాడే చెట్ల కొమ్మలను తొలగించేందుకు విద్యుత్ అంతరాయం ఏర్పడునన్నారు.

ఆలయానికి మైక్ సెట్ అందజేత



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న నల్ల పోచమ్మ-మైసమ్మ ఆలయానికిగాను చైతన్య యువజన సంఘం ఆలయ కమిటీ సభ్యులకు 16వ వార్డు కౌన్సిలర్ ఉమా నాగరాజు ముదిరాజ్ ఇచ్చిన మాట ప్రకారం మైక్ సెట్‌ను విరాళంగా మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శివకుమార్ యాదవ్,16వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు కమ్రురుద్దీన్, నాయకులు దుర్గం వెంకటేష్ ముదిరాజ్, అంజయ్య, శ్రీశైలం, దేవా, సాయి, మహేందర్, సంపత్, నాగేష్,నర్సింగ్ యాదవ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను సవరించాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయమల్లికార్జున్,భూపాల్
- మేడ్చల్ పట్టణంలో సీఐటీయూ జీపుజాత



నవతెలంగాణ- మేడ్చల్

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కనీస వేతనాల చట్టాన్ని సవరించి వేతనాలను పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయమల్లికార్జున్, భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మేడ్చల్ పట్టణంలోని పారిశ్రామిక వాడలోని పలువురు కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 4న రంగారెడ్డి జిల్లా కాటేదాన్ లో ప్రారంభమైన సీఐటీయూ జీపు జాత కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ పారిశ్రామిక వాడను సందర్శించడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో సుమారు కోటి మందికి పైగా కార్మికులు వివిధ రంగాల్లో 73 షెడ్యూల్డ్ కార్మికులుగా పని చేస్తున్నారని తెలిపారు. కానీ గత 15సంవత్సరాల నుండి ప్రభుత్వాలు కనీస వేతనల జీవో సవరించకపోవడం వలన ధరలు అనేక రేట్లు పెరిగి కార్మిక కుటుంబాలు అల్లాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు సవరించవలసిన ప్రభుత్వం యజమానుల పక్షాన ఆలోచిస్తుందని అన్నారు. పెరుగుతున్న శాస్త్ర సాంకేతికత మార్పు దృష్ట్యా రోజుకు 7 గంటలు, వారానికి ఐదు రోజుల పని దినం మాత్రమే ఉండాలని సూచించారు. వలస కార్మికులకు 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం ప్రకారం హక్కులు, సౌకర్యాలు కల్పించాలని కోరారు.జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ పేరుతో యజమాన్యాలు కార్మికులను శ్రమను దోపిడీకి గురిచేసి కోట్లాది రూపాయల డబ్బులు దండుకుంటున్నాయని అన్నారు. కార్మికుల పక్షాన పని చేయవలసిన కార్మిక శాఖ అధికారులు మామూళ్లకు అలవాటు పడి కార్మికులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు.కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.ధరలు తగ్గించాలని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఈఎస్ఐ,పీఎఫ్,బోనస్, ఇతర చట్టబద్ధ సౌకర్యాలన్ని కల్పించాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం కిష్టప్ప,నరసింహ,గణేష్,లలిత,మహేష్,రజిత దేవేందర్,లక్ష్మణ్,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం

- ప్రపంచ పటంలో విశ్వనగరాల పక్కన హైదరాబాద్
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-బాలానగర్

ఓల్డ్ బోయినపల్లి రహదారి విస్తరణకు ఆ ప్రాంతాన్ని పరిశీలించి, ప్రధానంగా రోడ్డుకి ఇరువైపుల ఉన్న దుకాణదారులు, నివాసదారుల అభ్యర్ధలను పరిగణలోకి తీసుకుని రోడ్డను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలియజేశారు. స్థానిక కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్, చీఫ్ సిటీ ప్లానర్ దేవేందర్ రెడ్డిలతో కలసి మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం రోడ్డు విస్తరణలో నష్టపోయే దుకాణ సముదాయాల వారికి టీడీఆర్ ఇచ్చేందుకు చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ మహానగరం విశ్వనగరంగా మారబోతుందని, రాబోయే రోజుల్లో ప్రపంచ మహా నగరాల జాబితాలో హైదరాబాద్ ఉండబోతుందని ధీమా వ్యక్తం చేశారు. తదనుగుణంగా ఎక్కడికక్కడ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రోడ్ల విస్తరణ, భూగర్భ పైప్ లైన్ నిర్మాణాలు, ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలకు ఇబ్బంది లేకుండా ముందుచూపుతో ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్నారని కొనియాడారు. ఇందులో భాగంగానే ఓల్డ్ బోయిన్ పల్లిలోని రహదారుల విస్తరణ ప్రజలను ఒప్పించి వారికి న్యాయం జరిగేటట్లు చేస్తామని, అలాగే సాధారణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా రోడ్డు విస్తరణ చేపడతా మన్నారు. అనంతరం కూకట్ పల్లి లోని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి కూకట్ పల్లి ప్రధాన రహదారి నుంచి హై టెన్షన్ లైన్ మీదుగా ప్రకాష్ నగర్ రోడ్డు విస్తరణ కొరకు నివాస సముదా యం వారికి టీడీఆర్ ఇచ్చేందుకు చర్చించి నిర్ణయం తీసుకోవడం జరిగిందని, ఇందుకు స్థానికంగా నివాసం ఉండే వారు కూడా సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేసి చూపిస్తున్నాం

- ఎమ్మెల్యే కె.పి వివేకానంద్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రతీ ప్రాంతంలో రాజకీయాలకతీతంగా ప్రజల సహాయ సహకారాలతో అభివృద్ధి చేసి చూపిస్తున్నామని ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మైసమ్మనగర్ ఏ, బీ బ్లాక్ లలో 'ప్రగతి యాత్ర'లో భాగంగా 87వ రోజు ఎమ్మెల్యే కేపి వివేకానంద్ పర్యటించారు. పూర్తి చేసిన రోడ్లు, డ్రయినేజీ వంటి అభివద్ధి పనులు పరిశీలించారు. అదే విధంగా సంక్షేమ పథకాలు ఏ విధంగా అమలవుతున్నాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కాగా అక్కడక్కడా నెలకొన్న భూగర్భ డ్రయినేజీ, అంతర్గత రోడ్లు, కరెంటు పోల్స్, తీగలు మార్చాలని ఎమ్మెల్యే దష్టికి స్థానికులు తీసుకురాగా అక్కడే ఉన్న అధికారులను సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్, డిఈఈ రూపాదేవి, మేనేజర్ అంకిత్ స్థానిక డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు నల్ల గోపుల బాబుగౌడ్ ,సయ్యద్ రషీద్, బండ మహేందర్, మైసమ్మ నగర్ ఏ, బీ బ్లాక్ సంక్షేమ సంఘాల సభ్యులు, బస్తీల వాసులు పాల్గొన్నారు.



డ్రయినేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలి

- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ- జగద్గిరిగుట్ట

గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్, పరిధి అంజయ్య నగర్ రోడ్ నెంబర్ 3 తో పాటు మెయిన్ రోడ్డు డ్రయినేజీ లైన్ ఓవర్ ఫ్లో సమస్య వల్ల బస్తి ప్రజలు ఇబ్బంది పడుతున్నామని స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్‌కు బస్తివాసులు తెలిపారు. దాంతో మంగళవారం స్థానికులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్య త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు పల్లా వెంకట్ రెడ్డి, అధ్యక్షులు నేతి శంకర్ గుప్తా, బస్తి నాయకులు ,బిక్షపతి , పల్లె దత్తాత్రేయ, మురళి ,గణేష్, శివకుమార్, అరుణ్, జై కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ - కూకట్ పల్లి

మూసాపెట్ లో, ఖార్డ్ సంస్థ వారి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని మంగళ వారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూకట్ పల్లి నియోజకవర్గంలో నిరుపేదలకు తమవంతు సహాయం చేయాలనే ఉద్దేశంతో ఖార్డ్ సంస్థ వారు ఎంతో కషి చేస్తున్నారని అన్నారు. నిరుపేదలకు నిత్యావసరాలు అందించేడమే కాకుండా వారు ఆర్థికంగా ఉన్నతి సాధించాలనే ఉద్దేశంతో, ఖార్డ్ సంస్థ అధినేత సుమన్‌తో చర్చించి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోని మహిళలకు ఈ విధంగా ట్రైనింగ్ ఇవ్వడానికి ప్రణాళికలు సిద్దం చేశామని తెలిపారు. అంతే కాకుండా ట్రైనింగ్ అయ్యాక తన సొంత నిధులతో, ఖార్డ్ సంస్థతో కలిసి మహిళలకు కుట్టు మిషన్‌లను పంపిణీ చేయడమే కాకుండా వారికి ఉపాధి మార్గాలు చూపించే బాధ్యత తమదే అని అన్నారు. అలాగే కూకట్ పల్లి నియోజకవర్గంలో తన సొంత నిధులు రూ. 44 లక్షలతో ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో ఖార్డు సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుకు వెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖార్డ్ సంస్థ చైర్మెన్ సుమన్, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండగ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

నవతెలంగాణ-కూకట్ పల్లి

కూకట్‌పల్లిలోని చిత్తారమ్మ దేవాలయంలో ఈనెల 16వ తేదీన బోనాల పండుగ సందర్భంగా ఏర్పాట్లపై పోలీసు రెవెన్యూ ట్రాఫిక్,ఎలక్ట్రిసిటీ, జీహెచ్ఎంసీ సిబ్బందితో మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా



డుతూ ముఖ్యంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు కాబట్టి, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని. అలాగే ప్రజలకు అందుబాటులో మంచినీరు ,పోలీసు రక్షణ వ్యవస్థ ,వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉండేటట్టు చూడాలని తెలిపారు. ఎక్కడ ఎటువంటి ఇబ్బంది లేకుండా నిత్యం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సమాచారం తెలియచేయాలని సూచించారు. ఏదైనా ఇబ్బంది ఉన్నయెడల తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఏసీపీ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, కూకట్ పల్లి సురేంద్ర, ఈ ఈ గోవర్ధన్, అన్ని విభా గాల ముఖ్య అధికారులు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, చైర్మెన్ తులసిరావు, ఈవో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్ : దుండిగల్ మున్సిపాల్టీ పరిధిలోని మల్లంపేట్, మహేశ్వరం గ్రామాలలో త్వరలో నిర్వహించనున్న బోనాల పండుగ ఏర్పాట్లపై శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఏమాత్రం అసౌకర్యం కలగకుండా, దేవాలయ పరిసర పరిసరాల్లో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త తీసుకోవాలని అధికారులకు, ఆలయ కమిటీ సభ్యులకు తెలియజేశారు. జాతర కారణంగా మల్లంపేట పోచమ్మ దేవాలయ చుట్టుపక్కల ప్రాంతాలలో ట్రాఫిక్ మళ్లింపులో ఎక్కడ ట్రాఫిక్ జామ్ కాకుండా తాగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని వెళ్లి పరిశీలించారు. వైస్ చైర్మెన్ పద్మారావు కౌన్సిలర్లు మాదాస్ వెంకటేష్, అనంత స్వామి, నాయకులు ఎంబరి ఆంజనేయులు, శామీర్ పేట హనుమంత్ రావు, ఉట్ల శ్రీహరి, ఉట్ల లక్ష్మి నారాయణ, సంగొల్ల సత్తయ్య, బలవంత్ రెడ్డి, బాలకష్ణ, తదితరులు పాల్గొన్నారు.



'కృష్ణవేణి టాలెంట్' విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎక్స్‌ప్లోరా ది నాలెడ్జ్ ఒలంపియాడ్ రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలో కష్ణవేణి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 10వ తరగతి విద్యార్థిని ఎం. ప్రసన్న,



9వ తరగతి విద్యార్థి జునైద్, 8వ తరగతి విద్యార్థి ఎం. భవ్యశ్రీ, 5వ తరగతి విద్యార్థి నైనిషా, 4 వ తరగతి విద్యార్థి సాయి నిత్యశ్రీలు జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్య క్రమంలో చైర్మెన్ రాజు సంగాని, జోనల్ మేర్ జావిద్, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంపెనీకి అడ్డుగా ఉందని పేదోడి నివాసాన్ని కూల్చిన యజమాని



నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ వాల్మీకి నగర్‌లో చిన్నపాటి గుడిసె వేసుకుని భార్యాపిల్లలతో టీస్టాల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తి కుటుంబం రోడ్డున పడింది. స్థానికులు తెలిపిన ప్రకారం గత నలభై సంవత్సరాల క్రితం ఓ కుటుంబం ఫతేనగర్ పారిశ్రామిక ప్రాంతంలో వాల్మీకినగర్‌లో తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుని కుటుంబ పోషణ కోసం టీ కొట్టునడుపుకుంటూ జీవనం సాగిస్తున్నది. ఈ నేపథ్యంలో ఇటీవల వాల్మీకి నగర్‌లో గతకొంతకాలంగా ఎస్వీ హీటర్స్ యూనిట్ నడుపుతున్న ఓ యజమాని తన పరిశ్రమ యూనిట్‌కు అడ్డుగా ఉందన్న కారణంతో టీకొట్టు నడుపు కుంటున్న సుజాత శశిధర్ దంపతుల కుటుంబం ఇంటిని కూల్చివేయించాడు. ఆ కుటుంబం వీధిన పడింది. విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రవెల్లి అశోకాచారి స్పందించి డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ దష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంఘటనాస్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించి రోడ్డునపడ్డ కుటుంబానికి ఆదుకనే దకపదంతో యూనిట్ యజమానితో మాట్లాడి తిరిగి ఇంటిని ఏర్పాటు చేసుకోవాలని సమస్యను పరిష్కరించారు. దీంతో బాధితులు ఆపదలో సహకరించిన కార్పొరేటర్ సతీశ్ గౌడ్, అశోకాచారికి కృతజ్ఞతలు తెలిపారు.

IN THE COURT OF THE IX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS
AT: HYDERABAD
O.S.NO.769 OF 2020

Between:
Canara Bank, Ashok Nagar Branch, Hyderabad
.....Plaintiff
AND
Smt. Kavitha Shankaramma and another
.....Defendants

To.
1) Smt. Kavitha Shankaramm W/o. K. Krishna, aged about 46 years, Occ: Business, R/o.13-1-690, Mangal Hat, Poosala Basti, Hyderabad - 500 006. Ph.No.8187837234
2) Smt. P. Sreelatha W/o. P. Srinivas, aged about 40 years, R/o.13-1-707, Mangal Hat, Poosala Basti, Hyderabad - 500 006. Ph.No.8179947567

Take notice that the above named Plaintiffs have instituted the above suit againts you for recovery of **Rs.1,11,995/-** together with costs and furure interest.You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **25th July, 2023, at 10:30 A.M.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//BY ORDER OF THE COURT//
N.VENUGOPALA RAO
ADVOCATE
H.No.1-2-234/2/1, Plot.No.2/P
Road No.4, S.R.L. Colony
Kothapet, Hyderabad.

అభివృద్ధే లక్ష్యంగా పనులు కొనసాగాలి

- చైర్ పర్సన్ కృష్ణవేణి క్రిష్ణ



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాల్టీ మల్లంపెట్ 21వ వార్డులో మంగళవారం రూ.30 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సి.సి.రోడ్డు అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను వైస్ చైర్మెన్ పద్మారావు, స్థానిక కౌన్సిలర్లతో కలిసి దుండిగల్ పురపాలక చైర్ పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లవేలలా వార్డుల అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తానని తెలిపారు. అనంతరం వార్డులో పర్యటించి ప్రజా సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అనంత స్వామి, శంభీపూర్ క్రిష్ణ, మాదాస్ వెంకటేష్, ఎంబరి లక్ష్మి ఆంజనేయులు, సీనియర్ నాయకులు ఎంబారి ఆంజనేయులు, శామీర్ పేట హనుమంత్ రావు, మునిసిపల్ మహిళ అధ్యక్షులు మనోజ సుధాకర్, మాజీ ఉపసర్పంచ్ అమర్, 24,21వ వార్డు ప్రెసిడెంట్లు గండిగుడెం రమేష్, మాదాస్ నవీన్, మాజీ వార్డు సభ్యులు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- కార్పొరేటర్ రావుల శేషగిరి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ ప్రజలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుపుకునే పండుగల్లో బోనాల పండగకు ఎంతో విశిష్టత ఉందని.. శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలని గాజులరామరం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. మంగళవారం గాజులరామారం డి విజన్ పరిధి గాలి పోచమ్మ బస్తి పరిధిలో స్థానిక నాయకులు నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్లమ్మ పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి నవాబ్ భాయ్, మురళి కృష్ణ, నరసింహ, భాస్కర్,రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.



దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట్ గ్రామం ఇందిరమ్మ కాలనీలో శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవంలో మంగళవారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఇందిరమ్మ కాలనీ వాసులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE I ADDL.JUNIOR CIVIL JUDGE-CUM-IX ADDL. METROPOLITAN MAGISTRATE, R.R.DISTRICT, KUKATPALLY
AT: PRASHANTH NAGAR
O.S.No. 1083 of 2022
O.S.No. 102 of 2021

Between: Canara Bank, Nallagandla Branch, R.R.Dist. .... **Petitioner/Plaintiff**
And
Sri Sirishanagandla Raju .... **Respondent/Defendant**

To
Sri Sirishanagandla Raju
S/o. S. Venkanna, aged about 26 years, Occ.: Driver, R/o. 353, G-Floor, Room No.3, Sri Ram Nagar Colony, Kondapur, R.R. Dist. Ph.No. 8008476092.

Take notice that the above named Petitioner/Plaintiff have instituted the above suit against you for recovery of **Rs.4,27,835/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **21st July, 2023, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//By Order of the Court//
Sd/- N.Venugopala Rao, Advocate
H.No.1-2-234/2/1, Plot No.2/P, Road No.4, S.R.L. Colony, Kothapet, Hyderabad. Cell: 9849264568

IN THE COURT OF THE HON'BLE VII ADDL. JUNIOR CIVIL JUDGE
R.R.DISTRICT
AT : HAYATHNAGAR
O.S.NO. 444 OF 2023.

Between :
1. Boddu Koteshwar Rao, S/o. Venkatappaiah, Aged about 82 years, Occ: Retired R/o. H.No.8-03-168/E/2/7/102, Sai Krishna Apratments, A.G. College Back side, Rajeev Nagar, Hyderabad as 500 045.
2. Boddu Nagarjuna, S/o. B. Koteshwar Rao, Aged about 56 years, Occ: NRI R/o. 2, Village View RD Westford, MA 01886 USA. Presently Reseeding R/o. H.No.8-3-168/E/2/7/102, Sai Apartments, A.G.College Back side, Hyderabad - 500 045
3. Boddu Appa Rao, S/o. B. Koteshwar Rao, Aged about 52 years, Occ: Pvt. Employee, R/o. H.No.5-6-57/304, Sangeetha Nagar Colony, Kukatpally, Hyderabad -500 072
....Plaintiffs
And
1. Tha Tahsildar, Abdullapumet, Ranga Reddy District, T.S.
2. All Concerned
....Defendants

To,
All Concerned

NOTICE

Take notice that the plaitiffs herein have filed the above suit for declaration to declare the plaintiffs as the legal heirs of the deceased Boddu Samrajyam who died on 19-05-2020 the above suit is posted on 10-08-2023 if any person or persons having any objection interest in respect of the claims made by the plaintiffs may appear before the said Hon'ble Court at 10:30 am by person or through an advocate failing which the matter will be decided on merits.

SCHEDULE OF PROPERTY

All that piece and parcel of 148 Sq.Yds., out of the total 348 Sq.Yds., in Plot No.770, bearing in Sy.No.618, 622 to 626, 628, 629 & 633 part situated at Turkayamjal Village, Hayathnagar Mandal, (presently Abdullapurmet Mandal), Ranga Reddy District bounded by :
North : Plot No.769, **South** : 40' Wide Road, **East** : Plot No.747, **West** : Plot No.770 Part

By the order of the Court
Boggula Rama Krishna Reddy
Advocate
#4-7-234, Karur Vysya Bank Building, Hayathnagar, Hyderabad - 501 505

IN THE COURT OF THE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS
AT: HYDERABAD
O.S.NO.1735 OF 2023

Between:
Canara Bank, Seetharambagh Branch, Hyderabad
.....Plaintiff
AND
Ms Shubra Pathak and another
.....Defendants

To.
1) Ms Shubra Pathak D/o.Mukesh Pathak, aged about 28 years, Occ: Student, R/o.11-2-324/1, Shashi kunj, Beside bata Showroom lane, bazarghat junction, Nampally, Hyderabad - 500 004. Ph.No.9490127878
2) Sri Mukesh Pathak, S/o. P.N. Pathak aged about 62 years, Occ: Employee, R/o.11-2-324/1, Shashi kunj, Beside bata Showroom lane, bazarghat junction, Nampally, Hyderabad - 500 004. Ph.No.040-23260313

Take notice that the above named Plaintiffs have instituted the above suit againts you for recovery of **Rs.4,09,262/-** together with costs and furure interest.You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **31st July, 2023, at 10:30 A.M.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//BY ORDER OF THE COURT//
N.VENUGOPALA RAO
ADVOCATE
H.No.1-2-234/2/1, Plot.No.2/P
Road No.4, S.R.L. Colony
Kothapet, Hyderabad.

మంత్రి మల్లారెడ్డికి మరోసారి నిరసన సెగ

- కాన్వాయిని అడ్డుకున్న ఉషారుపల్లి గ్రామస్తులు



నవతెలంగాణ-సిటీబ్యూరో/శామీర్‌పేట

రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డికి మరోసారి నిరసన సెగ తగిలింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం, కాచవాణిసింగారం గ్రామంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన మంత్రిని సోమవారం స్థానికులు అడ్డుకున్న విషయాన్ని మరువక ముందే మరో నిరసన ఎదురైంది. మంగళవారం మూడు చింతల మండలంలోని ఉషారుపల్లి గ్రామంలో మంత్రి కాన్వాయిని అడ్డుకున్న గ్రామస్తులు గ్రామ అభివృద్ధి విషయమై మంత్రిని నిలదీశారు. తమ గ్రామంలో రోడ్లు, డ్రయినేజీలు అధ్వాన్నంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంట్ సమస్య కూడా ఉందని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి ఓట్లు అడుగుతారు కానీ.. తమ సమస్యలను పరిష్కరించాలని అధికారుల చుట్టూ తిరిగినా ఒక్కరు కూడా పట్టించుకున్న పాపాన పోలేదంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో కనీసం ఉండటానికి ఇల్లు లేని వారికి ఇప్పటి వరకు ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు కూడా ఇవ్వలేదంటూ మంత్రిని నిలదీశారు. సొంత ఇండ్లు లేక పేదలు ఇబ్బందులు పడుతు న్నారనీ, వెంటనే డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగో వార్డులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను స్థానికులకే చెందేలా చూడాలని మంత్రిని కోరారు. ఏండ్లుగా ఎస్సీ కమ్యూనిటీ భవనం శిథిలావస్థలో ఉన్నా దాన్ని పట్టించుకునే వారు లేరనీ, వెంటనే ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని కోరారు. వార్డులో బీసీ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయా లని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పర్యటనలో ఉద్రిక్తత ఏర్పడటంతో పోలీసులు జోక్యం చేసుకుని స్థానికులను అక్కడి నుంచి పంపించేశారు. చాలా రోజుల తర్వాత తమ గ్రామానికి మంత్రి వస్తే వృద్ధులు, మహిళలు తమ సమస్యలను చెప్పుకోవడానికి వెళ్తుంటే కొందరు అడ్డుకుని అక్కడి నుంచి పంపించేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఎవరి దారిన వారు వెళ్లిపోతే తమ గోడును ఎవ్వరికి చెప్పుపోవాలి అని ఆవేదన వ్యక్తం చేశారు.

IN THE COURT OF THE IX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS
AT: HYDERABAD
O.S.NO.714 OF 2020

Between:
Canara Bank, Ashok Nagar Branch, Hyderabad
.....Plaintiff
AND
Smt. P. Chandrakala
.....Defendant

To.
1) Smt. P. Chandrakala W/o. P. Ramaswamy, aged about 53 years, Occ: Business, R/o. H.No.17-1-388/21, Poornodaya Colony, Saidabad, Hyderabad - 500 072. Ph.No.8179947567

Take notice that the above named Plaintiffs have instituted the above suit againts you for recovery of **Rs.51,798/-** together with costs and furure interest.You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **25th July, 2023, at 10:30 A.M.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//BY ORDER OF THE COURT//
N.VENUGOPALA RAO
ADVOCATE
H.No.1-2-234/2/1, Plot.No.2/P
Road No.4, S.R.L. Colony
Kothapet, Hyderabad.

IN THE COURT OF THE HON'BLE I ADDL.JUNIOR CIVIL JUDGE-CUM-IX ADDL. METROPOLITAN MAGISTRATE, R.R.DISTRICT, KUKATPALLY
AT: PRASHANTH NAGAR
O.S.No. 1346 of 2022
O.S.No. 108 of 2021

Between: Canara Bank, Nallagandla Branch, R.R.Dist. .... **Petitioner/Plaintiff**
And
Sri Amboju Venkanna .... **Respondent/Defendant**

To
Sri Amboju Venkanna S/o Narasimha, aged about 29 years, Occ.: Driver, R/o. H.No.2-1-1/4/A, Nallakunta (New), Hyderabad-500011. Ph.No. 9959141852

Take notice that the above named Petitioner/Plaintiff have instituted the above suit against you for recovery of **Rs.3,88,490/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **21st July, 2023, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//By Order of the Court//
Sd/- N.Venugopala Rao, Advocate
H.No.1-2-234/2/1, Plot No.2/P, Road No.4, S.R.L. Colony, Kothapet, Hyderabad. Cell: 9849264568

మాస్ కాపియింగ్‌కు సహకరించిన అధికారులపై వేటు

నవతెలంగాణ-సిటీబ్యూరో

జూన్ నెలలో జరిగిన ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల్లో మాస్ కాపియింగ్‌కు సహకరించిన అధికారులపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్సార్ నగర్ లోని అమోఘ జూ. కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రం ఏర్పాటుచేశారు. జూన్ 15న గణితం-బి పరీక్ష కొనసాగుతుండగా డిపార్ట్ మెంటల్ అధికారి.. విద్యార్థికి పెన్సిల్‌తో సమాధానాలు రాసి అందించాడు. పరీక్షా విధుల్లో నిర్లక్ష్యం వహించిన సీఎస్ సిహెచ్ .శ్రీనివాస్ రెడ్డి, డీవో జి.అంజనేయులును ఇంటర్ విద్యా కమిషనర్ సస్పెన్షన్ వేటు వేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

నేటి విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేడు రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాలు నిర్వహించ తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జావేద్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు వామపక్ష యువజన సంఘాలు పూర్తి మద్దతు ప్రకటిస్తూ సంఘీభావం తెలిపాయని చెప్పారు. ఈ బంద్‌లో హైదరాబాద్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డీవైఎఫ్ఐ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో వసతులు, ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ప్రభుత్వ బడులకు కాకుండా ప్రయివేట్ బాట పడుతున్నారని, ఖాళీగా ఉన్న డీఈవో, ఎంఈవో, టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా వేల రూపాయలు వసూలు చేస్తూ.. తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న ప్రయివేట్, విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. విద్యా సంస్థల బంద్‌కు పాఠశాల, కళాశాలల యజమాన్యాలు సహకరించి.. స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కార్మికులకు వేతనాలను చెల్లించాలి



- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్,భూపాల్

నవ తెలంగాణ- మేడ్చల్

మిడ్ డే మీల్స్ కార్మికులకు ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేసి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్, భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్ ఆధ్వర్యంలో మిడ్ డే మీల్స్ కార్మికులతో కలిసి నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మిడ్ డే మీల్స్ కార్మికుల వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి చెల్లించాలన్నారు. సాక్షాత్తు అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ రెండు వేల రూపాయల వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. దాదాపుగా సంవత్సరం గడిచిపోయిన సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. మిడ్ డే మీల్స్ కార్మికులకు చెల్లించే రూ. 1000తో ఎలా కుటుంబాన్ని పోషిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.కార్మికుల వేతనాలు పెండింగ్‌లో పెట్టడంతో వారు పుస్తెలతాడులను బంగారు కొనుగోలు కేంద్రాల్లో గిరివి పెట్టి మరి కూరగాయలు కొనుగోలు చేసి విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వండుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిడ్ డే మీల్స్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాల చట్టం ప్రకారం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. వీరికి ఉద్యోగ భద్రత,ఈఎస్ఐ,పీఎఫ్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వమే గుడ్లను కొనుగోలు చేసి వీరికి అందించాలని ప్రస్తుతం కేవలం రూ. 3 మాత్రమే గుడ్ల కొనుగోలుకు చెల్లిస్తున్నారని మార్కెట్‌లో 5నుండి 6 రూపాయలకు గుడ్లు లభిస్తున్నాయని వివరించారు. కార్మికులకు గుర్తింపు కార్డుతో పాటు సంవత్సరానికి రెండు కాటన్ చీరలను పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్,కార్మికులు పాల్గొన్నారు.



మొహర్రం నేపథ్యంలో పోలీసుల ముందస్తు చర్యలు

- పాతబస్తీలో సీపీ నేతృత్వంలో కో-ఆర్డినేషన్ సమావేశం

నవతెలంగాణ-సిటీబ్యూరో

జులై 29న మొహర్రం పర్వదినోత్సవం నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రశాంత వాతావరణంలో మొహర్రం పర్వదినోత్సవాన్ని పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తున్న ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సాలార్‌జంగ్ మ్యూజియంలో నగర సీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన ముస్లిం మతపెద్దలు, షియా కమ్యూనిటీ సభ్యులతోపాటు పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కో-ఆర్డినేషన్ సమావేశాన్ని ఏర్పాటు నిర్వహించారు. భద్రత, ట్రాఫిక్‌తోపాటు ఇతర ఏర్పాట్లపై వారితో సీపీ చర్చించారు. టాస్క్‌ఫోర్సుతోపాటు సివిల్, క్రైమ్ పోలీసులు, షీ టీమ్స్ బృందాలను రంగంలోకి దించుతున్నామని వారికి తెలిపారు. అన్ని ప్రదేశాలల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తామని, పోలీసులకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. ఏనుగులతో ఊరేగింపు ఉండడంతో గత అనుభవాలను దృష్టిలో పెట్టు కుని అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు. 400 ఏండ్ల సంప్రదాయానికి గుర్తుగా దబీర్‌పూరా బీబీ-కా-ఆలం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించగా, ఈ ఊరేగింపులో వేలాది మంది పాల్గొటారని సీపీ గుర్తు చేశారు. ఈ క్రమంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్గకుండా చార్మినార్, గుల్జార్ హౌస్, పురాణి హవేల్, చాదార్‌ఘాట్ తదితర ప్రాంతాలల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో మొహర్రం పూర్తి చేయాలని వారిని కోరారు. పోలీస్‌తోపాటు అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పోలీస్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు పరచాలి



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లలో నిత్యం పనిచేయు కార్మికులకు ప్రతి నెలా ఐదవ తారీకు చెల్లించే వేతనాలు 20వ తారీఖు వరకు జాప్యం జరుగుతుందని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ నిజాంపేట్ సీఐటీయూ అధ్యక్షుడు జి. వెంకట రాజం తెలిపారు. ఈ మేరకు నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ప్రతి నెలా వేతనాల కోసం 20వ తేదీ వరకు వేచి ఉండవలసినదని, వీరి వేతనాల గ్రూప్ ల, సొసైటీల ద్వారా వీరికి వచ్చేసరికి ఎక్కువ రోజులు గడుస్తున్నాయన్నారు. కార్మికులకు వారి బ్యాంకు ఖాతాలోకి నేరుగా వేతనాలు చెల్లించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అధికారులు కార్మికులకు అందించే సౌకర్యాలు సబ్బులు , దుస్తులు, నూనెలు నాణ్యతతో కూడినవి ఇవ్వాలని అలా ఇవ్వనిచో కార్మికులందరూ నిరసన తెలియజేయడం జరుగుతుందని, దీనితో అధికారులు కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తూ వేధించడం జరుగుతుందన్నారు. ఇప్పుడున్న వేతనాలలో ఈఎస్ఐ, పీఎఫ్ ప్రతీనెల చేస్తుండటంతో కేవలం 15 వేలతో కుటుంబాలు జీవనం కొనసాగించాలంటే కష్టంగా మారిందన్నారు. ఇప్పటికైనా కనీస వేతనం రూ. 26,000 అమలుపరచాలని, ఇక ఆఫీసులో కార్మికులు గతంలో రిజిస్ట్రేషన్ బుక్కుతో హాజరు, గైర్హాజరు వేసుకొనేవారని, అప్పుడు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాలేదన్నారు. ఇప్పుడు బయోమెట్రిక్ పంచింగ్ మిషన్ ద్వారా కార్మికులకు హాజర్ చేపట్టడంతో ప్రతినెలా చాలామంది కార్మికులకు వేతనాలు తక్కువ రావడం జరుగుతున్నాయని ఏదైనా మిషిన్ లోపం జరుగుతుందా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు ప్రమాదం జరిగి మరణిస్తే రూ. 30 లక్షలు బీమా కింద రావాల్సిందేనని, మున్సిపల్ కార్మికుడు మరణిస్తే మట్టి పనుల కోసం రూ. 25,000 ఇవ్వాలని, అలాగే కార్మికులకు పెన్షన్ ఉండదని అలాంటప్పుడు కార్మికుడి వారసులకు ఉద్యోగం కల్పించాలని, అన్నారు. వారసులు లేనిచో రూ. 15 లక్షలు పారిశుధ్య కార్మిక కుటుంబాలకు ఇవ్వాలని తెలిపారు. వీటన్నిటి అమలయ్యే వరకు కార్మికులందరికీ అండగా నిలిచి పోరాడుతామని, అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా నేడు సిఎండిఏ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టామని ఇప్పటికే అన్ని కార్యాలయ అధికారుల వద్ద అనుమతులు తీసుకున్నామన్నారు. తిరుపతయ్య, వెంకన్న లక్ష్మి, నారాయణ, నవీన్ కుమార్, వరలక్ష్మి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

పల్లె దీక్షితకు సుశీలా నారాయణరెడ్డి పురస్కారం



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పల్లె దీక్షిత రాసిన అముద్రిత కవితా సంపుటి 'సరసు'కు సుశీలా నారాయణరెడ్డి పురస్కారానికి ఎంపిక కావడం అభినందనీయమని టి.యం. వి ప్రిన్సిపల్ , ప్రొఫెసర్ పి. వారిజారాణి అన్నారు. తెలుగు శాఖ అధ్యాపకులు డా.మోహన్‌రావు, డా. వెంకట రాంరెడ్డి, డా. రాజ్ కుమార్, డా. జ్యోతి, డా. హంస డా. పద్మ తదితరులు దీక్షితకు శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



వివాహిత అదృశ్యమైన సంఘటన పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరాం కాలనీలో ఒరిస్సా రాష్టానికి చెందిన తపన్ కుమార్ భార్య మధుమితతో కలిసి సంవత్సర కాలంగా శ్రీరాం కాలనీలో నివాముంటున్నాడు. మధుమిత శ్రీరాం కాలనీలో ఉన్న పేపర్ ప్లేట్ల తయారీ కంపెనీలో పనిచేస్తున్నది. ఈ నెల 10న మధ్యాహ్నం కంపెనీలో పనిచేయటానికి వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. భర్త తపన్ కుమార్ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

నిజాం కళాశాలలో బోనాల పండుగ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

నిజాం కళాశాలలో మంగళవారం బోధన, బోధనేతర ఉద్యోగులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలోని నాగదేవత, ఎల్లమ్మ దేవతలకు పూజలు చేసి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ బి.బీమా, వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ గంగ ఉపేందర్ రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గీత, ఎగ్జామ్స్ కంట్రోలర్ డాక్టర్ జ్యోతి, నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘం నాయకులు కుమార్ తదితరులు హాజరై అమ్మవార్లకు పూజలు చేశారు. మహిళలు అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు అమ్మవార్లకు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం అమ్మవార్ల ప్రసాదాన్ని స్వీకరించి సామూహిక భోజనాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి.బీమా మాట్లాడారు.

స్విమ్మర్ విక్టోరియాను అభినందించిన స్పోర్ట్స్ చైర్మెన్

నవతెలంగాణ-అంబర్‌పేట

అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో స్విమ్మర్ క్వీని విక్టోరియా రెండు రజత పతకాలను సాధించడం రాష్ట్రానికి గర్వకారణ మని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డా. ఈ. ఆంజనేయ గౌడ్ అన్నారు. ఈజిప్ట్ దేశ రాజధాని కైరోలో గతనెలలో అంతర్జా తీయ అండర్ వాటర్ స్వి మ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో బర్కత్‌పురకు చెందిన క్వీని విక్టోరియా ప్రతిభ కనబర్చి రెండు రజత పతకాలు సాధించి, చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. ఈ నేప థ్యంలో హైదరాబాద్‌లో మంగవారం స్పోర్ట్స్ చైర్మన్ అంజ నేయ గౌడ్ స్విమ్మర్ క్వీని విక్టోరియాను సన్మానించి, అ భినం దించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీ డాకారు లను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.



దోమలగూడలో గ్యాస్ సిలిండర్ పేలుడు

- ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురుకి తీవ్ర గాయాలు
- గాయపడిన వారిలో ముగ్గురు చిన్నారులు





నవతెలంగాణ-అడిక్ మెట్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్ రోజ్ కాలనీలోని ఓ ఇంట్లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించి ఏడుగురికి తీవ్ర గాయాలైన ఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం దోమలగూడ రోజ్ కాలనీకి చెందిన బోయకర్ పద్మ (55) ప్రయివేట్ జాబ్ చేస్తుంది. బోనాల సందర్భంగా ఎల్బీనగర్ కు చెందిన బంధువులు మంగళవారం పద్మ ఇంటికి వచ్చారు. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో పద్మ బోనాల సంద ర్భంగా పిండి వంటలు చేస్తుండగా గ్యాస్‌లీక్ అయింది. ప్రమాదవశాత్తు మంటలు పద్మకు అంటుకో వడంతో ఆమెను కాపాడబోయి మిగతా వారికి కూడా మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో ఏడుగు రికి తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న దోమలగూడ పోలీసులు అగ్నిమాపక సిబ్బందిని రప్పించి మంటలను ఆర్పించారు. ఏడుగురిని చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఏడు గురిలో ఐదుగురు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. గాయాలకు గురైన వారు ధనలక్ష్మి (30), ధనలక్ష్మి పిల్లలు అభినవ్ (8), శరణ్య (6), విహార్ (3), నాగమణి (38) ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

దోమలగూడ అగ్ని ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగా త్రులను ఎమ్మెల్యే ముఠా గపాల్ పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

- ఎమ్మెల్యే ముఠాగోపాల్
- బోనాల ఉత్సవాలకు చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం భోలక్పూర్ దేవుని తోటలో గల భవాని శంకర ఆల యంలో ముషీరాబాద్ నియోజక వర్గంలోని 187 అమ్మవారి దేవాలయాలకు బోనాల ఉత్స వాల నిర్వహణ కోసం దేవాదాయ శాఖ మంజూరు చేసిన రూ.93.55లక్షలు విలువ చేసే చెక్కులను ఆలయ కమిటీ నిర్వాహకులకు ఎమ్మెల్యే ముఠాగోపాల్, డివిజన్ కార్పొరేటర్లు సుప్రియా నవీన్ గౌడ్, రవిచారి, పావని వినయ్ కుమార్, రచనశ్రీలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే బోనాల ఉత్సవాలను ఈ సంవత్సరం మరింత వైభవం గా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, పార్టీ సీనియర్ నాయకులు రెబ్బ రామారావు, బింగి నవీన్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, కె. మాధవ్, ఆరు డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు నర్సింగ్ ప్రసాద్, వై.శ్రీనివాస్ రావు, ఆర్.మోజేస్, రాకేష్, వల్లాల శ్యామ్దవ్, గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధరాచారి, ముషీరాబాద్ మహంకాళి దేవాలయ కమిటీ చైర్మన్ ఎయిర్టెల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గౌలిగూడ బోనాల పండుగ ఏర్పాట్లు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గౌలిగూడ మహంకాళి అమ్మవారి బోనాల ఏర్పాట్లపై జీహెచ్ఎంసీ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వాటర్‌వర్క్స్, పోలీస్, ట్రాఫిక్ పోలీస్ వివిధ శాఖ అధికారులతో మంగళవారం మహంకాళి దేవాలయం ట్రస్ట్ కార్యాలయంలో చైర్మెన్, కార్పొరేటర్ శంకర్ యాదవ్ ఆధ్వ ర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్ మాట్లాడుతూ మహంకాళి అమ్మవారి బోనాల ఏర్పాట్లలో ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా అధికారులు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో లాల్‌దర్వాజ బోనాల తర్వాత జరిగే అతిపెద్ద బోనాల పండుగ గౌలిగూడలో జరగనున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోల్కొ ండ జిల్లా అధ్యక్షులు పాండు యాదవ్, బేగంబజార్ డివిజన్ కార్పొరేటర్ శంకర్ యాదవ్, జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్ కుమార్‌గౌడ్, జీహెచ్ఎంసీ పోలీస్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 44 వేల టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేసి విద్యా ప్రమాణాలను పెంచాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జాతీయ బీసీ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి తన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశా లల్లో టీచర్లు లేక విద్యా ప్రమాణాలు పూర్తిగా దెబ్బతిన్నా యని, విద్యార్థులకు సైన్స్, మథ్స్, ఇంగ్లీష్, సబ్జెక్టులు చెప్పే ఉపాధ్యాయులు లేక పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన టెట్ పరీక్షలు 45 రోజులలో పూర్తి చేసి ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 44 వేల టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. డీఎస్సీ నోటిఫికేషన్ గత 7 సంవత్సరాల నుండి వెలువడ లేదని, వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్యతో పాటు తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, శారదా, అనురాధ, లక్ష్మీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయాల సేవలపై అవగాహన

గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

వార్డు కార్యాలయ పాలన ప్రతీ ఒక్కరికి అందు బాటులో ఉండాలని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శ్రీకారం చుట్టారు. ఈ సేవలకు సంబంధించిన కరపత్రాలను గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ఈ కరపత్రాలలో వార్డు కార్యాలయంలో అందుబాటులో ఉన్న సంబంధిత శాఖల వివరాలతో ఉన్నాయని, ఈ పత్రాలను ప్రతి ఇంటింటికి శానిటేషన్ విభాగా అధికారులు పంపిణీ చేసి వార్డు కార్యాలయంలో అందుబాటులో ఉన్న సేవలను వివరించి సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు డీఈ సువర్ణ, ఏఈ వెంకటేష్, రోడ్ ఇన్స్పెక్టర్ మిస్బా, జిహెచ్ఎంసి శానిటేషన్ సూపర్వైజర్ యాదగిరి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాన్ని స్థాపిస్తాం

- ధర్మసమాజ్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆ పార్టీ అధినేత డా. విశారదన్ మహరాజ్



నవతెలంగాణ-అంబర్‌పేట

అగ్రకులరెడ్డి వెలమల రాజ్యాన్ని కూలదోసి అణగారిన వర్గాలైన బీసీ,ఎస్సీ,ఎస్టీల రాజ్యాన్ని స్థాపిస్తామని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.విశారదన్ మహరాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని బర్కత్‌పురలో ధర్మ సమాజ్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రం కోసం బలిపీఠం ఎక్కింది బీసీ,ఎస్సీ,ఎస్టీలైతే 10శాతం కూడా లేని రెడ్డి వెలమ కులాలు తెలంగాణను పాలించడం ఏమిటని అన్నారు. 90 శాతం ఉన్న మూడున్నర కోట్ల బీసీ,ఎస్సీ,ఎస్టీలు తెలంగాణ రాష్ట్రా న్ని పరిపాలించాలని కదా అని అన్నారు. అందుకే ధర్మసమాజ్ పార్టీని స్థాపించినట్లుగా పేర్కొన్నారు. ఒక శాతం లేని వెలమలు పార్టీ పెట్టి ప్రభుత్వాన్ని స్థాపిస్తే మూడు నాలుగు శాతం లేని రెడ్లు అధికారంలోకి వస్తే మరి మూడున్నర కోట్ల మంది బీసీ ఎస్సీ ఎస్టీలకు ఒక పార్టీ లేదు కదా అందుకే డీఎస్పీ ని స్థాపించి సబ్బండ కులాలను అధికారంలోకి తీసుకువస్తామన్నారు. బీజేపీ ఆదర్శ పార్టీ అని చెబుతూ కాంగ్రెస్ రెడ్ల నాయకత్వంలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని బీజేపీ నాయకత్వాన్ని కూడా రెడ్లకి అప్పగించడం తో బీసీ ఎస్సీ ఎస్టీల పట్ల బీజేపీ కున్న చిత్తశుద్ధి ఏమిటో తేలిపోయిందన్నారు. హైదరాబాద్ కేంద్రంగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించినందుకు ధర్మసమాజ్ పార్టీ కార్యకర్తలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు రాఘవేంద్ర ముదిరాజ్ అబ్దుల్ రెహమాన్, అన్నెల లక్ష్మణ్, శివన్ మహారాజ్, అంజయ్య, వినోద్ యాదవ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

గండిమైసమ్మ నుంచి అప్పా జంక్షన్‌కు 40 నిమిషాలకో బస్సు

సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రయాణికుల సౌకర్యార్థమై నేటి నుంచి (12 తేదీ) గండిమైసమ్మ నుంచి అప్పాజంక్షన్ వరకు కొత్తగా నాలుగు బస్సులు నడప నున్నట్లు సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్(ఆర్ఎం)సీహెచ్.వెంకన్న తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 16 ట్రిప్పులతో ప్రతి 40 నిమి షాల వ్యవధిలో గండిమైసమ్మ నుంచి అప్పా జంక్షన్‌కు (వయా) బోరంపేట, మల్లంపేట, మియాపూర్‌క్రాస్‌రోడ్డు,గచ్చిబౌళి, నార్సింగ్ మీదుగా బస్సులను నడపను న్నట్లు ఆయన తెలిపారు. హెచ్‌సీయూ డిపో కు చెందిన ఈ బస్సులు ప్రతి రోజు ఉదయం 7.00 గంటల నుంచి రాత్రి 20.15 గంటల వరకు, తిరుగు ప్రయాణంలో ఉదయం8.35 గంటల నుంచి 18.25 వరకు అందుబాటులో ఉం టాయ న్నారు. టీఎస్ఆర్టీసీ కల్పిస్తున్న ఈ సౌకర్యాన్ని ఆ ప్రాంతా నికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, ప్రజలందరూ గమనించి వినియోగించుకోవాలని ఆర్ఎం సీహెచ్ వెంకన్న కోరారు.

సంక్షేమాన్ని గాలికి వదిలేసిన ప్రభుత్వం

-డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు



నవతెలంగాణ-అంబర్‌పేట

పేద,బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తా మన్న రాష్ట్రప్రభుత్వం, పేదల సంక్షే మాని గాలికి వదిలేసిందని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్య క్షులు డా.ఎన్.గౌతమ్‌రావు అన్నా రు. పేదల కు డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లను ఇంత వరకు పంపిణీ చేయలేదని సూటిగా ప్రశ్నించారు. వర్షాకాలంలో ఇండ్లలోకి నీరు వచ్చి పేదలు అవస్థలు పడుతున్న ప్రభుత్వం పేదల గురించి ఆలోచించడం లేదని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పరిపాలన కొనసాగుతుందని, ప్రజలు తగిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమం విషయంలో కేసీఆర్ ప్రభుత్వం రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోమని ఘాటుగా ఆరోపించారు.

రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై భగ్గుమన్న తెలంగాణ



నవతెలంగాణ-ఓయూ

వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ సరఫరాపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 3 గంటలు మాత్రమే కరెంట్ ఇస్తామనడం సిగ్గుచేటన్నారు. ఉచిత విద్యుత్ కార్యక్రమాన్ని రద్దు చేయాలన్న దుర్మార్గపు ఆలోచన కాం గ్రెస్ పార్టీదని, గతంలో కూడా విద్యుత్ ఇవ్వకుండా రైతులను గోసపెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని మరో సారి తన రైతు వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ పార్టీ బయటపెట్టుకుంది. ఒక ఎకరానికి నీళ్లు కావాలంటే ఒక గంట చాలు మూడెకరాలకు పుల్లుగా నీళ్లు సరిపోతాయని, మూడు గంటలుచాలన్నారు. బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్ మాట్లాడుతూ కాంగ్రెస్,టీడీపీ పాలనలో కరెంట్ లేక రైతులు అరిగోస పడ్డారని, స్వరాష్ట్రంలో పుష్కలంగా సాగునీరు, నాణ్యమైన నిరంతర కరెంట్ సరఫరాతో ఆర్థికంగా ఎదుగుతున్న రైతులను మళ్లీ చీకట్లోకి నెట్టేసే కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలను ప్రజలు తిప్పికొ డతారని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణ ప్రజలు, రైతులు భగ్గుమంటున్నారన్నారు. వ్యవసాయ రంగాన్ని కుదేలు చేసేలా కాంగ్రెస్ నిర్ణయాలు ఉన్నాయని మండిపడుతున్నారు.

13న బస్‌భవన్ వద్ద దివ్యాంగుల ధర్నా



నవతెలంగాణ-ముషీరాబాద్

దివ్యాంగులకు 50శాతం రాయితీతో కూడిన బస్సు పాస్ ఇవ్వాలని సిటీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేస్తూ డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వల్లభనేని ప్రసాద్ ఉపాధ్యక్షులు కాటమోని వెంకటేష్ గౌడ్ తెలిపారు. మంగళవారం చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యా లయంలో సంబంధిత వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిరులకు దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్‌లో 70శాతం పైగా అంగవైకల్యం ఉన్నవారికి నగరంలో ఆర్టీసీ బస్సు లలో ఉచిత ప్రయాణం, రాష్ట్రవ్యాప్తంగా 50 శాతం రైతుతో కూడిన బస్పాసులు ఇవ్వాలన్నారు. ఆర్టీసీ విభాగంలో దివ్యాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్‌తో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 13వ తేదీన ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని బస్సు భవన్ వద్ద నిర్వహించే మహాధర్నాను దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సావుద్దీన్, సత్యం గౌస్ పీర్ షఫరుద్దీన్ శ్యాముల్ల తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి పల్లా రాజేశ్వర్‌రెడ్డి



- పులిమామిడి నారాయణ

నవతెలంగాణ-ముషీరాబాద్

రైతుబంధు రాష్ట్ర చైర్మెన్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అనునిత్యం కార్మికుల సంక్షేమం కోసం పాటుప డు తున్నారని కనీస వేతనాల సలహా బోర్డు చైర్మెన్ పులి మామిడి నారాయణ అన్నారు. మంగళవారం పల్లా రాజే శ్వరరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం రాష్ట్ర కార్యాలయం వద్ద వాటర్ వర్క్స్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మిక సమస్యలను తెలంగాణ రాష్ట్ర ముఖ్య మం త్రి కేసీఆర్ దృష్టికి తీసుకుపోతూ వారి సమస్యల పరిష్కారంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి కీలక పాత్ర పోషిస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూ నియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌రెడ్డి ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి ఆంజనేయులు నాయకులు బాలరాజు నరేందర్ కమలాకర్ బాబు అనిల్ మహేష్ రెడ్డి హరీష్ రవి తదితరులు పాల్గొన్నారు.

'నిజాం కళాశాలలో కొత్త కోర్సులు'

- కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ బి.బీమా



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నిజాం కళాశాలలో ఈ విద్యా సంవత్సరం (2023-24) నుంచి పలు కొత్త కోర్సులను ప్రవేశపెట్టామని, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతున్నామని నిజాం కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ బి.బీమా తెలిపారు. మంగళవారం నిజాం కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజాం కళాశాల పూర్వ విద్యార్థి, రాష్ట్ర మంత్రి కేటీఆర్ సహ కారంతో రూ.25 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఇందులో ఇప్పటికే బాలికల వసతి గృహాన్ని పూర్తి చేసిఅందుబాటులోకి తెచ్చామని తెలిపారు. అలాగే బాలుర హాస్టల్ నిర్మాణాన్ని ప్రారంభించామని, త్వరలోనే మరో క్లాస్‌రూమ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకు స్థాపన చేస్తామన్నారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యా లను కల్పిస్తూ విద్యలో నాణ్యత ప్రమాణాలను మరింత పెంపొందించే విధంగా కృషి చేస్తామని వివరించారు. నిజాం కళాశాల చారిత్రాత్మక ప్రత్యేకతను దృష్టిలో ఉం చుకుని కళాశాలకు రావలసిన రూ.14 కోట్ల ఉపకార వేత నాల బకాయిలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 60 సీట్లతో బిబిఏ-రిటైలింగ్ కోర్సును, 60 సీట్లతో బీఎస్సీ కంప్యూటర్స్ కోర్సులను ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు కలిగేలా పలు సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటూ పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. మార్కెట్ లో కోర్సులకు ఉన్న డిమాండ్ రీత్యా ఫార్మా ఇన్ఫర్మేటిక్స్ కోర్సులో 30 నుంచి 45 సీట్లకు పెంచా మని, మైక్రోబ యాలజీలో 30 నుంచి 45 సీట్లకు, బీఎస్సీ ఎంఎస్‌సీఎస్ కోర్సులో 30 నుంచి 60 సీట్లకు, ఎంఈసిఎస్ కోర్సులో 30 నుంచి 60 సీట్లకు, ఎంపీహెచ్‌సీఎస్ కోర్సులో 30 నుంచి 60 సీట్లకు పెంచినట్లు తెలిపారు. ఈ సమావే శంలో నిజాం కళాశాల వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ గంగ ఉపేందర్ రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.గీత, ఎగ్జామ్స్ కంట్రోలర్ డాక్టర్ జ్యోతి, కళాశాల పిఆర్ఓ పరంధాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కరెంటు వద్దంటే ఎట్లా?

- ఎమ్మెల్యే దానం నాగేందర్..



నవతెలంగాణ-బంజరాహిల్స్

రైతులకు కరెంటు 24 గంటలు అవసరం లేదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఘా టుగా స్పందించారు. రైతులు బాధలు తెలియని రియల్ ఏస్టేట్ భూస్వామికి ఓట్లు ఎందుకు వే యాలని ఆయన అన్నారు. మంగళవారం నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన బోనాల పండుగను పురస్కరిం చుకొని పలు ఆలయాలకు కార్పొరేటర్లతో కలిసి మొక్కులు చెల్లించుకున్న ఆయన కాంగ్రెస్ పార్టీ టిపిసిసి అధికారి రేవంత్ రెడ్డి మాటలను ఖండించారు. 24గంటలు రైతులకు కరెంటు అవసరం లేదన్న వ్యక్తికి రైతులే బుద్ధి చెబుతారన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్,వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నే కవిత రెడ్డి, సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, బంజర హిల్స్ ఖైరతా బాద్ డివిజన్ల అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

ఓయూ పరిపాలనా భవన్ ఎదుట విద్యార్థుల ఆందోళన



నవతెలంగాణ-ఓయూ

నిజం కళాశాలలో విజయవంతంగా నిర్వహణలో ఉన్న 5 ఏండ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సు రద్దుకు వ్యతిరేకంగా మంగళవారం నిజాం కళాశాల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ ఓయూ పరిపాలనా భవన్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. అంతకుముందు వారు ఎన్‌సీసీ గేట్ ఎదుట ర్యాలీ నిర్వహిం చారు. కోర్సును తిరిగి పునరుద్ధరణ చేసే వరకు తమ ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో వీఎల్ సీసీ మూడు కొత్త బ్యూటీ క్లినిక్‌లు ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

వీఎల్ సీసీ బ్యూటీ, స్కిన్‌కేర్ బ్రాండ్ హైదరాబాద్‌లో మూడు కొత్త బ్యూటీ క్లినిక్‌లను ప్రారంభించింది. ఈ మూడింటితో కలిపి ఇప్పుడు నగరంలో ఐదు బ్యూటీ క్లినిక్‌లు ఉన్నాయి. ఈ సందర్భంగా వీఎల్ సీసీ వెల్‌నెస్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్, ఆనంద్ వాస్కర్ మాట్లాడుతూ 'దేశం అంతటా మా ఉనికి, పరిధిని విస్తరించడం ద్వారా అందం, ఆరోగ్యాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మేం మిలియన్ల మంది జీవితాలపై సానుకూల ప్రభావాన్ని చూపగలం అని విశ్వసిస్తున్నాం. ఇది మా ప్రతిష్టాత్మకమైన వద్ధి ప్రణాళికకు ప్రారంభం మాత్రమే. ఈ ఏడాదిలో దేశంలో 50కి పైగా కొత్త క్లినిక్‌లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని తెలిపారు. 'హైదరాబాద్‌లో మూడు కొత్త బ్యూటీ క్లినిక్‌లను ప్రారంభించడం సంతోషం. ప్రజలు తమను తాము అత్యంత అందంగా, ఆరోగ్యకరంగా మార్చుకోవడంలో సహాయపడే మా దీర్ఘకాల మిషన్‌లో ఇది పెద్ద ముందడుగు. మా బ్యూటీ క్లినిక్‌లలోని నిపుణులు చర్మ సంరక్షణ, కేశాలంకరణ, బరువు తగ్గడం, బాడీ స్కల్ప్చర్ ఆకతి, మొత్తం సంపూర్ణ ఆరోగ్యంతో కూడిన వ్యక్తిగతీ కరించిన పరిష్కారాలను అందిస్తారు. హైదరాబాద్ ప్రజలకు సేవ చేయడానికి, వారి బ్యూటీ, వెల్‌నెస్ లక్ష్యాలను సాధించడంలో వారికి సహాయం చేయడానికి సంతోషిస్తున్నాం' అని వీఎల్‌సీసీ గ్రూప్ సీఈఓ వికాస్ గుప్తా తెలిపారు.



'గ్రీన్‌కోతో ఎనర్జీ స్టోరేజీతో సెరెంటికా రెన్యూవబుల్స్'ఒప్పందం

5

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

దేశంలోని ప్రముఖ సీ అండ్ ఐ ఫోకస్డ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలపర్, సెరెంటికా రెన్యూవబుల్స్, గ్లోబల్ ఎనర్జీ స్టోరేజ్ డెవలపర్, గ్రీన్‌కో గ్రూప్‌తో వినూత్నమైన ఇంధన నిల్వ సామర్థ్యం ఒప్పందంపై సంతకం చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ ప్రతీక్ అగర్వాల్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రక టించారు. ఈ ఒప్పందంలో భాగంగా గ్రీన్‌కో ప్రత్యేకమైన ఇంధన నిల్వ సామర్థ్యాలపై ఆధారపడి సెరెం టికా ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో రాబోయే దాని ఇంధన నిల్వ ప్రాజెక్టుల నుండి 1,500 ఎండ బ్ల్యూ హెచ్ ఆర్ సామర్థ్యాన్ని ఉపయోగించుకుంటుందన్నారు. దేశం ఇంధన వినియోగాన్ని డీకార్బనైజ్ చేయ డానికి, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి దీర్ఘకాల ఇంధన నిల్వ కీలకమని, గ్రీన్‌కోతో ఈ ప్రత్యేకమైన ఇంధన నిల్వ సామర్థ్యం ఒప్పందం, కష్టతరమైన, అత్యధిక విద్యుత్ వినియోగ పరిశ్ర మలను స్వచ్ఛ ఇంధన దిశగా మార్చాలనే తమ మిషన్‌ను మరింత వేగవంతం చేస్తుందని, వాతావరణ మార్పు లను తిప్పికొట్టడానికి సహాయం చేస్తుందన్నారు.

కోర్టుకు హాజరకండి

నవతెలంగాణ-బంజారాహిల్స్

జూబ్లీహిల్స్ ఫిల్మ్‌నగర్‌లోని డెక్కన్ కిచెన్ హొటల్ కూల్చివేతపై హైకోర్టు సీరియస్ అయ్యింది. విచా రణ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్, నిర్మాత సురేష్ బాబు కోర్టుకు హాజరు కాకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టుస్టే ఆర్డర్ ఉండగా హొటల్‌ను అధికా రులు ఎలాకూల్చివేస్తారని, ఆది వారం అంత అత్యవసరంగా కూల్చే యాల్సిన అవ సరం ఏముందని ధర్మా సనం మండిపడింది. కోర్టు తీర్పును ఎందుకు ధిక్కరించారని, ప్రతివాదులందరు కోర్టు ధిక్కరణ ఎదుర్కో వాల్సి ందేనని పేర్కొంది. జీహెచ్ఎంసీ మాజీ కమి షనర్, బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌తో సహా ప్రతివాదులం దరూ గురువారం కోర్టుకు హాజరుకావాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.



ముషీరాబాద్ నియోజకవర్గంలోని దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగళవారం రోజ్ కాలనీలోని ఓ ఇంట్లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించి ఏడుగురికి తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. అగ్నిప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ ముదిరాజ్ పరిశీలించారు. ఘటనపై బాధిత కుటుంబ సభ్యులను వివరాలు అడిగితెలుసుకున్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో



కుల, మతాల తావులేదు

'గృహిణులు మాత్రమే కాదు, ఉద్యోగాలు చేసే మహిళలు కూడా పార్శిల్‌లను సిద్ధం చేస్తారు. మా అమ్మ టీచర్, ఆమె కూడా ఆహార పొట్లాలు ఇస్తుంది. ఇలాంటి కార్యక్రమం దేశంలో మరెక్కడైనా జరిగితే ఎన్నో సమస్యలు వచ్చేవి. ఎందుకంటే చాలా చోట్ల నిమ్న కులస్తులు పాఠశాలలో విద్యార్థుల కోసం భోజనం వండితే అగ్రవర్ణాల తల్లిదండ్రులు వ్యతిరేకించడం మనం చూస్తున్నాం. రహీమ్ అనే పేరున్న వ్యక్తి ఆహారాన్ని అందిస్తే మతం, కులంతో పాటు దాని నిరూపణను ప్రశ్నించడాన్ని కూడా చూశాం. కానీ కేరళ ఆహార పొట్లాలకు ఇలాంటి సమస్యలేమీ లేవు. భోజనం వండే స్త్రీకి లబ్దిదారుని కులం, మతం తెలీదు. ఆరేండ్లలో నేను ఎప్పుడూ కులం, మతం పేరుతో పార్శిల్ ఇవ్వలేదు. భోజనం తీసుకున్న వారు కూడా అది వండింది హిందూనా, క్రిస్టియనా, వారి కులం ఏంటీ? అని మమ్మల్ని ఎప్పుడూ అడగలేదు. ప్రజలు కృతజ్ఞతతో ఆహారంగా స్వీకరిస్తారు" అని ఎర్నాకులం జిల్లా డివైఎఫ్ఐ కార్యకర్త, లా విద్యార్థిని మేఘనా మురళి అంటున్నారు.





ప్రపంచ ఖ్యాతి పొందిన కేరళ 'హృదయపూర్వం' అపూర్వం

దేశంలోనే అత్యంత ప్రగతిశీల రాష్ట్రం కేరళ. ఆ రాష్ట్రం తన గొప్పతనాన్ని మరోసారి రుజువు చేసుకున్నది. ఆస్పత్రుల్లో ఆకలితో ఉన్న రోగులు, వారి కుటుంబీకులకు ఆహారం అందిస్తూ ఆ రాష్ట్ర అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) తన మానవత్వాన్ని చాటుకుంటున్నది. ఇప్పటి వరకు ఆరు కోట్ల పైచిలుకుల భోజనాలు పంపిణీ చేసి కేరళ డీవైఎఫ్ఐ ప్రపంచ ఖ్యాతి సొంతం చేసుకున్నది. అందుకే ప్రతిష్టాత్మక బ్రిటన్ పత్రిక "ది గార్డియన్" వీరి మానవత్వంపై ప్రత్యేక కథనం సైతం ప్రచురించింది. 2017లో ప్రారంభమైన ఈ నిత్య భోజన పంపిణీ అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంది. హృదయపూర్వం విజయవంతం కావడంలో కేరళ మహిళల పాత్ర వెలకట్టలేనిది. ఆ వివరాలు నేటి మానవిలో...





ప్రేమతో వండిన ఆహారమే శ్రేష్ఠమైనది. అయితే కేరళలో ప్రేమతోపాటు మానవత్వంతో కలిపి వంట చేయడం వల్ల రుచికరమైన భోజనం లభిస్తుందని వేలాది మంది మహిళలు నిరూపించారు. ప్రతిరోజూ ఉదయం కేరళ స్త్రీలు తమ కుటుంబ సభ్యుల కోసం వంట చేసేటపుడు అదనపు బియ్యాన్ని, మరికొన్ని కూరగాయలను వంటలో కలుపుతారు. అదనంగా వండిన ఆ ఆహారాన్ని అరటిఆకుపై ఉంచి, ఆహార పొట్లం వలె చక్కగా కట్టి , రక్షణ కోసం వార్తాపత్రిక షీట్‌లో చుట్టి పెడతారు. తర్వాత డివైఎఫ్ఐ కార్యకర్తలు వచ్చి ఆ భోజన పొట్లాలను సేకరిస్తారు. మధ్యాహ్నానికి రాష్ట్రంలోని ఆసుపత్రుల్లో రోజుకు సుమారు 40,000 మంది రోగులకు ఆ పొట్లాలను పంపిణీ చేస్తారు.

ప్రేమతో పాటు మానవత్వం కలిపి

ఆసుపత్రుల్లో ఉచితంగా ఆహారం ఇవ్వరు. వైద్యం పొందుతున్న రోగి వద్ద తప్పనిసరిగా ఎవరో ఒకరు సహాయంగా ఉండాల్సిందే. మందుల కోసం పరిగెత్తడం, పరీక్షలు ఏర్పాటు చేయడం, అవసరమైనపుడు నర్సును తీసుకురావడం వంటి చాలా పనులు వీరికి ఉంటాయి. మన దేశంలో వైద్యం అంటేనే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. అది భరించడం ఎంతో కష్టం. ఇక సహాయకులకు హోటల్లో గది తీసుకునే ఆర్థిక స్థోమత ఎక్కడ ఉంటుంది. దాంతో చాలా మంది హాస్పిటల్ వార్డులో నేలపై, కారిడార్‌లలోని బెంచీలపై పడుకుంటారు. అలాంటి వారు రెస్టారెంట్లలో తినడం అనేది వారి స్థోమతకి మించినది. దాంతో చాలా మంది ఆకలితో అలమటిస్తున్నారు. అలాంటి వారికి సహాయం చేయాలనే డివైఎఫ్ఐ రంగంలో దిగింది. ఆహార పొట్లాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళలు తమ ఇళ్ల వండి ప్యాక్ చేసిన ఆహార పొట్లాలు సేకరించి ఆసుపత్రిలో రోగులకు, సహాయకులకు అందజేస్తారు.

అదనపు ఖర్చు లేకుండా...

2017లో 300 పొట్లాలతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఎటువంటి ఖర్చులూ ఉండవు. గ్యాస్, విద్యుత్ బిల్లులు, కుక్‌లు, క్లీనర్‌లతో కూడిన ప్రత్యేక కమ్యూనిటీ కిచెన్ అవసరమే లేదు. ఇళ్లల్లో మహిళలు కుటుంబ సభ్యులకు సరిపడిన దానికంటే కొద్ది మొత్తం అదనపు భోజనం వండుతారు అంతే. డివైఎఫ్ఐ వాలంటీర్లు ప్రతి కుటుంబాన్ని ఒకటి లేదా రెండు పొట్లాలను సిద్ధం చేయమని అడుగుతారు. అయితే చాలా మంది ఐదు లేదా ఆరు తయారు చేసి పెడతారు. కొంత మంది 10 పొట్లాలు కూడా సిద్ధం చేసి పెడుతుంటారు. పండుగలు, ఆదివారం అంటూ విరామం లేకుండా ఏడాదిలో 365 రోజులు భోజన పంపిణీ ఉంటుంది. కేరళలో అత్యంత ముఖ్యమైన పంటల పండగ ఓనం సమయంలో బియ్యం, గింజలు, బెల్లం, పంచదారతో కూడిన తీపి వంటకం పాయసం పార్శిల్స్‌కు అదనంగా జోడిస్తారు. క్రిస్మస్ సమయంలో ప్లం కేక్ ముక్కను జత చేస్తారు.

భారంగా భావించరు

డివైఎఫ్ఐ కార్యకర్తలు ప్రతి ఏడాది జనవరి 1న షెడ్యూల్‌ను తయారు చేసి వంట చేయాల్సిన తేదీలను ఇళ్లకు ఇస్తారు. నిర్ణీత సమయానికి ఒక వారం ముందు వాలంటీర్లు వారు పర్యవేక్షించే ప్రాంతాల్లోని కుటుంబాలను (దాదాపు 100 నుండి 200 కుటుంబాలను) అప్రమత్తం చేయడానికి ఫోన్‌కాల్ చేస్తారు. ఒక రోజు ముందు మళ్లీ గుర్తు చేస్తారు. రోజూ వాలంటీర్లు అన్ని పొట్లాలను సేకరించి జిల్లాలోని ఆసుపత్రులకు పంపిణీ చేస్తారు. పెద్ద ఆసుపత్రులలో ఒక రోజులో 1,000 కంటే ఎక్కువ పంపిణీ చేస్తారు. అలా ఇప్పటి వరకు రాష్ట్రంలోని వివిధ ఆసుపత్రుల్లో 6,08,42,970 ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

సమానత్వాన్ని సృష్టించడం

"మరిన్ని ఆసుపత్రులకు ఈ కార్యక్రమాన్ని వర్తింపజేస్తాం, అన్నదానంతో పాటు రక్తదానాన్ని ప్రోత్సహిస్తున్నాం' అంటూ డీవైఎఫ్ఐ కార్యకర్తలు అంటున్నారు. వరదలు, కోవిడ్ మహమ్మారి వంటి ఏ సంక్షోభంలోనైనా కేరళ డివైఎఫ్ఐ కార్యకర్తలు అలసిపోకుండా రోజంతా కష్టపడతారు. ప్రతి రోజూ ఒక్కో ప్రాంతీయ కమిటీ ఆహార పొట్లాల పంపిణీ చేసే బాధ్యత తీసుకుంటుంది. "ఈ కార్యక్రమం లక్ష్యం కేవలం పేదరికాన్ని నిర్మూలించడమే కాదు. సమానత్వాన్ని సృష్టించడం, కుల, మత భేదాలను తొలగించడం. సమాజం పట్ల శ్రద్ధ వహించాలని యువతకు నేర్పడం. ప్రాథమికంగా ఇది మనిషిగా ఒక సాధారణ సందేశాన్ని బోధించడమే" అని డివైఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపి ఎఎ రహీం అన్నారు.

మరింత రుచిగా వండేందుకు

'మేము ఆహార పొట్లాలను అందజేస్తున్నపుడు వారి కండ్లలో కృతజ్ఞతను చూస్తాం. అది మాకు చాలా భావోద్వేగ క్షణం. మహిళలు తమ సొంత కుటుంబాలకు చేసే భోజనం కంటే మెరుగైన భోజనాన్ని పంపిణీ కోసం వండుతున్నారు. మరింత రుచిగా వండేందుకు ప్రయత్నం చేస్తారు. వేయించిన చేప ముక్క, పచ్చళ్లు, చట్నీ, పొప్పడును వీటిలో కలుపుతారు" అని చెరువైక్కల్‌లోని డివైఎఫ్ఐ వాలంటీర్, సివిల్ సర్వెంట్ అయిన సూర్య హేమన్ అంటున్నారు. దేశంలోని అత్యంత ప్రగతిశీల రాష్ట్రం కాబట్టే ఈ కార్యక్రమం ఇంతగా విజయవంతం అయిందని అందరూ 'హృదయపూర్వం'ని అభినందిస్తున్నారు.

- జె.జగదీష్, న్యూఢిల్లీ



సంతోషంగా చేస్తున్నాం

చెరువైక్కల్ ప్రాంత నివాసి జయ కుమారి నిత్యం భోజన పొట్లాలు తయారు చేసి పంపుతారు. ఆమె మాట్లాడుతూ 'భోజనం పొట్లాల కోసం వంట చేసేటపుడు నా భర్త కూడా నాకు సహాయం చేస్తారు. వాలంటీర్లు నన్ను రెండు, మూడు పొట్లాలు మాత్రమే సిద్ధం చేయమంటారు. కానీ మేము మాత్రం ఎనిమిది నుండి 10 పొట్లాలను సిద్ధం చేసి ఇస్తాము. ఇదేమీ మాకు భారం కాదు. పైగా చాలా సంతోషంగా చేస్తున్నాము. నేను ఏ కూరగాయతో వంట చేసినా అందులో వేయించిన చికెన్‌ని కలుపుతాను. దీని వల్ల కూరకు రుచితో పాటు తినేవారికి పోషకాలు కూడా అందుతాయి' అన్నారు.



మోడీని కాపాడేందుకు బీఆర్ఎస్ పంచాయితీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రధాని మోడీని రక్షించేందుకు బీఆర్ఎస్ చిల్లర పంచాయతీకి తెగపడిందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. అమెరికాలో తాను అనని మాటలను అన్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రులు, బీఆర్ఎస్ నేతల చిల్లర ప్రయత్నాలకు ఓ చానెల్ వత్తాసు పలుకున్నదని, ఆ అనుబంధాన్నీ, వారి బాగోతాన్ని త్వరలో బయట పెడతానని హెచ్చరించారు. అమెరికాలో తాను మాట్లాడిన మాటలకు సంబంధించి కోడిగుడ్డుపై ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలకు కాంగ్రెస్‌ను వేలెత్తి చూపించే అర్హత లేదన్నారు. ఉచిత విద్యుత్ పథకం కాంగ్రెస్‌పార్టీకి పేటెంట్ అని గుర్తు చేశారు. 24 గంటల ఉచిత విద్యుత్ ముసుగులో బీఆర్ఎస్ సర్కారు రైతులను మోసం చేస్తున్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ సర్కారు రైతులకు 12 గంటలు కూడా నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇవ్వడం లేదనీ...అయితే 24గంటల విద్యుత్ ఇస్తున్నట్టు రైతులను మోసం చేస్తున్నారని రేవంత్ ఆరోపించారు. దీనికి నిరసనగా బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ స్టేషన్ల ముందు కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేయాల్సిందిగా పార్టీ శ్రేణులుకు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపోయిందని రేవంత్ పేర్కొన్నారు. అందుకే బీఆర్ఎస్ మంత్రులు, నేతలు దుష్ప్రచారాలకు తెగబడ్డారని విమర్శించారు. వరంగల్‌లో ప్రకటించిన రైతు డిక్లరేషన్ విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లిందన్నారు. అది వారిలో భరోసా నింపిందని తెలిపారు. తొమ్మిదేండ్లలో విద్యుత్ సంస్థలకు కేసీఆర్ సర్కారు రూ.60 వేల కోట్ల అప్పుల్లోకి నెట్టిందని పేర్కొన్నారు. అవినీతితో వాటిని దివాళా తీయించిన ఘనత కేసీఆర్ దేనని తెలిపారు. దీనిపై అమరవీరుల స్థూపం వద్ద చర్చకు తాను సిద్ధమనీ, 'కేసీఆర్ అండ్ కో' కూడా సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు.

రాహుల్ లోక్‌సభ సభ్యత్వం రద్దుకు నిరసనగా నేడు సత్యాగ్రహ దీక్ష

రాహుల్ గాంధీపై మోడీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తు ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని అప్రజాస్వామికంగా రద్దు చేసిందని రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఏఐసీసీ పిలుపుమేరకు బుధవారం టీపీసీసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 'సత్యాగ్రహ దీక్ష' పేరుతో గాంధీజీ విగ్రహాల వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఉచిత విద్యుత్‌పై చిల్లర హడావుడి చేస్తున్నా బీఆర్ఎస్...సత్యాగ్రహ దీక్షను నీరుగార్చే కుట్రకు పాల్పడుతోందని ఆరోపించారు.

ప్రభుత్వాలకు పెట్టుబడిదారుల ప్రయోజనాలే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం "పట్టణ స్థానిక సంస్థల సంస్కరణలు, కేంద్ర ప్రభుత్వ తాజా ఆదేశాలపై" చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. నగర అభివృద్ధి, ప్రణాళికలు అన్నింటికీ ప్రజల అవసరాల కోసం కాకుండా ఎన్నికల అవసరాలను బట్టి నిధులు విడుదలవుతున్నట్టు చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న నగరాల్లోని సివరేజీ నిర్వహణ, మంచినీటి సరఫరా వ్యవస్థను ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పే కుట్రలు సాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో భూముల రేట్లు పెరిగాయని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. మిగులు భూములను పేదలకు ఎందుకు పంచడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించే పద్ధతుల్లో పట్టణ ప్రణాళికల్లో సంస్కరణలు, మున్సిపాల్టీల్లో ఆర్థిక సంస్కరణ అమలు చేసే నగరాలకే నిధులు ఇస్తామని ప్రకటించడం అప్రజాస్వామికమన్నారు. సీపీఐ(ఎం) సెంట్రల్ సిటీ కమిటీ సెక్రటరీ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. నగరాల అభివృద్ధి కోసం సరైన పద్ధతుల్లో సామాన్య ప్రజలకు ఉపయోగపడే విధంగా నిధుల కేటాయింపులు జరగాలన్నారు. అర్బన్ పాలసీ విశ్లేషకులు డాక్టర్ డి.నరసింహారెడ్డి నగరాభివృద్ధి ప్రణాళికలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.దశరథ్, మహేందర్, శ్రీనివాసరావు, నగర కమిటీ సభ్యులు మారన్న, జి.నరేష్, నాయకులు శ్రీరాములు, అజయ్ బాబు, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎండీ జావిద్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్లు గరం..గరం..

(మొదటిపేజీ తరువాయి)

విభేధాలున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌కు పార్టీ టికెట్ ఇవ్వొద్దని, కొత్తవారికి ఎవరికి ఇచ్చినా గెలిపిస్తామని పార్టీ నేతలు రహస్య సమావేశం నిర్వహించి ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఎవరితోనూ సఖ్యతతో ఉండకపో వడం కూడా వివాదాలకు కారణమవుతోంది. మంత్రికి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎంపీ కవితల మధ్య సయోధ్య లేకపోవడం పార్టీకి నష్టదాయకంగా పరిణమించింది.

డోర్నకల్‌లో నిరసనలు..

డోర్నకల్ నియోజకవర్గం (ఎస్టీ)లో సీనియర్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌కు గతంలో ఎన్నడూ లేనంతగా నిలదీతలు ఎదురవుతున్నాయి. కురవి, సీరోల్, మరిపెడ మండలాల్లో ఆయన ఇటీవల పర్యటించిన తండాల్లో స్థానికులు నిలదీయడం చర్చనీయాంశంగా మారింది. నిలదీసిన వృద్ధురాలి వృద్ధాప్య పింఛను తొలగించాలని ఆదేశించడం కూడా వివాదస్పదంగా మారింది. డోర్నకల్ నియోజకవర్గం నుంచి పార్టీ టికెట్‌ను మంత్రి సత్యవతి రాథోడ్ ఆశిస్తున్నారు. తాజాగా తనను కలిసిన ఆత్మీయులతో సీఎం చేయమంటే డోర్నకల్ నుండే పోటీ చేస్తానని వ్యాఖ్యానించడం గమనార్హం. తనను ఓడించడానికి పార్టీలోని వారే ప్రయత్నిస్తున్నారని రెడ్యానాయక్ పరోక్షంగా మంత్రిపై ఆరోపణలు చేయడమూ చర్చనీయాంశంగా మారింది. గతంలో సత్యవతి రాథోడ్ టీడీపీ అభ్యర్థిగా డోర్నకల్ నుండి ఎమ్మెల్యేగా ఒక పర్యాయం గెలిచారు.

ములుగులో బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరు?

ములుగు నియోజకవర్గం(ఎస్టీ)లో బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనేది నేటికీ తేలలేదు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎవరినీ నియమించకపోవడంతో ఆశావహులు సైతం అసంతృప్తితో ఉన్నారు. ములుగు జెడ్పీ చైర్మెన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కుసుమ జగదీశ్ అనారోగ్యంతో మృతిచెందడంతో పార్టీ వ్యవహారాలు స్తబ్ధుగా ఉన్నాయి. జెడ్పీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా వైస్‌చైర్మెన్‌గా ఉన్న బడే నాగజ్యోతి కొనసాగుతున్నారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో మంత్రి కేటీఆర్ పర్యటనలో స్వయంగా వేదికపై బడే నాగజ్యోతిని ముందుకు వచ్చి కూర్చోవాలని కోరారు. దాంతో వచ్చే శాసనసభ ఎన్నికల్లో పార్టీ టికెట్ నాగజ్యోతికే ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఇంకా మాజీ ఎంపీ సీతారాంనాయక్‌తోపాటు పోరిక గోవింద్‌నాయక్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య టికెట్ ఆశిస్తున్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యే సీతక్క బలమైన నాయకురాలు కావడంతో ఆమెకు దీటైన అభ్యర్థి కోసం పార్టీ అన్వేషిస్తుందని సమాచారం. తొలుత సీతక్కను బీఆర్ఎస్‌లో చేర్చుకునే ప్రయత్నాలు చేసినా అవి కొలిక్కిరాలేదు.

జనగామలో 'ముత్తిరెడ్డి' కుటుంబ కలహాలు

జనగామ సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై స్వయానా కూతురే భూ కబ్జా ఆరోపణలు చేయడం అధికారపార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఇదే క్రమంలో కొన్ని నెలలుగా నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తనదైన శైలిలో చాప కింద నీరులా నెట్‌వర్క్‌ను విస్తరింపచేసుకున్నారు. అందరికీ నిత్యం టచ్‌లో ఉంటూ.. పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఇవ్వడం, సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించడం, మంత్రి కేటీఆర్‌కు సన్నిహితుడిగా పేరుండటంతో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి 'పోచంపల్లి' అని ప్రచారం జరుగుతోంది.

యూసీసీపై 46 లక్షల స్పందనలు

(మొదటిపేజీ తరువాయి)

కోరింది. 21వ లా కమిషన్ కూడా రెండు సందర్భాలలో ప్రజాభిప్రాయాన్ని సేకరించింది. దానికి అనుగుణంగా 2018 ఆగస్టులో 'కుటుంబ చట్టానికి సంస్కరణలు' పేరిట సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేసింది. అయితే ఈ పత్రాన్ని విడుదల చేసి మూడు సంవత్సరాలు పూర్తయిన దృష్ట్యా యూసీసీ ప్రాధాన్యత, ఔచిత్యంతో పాటు వివిధ న్యాయస్థానాలు ఇచ్చిన ఆదేశాలను దృష్టిలో పెట్టుకొని తాజాగా మరోసారి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవాలని భావిస్తున్నామని 22వ లా కమిషన్ బహిరంగ నోటీసు ద్వారా తెలియజేసింది. పార్లమెంటరీ కమిటీ ఎదుట హాజరైన సందర్భంలో కూడా తన నిర్ణయాన్ని లా కమిషన్ సమర్థించుకుంది.

ప్రతిపక్షాల కూటమిలోకి మరో ఎనిమిది పార్టీలు

(మొదటిపేజీ తరువాయి)

ద్రవిడ మున్నేట్ర కళగం (ఎండీఎంకే), కొంగు దేశ మక్కల్ కట్చి (కేడీఎంకే), విడుదలై చిరుతైగళ్ కట్చి (వీసీకే), రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పీ), ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ), కేరళ కాంగ్రెస్ (జోసెఫ్), కేరళ కాంగ్రెస్ (మణి), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) ఉన్నాయి. గత జూన్ 23న బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అధ్యక్షతన పాట్నాలో జరిగిన ప్రతిపక్షాల సమావేశంలో 16 పార్టీలు పాల్గొనగా, కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో బెంగళూర్‌లో తలపెట్టిన ప్రతిపక్షాల సమావేశంలో 23 పార్టీలు పాల్గొంటాయని ఆయా వర్గాలు తెలిపాయి. బెంగళూర్‌లో 17, 18 తేదీల్లో జరుగనున్న ఐక్యతా సమావేశంలో పాల్గొనాలని ప్రతిపక్ష పార్టీ నేతలను కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మంగళవారం ఆహ్వానించారు. 17 సాయంత్రం 6 గంటలకు బెంగళూర్‌లో సమావేశం, అనంతరం డిన్నర్ ఉంటుందని, జూలై 18న ఉదయం 11 గంటలకు తిరిగి సమావేశం కొనసాగుతుందని ఖర్గే ఆ లేఖలో తెలిపారు. 'ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమిస్తున్న పలు అంశాలతో పాటు అనేక కీలక అంశాలను గత సమావేశంలో చర్చించాం. రాబోయే సార్వత్రిక ఎన్నికలను సమైక్యంగా ఎదుర్కోవాలని ఏకగ్రీవంగా తీర్మానించడంతో పాట్నా సమావేశం విజయవంతమైంది' అని ఆ లేఖలో ఖర్గే పేర్కొన్నారు.

డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌బ్రిజ్ భూషణ్ శిక్షార్హుడే

న్యూఢిల్లీ : రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై మహిళా రెజ్లర్లు చేసిన ఆరోపణలకు బలం చేకూరుతున్నది. ఆయన శిక్షార్హుడేనని ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీటులో పేర్కొన్నారు. బాధితులను లైంగికంగా వెంటబడి వేధించినట్టు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. దీంతో బ్రిజ్ భూషణ్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆయనకు వ్యతిరేకంగా ఆరు కేసులు నమోదయ్యాయి. బాధితులను నేరపూరితంగా బెదిరించడం, మహిళల గౌరవ, మర్యాదలను భంగపరచడం, లైంగిక వేధింపులు, వెంటాడటం వంటి నేరాలకు ఆయన పాల్పడినట్టు ఆరోపిస్తూ ఢిల్లీ పోలీసులు ఈ కేసులను నమోదు చేసి.. దర్యాప్తు చేశారు. ఓ బాధితురాలిపై సింగ్ వేధింపులు పదే పదే కొనసాగినట్టు పేర్కొన్నారు.

రెండు కేసుల్లో ఆయనపై ఐపీసీ సెక్షన్ల 354, 354ఏ, 354డీ ప్రకారం ఆరోపణలు నమోదయ్యాయి. మిగిలిన కేసుల్లో ఐపీసీ సెక్షన్ల 354, 354ఏ ప్రకారం ఆరోపణలు నమోదయ్యాయి. ఈ కేసులు రుజువైతే ఆయనకు ఐదేండ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. 108 మంది సాక్షులను ప్రశ్నించినట్టు, వీరిలో 15 మంది ఈ ఆరోపణలను సమర్థించినట్టు ఢిల్లీ పోలీసులు ఈ ఛార్జిషీటులో పేర్కొన్నారు. ఈ 15 మందిలో రెజ్లర్లు, కోచ్‌లు, రిఫరీలు ఉన్నారని తెలిపారు.

ఇదిలావుండగా, ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు సింగ్‌కు శుక్రవారం సమన్లు జారీ చేసింది. ఈ నెల 18న హాజరుకావాలని ఆదేశించింది. ఆయనకు వ్యతిరేకంగా వచ్చిన ఆరోపణలకు తగిన సాక్ష్యాధారాలు ఉన్నాయని తెలిపింది. దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు వినేష్ ఫోగట్, సాక్షి మాలిక్, బజ్రంగ్ పూనియా నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా జరిగిన అనంతరం ప్రభుత్వం దిగి వచ్చింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ రెజ్లర్లతో చర్చలు జరిపి, జూన్ 15నాటికి సింగ్‌పై ఛార్జిషీట్ దాఖలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. సుప్రీంకోర్టు జోక్యంతో కేసులు నమోదు అయ్యాయి. ఇప్పుడు రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ కొనసాగుతున్నది.

ఉచిత విద్యుత్ రద్దుకు కాంగ్రెస్ కుట్రలు

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ రైతులు పడ్డ కష్టాలు..అనుభవించిన బాధలను తెలంగాణ ఎన్నటికీ మర్చిపోదు. కాలంలో కరువులు, కన్నీళ్లు, కటిక చీకట్లు, అప్పులు, ఆత్మహత్యలతో అన్నదాతలు అరిగోస పడ్డారు. ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసి మోటర్లుకు మీటర్లు పెట్టాలని రాష్ట్రం మెడపైన కేంద్రం కత్తిపెట్టినా ప్రభుత్వం లొంగిపోలేదు. 24 గంటల ఉచిత కరెంట్‌ను కాపాడుకోవడానికి ఏకంగా రూ.30వేల కోట్ల వదులుకున్నది తప్ప రైతుల ప్రయోజనాలపై రాజీపడలేదు. ఈ 24 గంటల ఉచిత విద్యుత్ వెలుగుల్ని వదులుకుందామా? కటిక కాంగ్రెస్ చీకట్ల కాలాన్ని మళ్లీ తెచ్చుకుందామా? చైతన్యవంతమైన తెలంగాణ రైతులు ఆలోచించుకోవాలి' అని మంత్రి కేటీఆర్ వివరించారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఆయన ఘాటు విమర్శలు గుప్పించారు.

కాంగ్రెస్ పార్టీ రైతుల్ని చంపుకుతినే రాబందని మరోసారి తేలిపోయిందని ఈ సందర్భంగా కేటీఆర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అవసరం లేదని కాంగ్రెస్ చేసిన ప్రకటన ఆ పార్టీ రైతు వ్యతిరేక వైఖరికి నిదర్శనమన్నారు. నిన్నటిదాకా ధరణి రద్దు.. రైతుబంధు వద్దూ అంటూ ఇప్పటికే రైతు వ్యతిరేక విధానాలను ప్రకటిస్తున్న కాంగ్రెస్, ఇప్పుడు ఏకంగా ఫ్రీ కరెంట్‌ను ఎత్తేస్తామన్న తన క్రూరమైన ఆలోచనను బయటపెట్టుకుందని తెలిపారు. ఉచిత విద్యుత్‌కు ఉరి వేసేందుకు గాంధీ భవన్ కేంద్రంగా జరుగుతున్న కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలని రైతాంగానికి పిలుపునిచ్చారు. ఆనాడు విద్యుత్ కోతలతో చాలీచాలని మూడు గంటల నాసిరకం కరెంట్‌తో రైతులు నరకం అనుభవించారని వాపోయారు. కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లతో ఎండిన పంటలు, రైతుల ధర్నాలు, సబ్ స్టేషన్లపై దాడులతో పరిస్థితులు దారుణంగా ఉండేవని, అలాంటి దుర్భరమైన పరిస్థితులు తొమ్మిదేండ్లుగా మారిపోయాయని తెలిపారు. అర్ధరాత్రి అపరాత్రి మోటర్లు పెట్టడానికి పోయి పాము కాట్లకు, కరెంట్ షాకులకు ఎంతో మంది రైతులు చనిపోయారని గుర్తుచేశారు. నాడు కాంగ్రెస్ హయాంలో ఎరువుల్ని పోలీస్ స్టేషన్లలో పెట్టి అమ్మే దుస్థితి ఉండేదని, కిలోమీటర్ల దూరం క్యూలైన్లలో చెప్పులు, లాఠీచార్జీల దశ్యాలే కాంగ్రెస్ పాలనా పాడుకాలంలో ఉండేవని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కల్తీ పాలనలో రైతులకు దొరికింది కల్తీ విత్తనాలు, కల్తీ పురుగు మందులేనని విమర్శించారు.

కేంద్రానికి ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చిన తీర్పునకు విరుద్ధమని పేర్కొంది. 2021 నవంబరు తర్వాత ఆయన పదవీ కాలాన్ని పొడిగించరాదని 2021నాటి తీర్పులో సుప్రీంకోర్టు మాండమస్ జారీ చేసిందని గుర్తుచేసింది. ఈడీ డైరెక్టర్ పదవీ కాలాన్ని పొడిగించేందుకు చట్టాన్ని చేసే అధికారం చట్టసభలకు ఉందనీ, అయితే మిశ్రా పదవీ కాలాన్ని పొడిగించరాదని 2021నాటి తీర్పు స్పష్టంగా చెప్తున్నదని ధర్మాసనం తెలిపింది. అయితే ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ చట్టాల్లో సవరణలను సుప్రీంకోర్టు సమర్థించింది. సీబీఐ చీఫ్, ఈడీ డైరెక్టర్ పదవీ కాలం రెండేండ్లు పూర్తయిన తర్వాత మరో మూడేండ్ల వరకు పొడిగించేందుకు ఈ సవరణల వల్ల కేంద్ర ప్రభుత్వానికి అధికారం లభించింది. మిశ్రా మొదట 2018 నవంబరులో ఈడీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. రెండేండ్ల పదవీ కాలం పూర్తయిన తరువాత 2020 నవంబరులో ఆయన పదవీ కాలాన్ని పొడిగించారు. 2020 మే నెలలో ఆయన వయసు 60 సంవత్సరాలు నిండింది. 2020 నవంబర్ 13న 'రెండేండ్ల' కాలాన్ని 'మూడేండ్ల' కాలానికి మార్చే విధంగా రాష్ట్రపతి 2018 ఉత్తర్వును సవరించినట్టు పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిని కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఈ సవరణను సుప్రీంకోర్టు 2021 సెప్టెంబరులో ఆమోదించింది. మిశ్రాకు మరిన్ని పొడిగింపులు ఇవ్వవద్దని రూలింగ్ ఇచ్చింది. ఈ కేసులో అమికస్ క్యూరీ అయిన సీనియర్ న్యాయవాది కెవి విశ్వనాథన్ (ఇప్పుడు సుప్రీం కోర్టు న్యాయమూర్తి) ఫిబ్రవరిలో మిశ్రా పదవీకాలం పొడిగింపు చట్టవిరుద్ధమని సమర్పించారు.

టెస్టుల్లో ఇక కొత్తగా!

టీమ్ ఇండియా టెస్టు క్రికెట్ ప్రయాణం సరికొత్తగా ఆరంభం కానుంది. వరుసగా రెండు ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత్.. 2025లోనైనా ఐసీసీ డబ్ల్యూటీసీ టైటిల్ నెగ్గే జట్టును సిద్ధం చేయాలనే సంకల్పంతో కనిపిస్తుంది. యువ క్రికెటర్లను జట్టులోకి రావటంతో ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్ విభాగాలు కాస్త కొత్తగా కనిపించనున్నాయి. భారత్, వెస్టిండీస్ తొలి టెస్టు నేటి నుంచి ఆరంభం కానుండగా.. ఐసీసీ 2025 డబ్ల్యూటీసీ వేటను భారత్ ఇక్కడి నుంచే షురూ చేయనుంది.



- 2025 డబ్ల్యూటీసీ రేసుకు సిద్ధమైన భారత్
- విండీస్‌తో తొలి టెస్టు నేటి నుంచి

రాత్రి 7.30 నుంచి డిడి స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-రాజో

2021, 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో భంగపడిన భారత్.. ఇప్పుడు మిషన్ 2025 డబ్ల్యూటీసీ దిశగా అడుగులు వేస్తోంది. గత నాలుగేండ్లలో అత్యంత నిలకడగా ఐదు రోజుల ఆటలో రాణించినా.. చివరకు రన్నరప్ ట్యాగ్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. టెస్టు క్రికెట్ అంతిమ సమరం విదేశీ గడ్డపై జరుగనుండటంతో.. ఇంగ్లీష్ పరిస్థితుల్లో రాణించగల క్రికెటర్లతో కూడిన జట్టును సిద్ధం చేసే పనిలో భారత్ నిమగ్నమైంది. అందులో తొలి అడుగు.. నేడు వెస్టిండీస్‌తో తొలి టెస్టు సవాల్. కరీబియన్లపై సిరీస్ విజయం రోహిత్‌సేనకు పెద్ద సమస్య కాదు. కానీ రానున్న రెండేండ్లలో బలమైన జట్టుకు ఇక్కడ గట్టి పునాది వేయటమే ద్రవిడ్, రోహిత్ ద్వయం ప్రణాళిక. మరోవైపు దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో చతికిల పడిన కరీబియన్లు భారత్‌తో సిరీస్‌కు జట్టు ఎంపికలో కీలక నిర్ణయాలు తీసుకుంది. దీంతో ఇటు భారత్, ఇటు వెస్టిండీస్ టెస్టు క్రికెట్లో సరికొత్త ప్రయాణానికి సిద్ధపడుతూ నేటి నుంచి తొలి టెస్టులో తలపడనున్నాయి.

యశస్వి అరంగేట్రం!

యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ టెస్టు అరంగేట్రం లాంఛనంగా కనిపిస్తుంది. వార్మప్ గేముల్లో ఓపెనర్‌గా మెరిసిన యశస్వి జైస్వాల్ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 80కి పైగా సగటుతో పరుగులు సాధించాడు. యశస్వి జైస్వాల్ ఓపెనర్‌గా వస్తాడా? నం.3 స్థానంలో బ్యాటింగ్ చేస్తాడా? అనేది తెలియాల్సి ఉంది. చతేశ్వర్ పుజారాపై వేటు పడటంతో నం.3 స్థానం లోటు పూడ్చేందుకు శుభ్‌మన్ గిల్‌ను సిద్ధం చేస్తున్నారు. కెరీర్‌లో ఎక్కువగా మిడిల్ ఆర్డర్‌లోనే ఆడిన గిల్.. టెస్టు ఫార్మాట్‌లో ఇక నుంచి



మూడో స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశం ఉంది. కెప్టెన్ రోహిత్ శర్మ పేసర్లపై బాగానే ఆడుతున్నా.. మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచటం లేదు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి కొంతకాలంగా నిరాశపరుస్తున్నాడు. అతడి టెస్టు సగటు సైతం పడిపోతుంది. అరకొర ఇన్నింగ్స్‌లతో విరాట్ కోహ్లి ఎంతోకాలం నెట్టుకురాలేడు. స్థాయికి తగ్గ ప్రదర్శనలు చేయడానికి విరాట్ కోహ్లికి ఇదే మంచి తరుణం. ఇక అజింక్య రహానె కెరీర్‌లో రెండో ఇన్నింగ్స్ ఆడుతున్నాడు. యువ జట్టును సిద్ధం చేస్తుండటంతో అతడి స్థానం ప్రశ్నార్థకమే. నిలకడగా విలువైన ఇన్నింగ్స్‌లు నమోదు చేస్తేనే.. అజింక్య రహానె జట్టులో ఉండగలడు. ఆ విషయం అతడీ తెలుసు, దీంతో కరీబియన్లతో సిరీస్ రహానెకు సైతం అత్యంత కీలకం.

ఆల్‌రౌండర్లుగా రవీంద్ర జడేజా, శార్దుల్ ఠాకూర్ తుది జట్టులో నిలువనున్నారు. ఇక్కడి పిచ్ స్పిన్‌కు అనుకూలం. దీంతో రవిచంద్రన్ అశ్విన్ రెండో స్పిన్నర్‌గా తుది జట్టులోకి రానున్నాడు. మహ్మద్ షమి లేని వేళ హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ పేస్ విభాగాన్ని ముందుండి నడిపించనున్నాడు. జైదేవ్ ఉనద్కత్, నవదీప్ సైనిలలో ఒకరు సిరాజ్, శార్దుల్‌తో కలిసి పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు.

4 వెస్టిండీస్‌తో రవిచంద్రన్ అశ్విన్ సాధించిన శతకాలు నాలుగు. ప్రస్తుత జట్టులో మరో బ్యాటర్‌కు కరీబియన్లపై శతకాల పరంగా ఈ రికార్డు లేదు. రహానె మూడు అర్థ సెంచరీలు, రెండు శతకాలు సాధించాడు.

36.59 పేస్ బౌలింగ్‌పై రోహిత్ శర్మ సగటు 36.59. 2020 నుంచి టెస్టుల్లో పేస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటున్న ఉత్తమ భారత బ్యాటర్ హిట్‌మ్యానే.

తుది జట్లు (అంచనా)

భారత్ : శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి, అజింక్య రహానె, రవీంద్ర జడేజా, కె.ఎస్ భరత్, రవిచంద్రన్ అశ్విన్, శార్దుల్ ఠాకూర్, మహ్మద్ సిరాజ్, జైదేవ్ ఉనద్కత్.

వెస్టిండీస్ : క్రెయిగ్ బ్రాత్‌వేట్, టాగెనరైన్ చందర్‌పాల్, రేమన్ రీఫర్, జెర్మైన్ బ్లాక్‌వుడ్, అలిక్ అల్తానాజె, జోషువ డ సిల్వ, జేసన్ హోల్డర్, రహీం కార్న్‌వాల్, అల్జారీ జొసెఫ్, కీమర్ రోచ్, షానన్ గాబ్రియల్.

పోటీ ఇస్తారా?

వెస్టిండీస్ జట్టు మరీ తీసికట్టుగా తయారవుతోంది. ఇటీవల 2023 వన్డే వరల్డ్‌కప్‌కు అర్హత సాధించటంలో విఫలం కాగా.. రెడ్ బాల్ ఫార్మాట్‌లో విండీస్ చాన్నాండ్ల నుంచి పేలవంగా ఆడుతున్నారు. కరీబియన్ పర్యటనలో భారత జట్టు గత నాలుగు పర్యటనల్లో టెస్టు సిరీస్‌లు సొంతం చేసుకుంది. ఇప్పుడు సిరీస్ చేజారితే.. భారత్ వరుసగా ఐదోసారి టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకోనుంది. సఫారీతో సిరీస్ అనంతరం విండీస్ జట్టులో మార్పులు చేశారు. రోస్టన్ ఛేజ్ సహా పలువురు ఆటగాళ్లపై సెలక్షన్ కమిటీ వేటు వేసింది. దీంతో భారత్‌తో సిరీస్‌కు కొందరు యువ ఆటగాళ్లు జట్టులోకి వచ్చారు. క్రెయిగ్ బ్రాత్‌వేట్, రేమన్ రీఫర్, బ్లాక్‌వుడ్, డ సిల్వ సహా జేసన్ హోల్డర్ కీలకం కానున్నారు. కీమర్ రోచ్, అల్జారీ జొసెఫ్, గాబ్రియెల్‌తో కూడిన పేస్ దళం రోహిత్‌సేనకు ఏ మేరకు సవాల్ విసరగలదో చూడాలి.

పిచ్, వాతావరణం

విండ్‌సోర్ పార్క్ గణాంకాల ప్రకారం ఇక్కడ స్పిన్‌కు మొగ్గు ఎక్కువ. స్పిన్నర్లు 23.35 సగటుతో 87 వికెట్లు పడగొట్టగా.. పేసర్లు 28.43 సగటుతో 80 వికెట్లు కూల్చారు. స్పిన్నర్ల స్ట్రయికరేట్ 48.5 కాగా, పేసర్లది 68.5గా ఉంది. బ్యాటింగ్‌కు అనువుగా ఉండే ఇక్కడ టెస్టు మ్యాచ్ సమయంలో చిరుజల్లులతో కూడిన వర్షం సూచనలు ఉన్నాయి. తుది జట్టు ఎంపికలో వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపే అవకాశం ఉంది. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునేందుకు మొగ్గు చూపవచ్చు.



సిరీస్ సొంతమాయె

- బంగ్లాపై భారత్ ఘన విజయం
- 2-0తో టీ20 సిరీస్ కైవసం

మీర్పూర్ (బంగ్లాదేశ్)

పొట్టి ఫార్మాట్‌లో టీమ్ ఇండియా అమ్మాయిలకు ఎదురు లేదు. వరుసగా రెండో టీ20లో ఆతిథ్య బంగ్లాదేశ్‌ను చిత్తుచేసిన హర్మన్‌ప్రీత్ కౌర్‌సేన.. మూడు టీ20ల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే 2-0తో సొంతం చేసుకుంది. మంగళవారం మీర్పూర్‌లో జరిగిన రెండో టీ20లో బంగ్లాదేశ్‌పై భారత్ 8 పరుగుల తేడాతో గెలుపొందింది. స్పిన్ సవాల్‌గా మారిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 95 పరుగులే చేసింది. ఓపెనర్లు స్మృతీ మంధాన (13), షెఫాలీ వర్మ (19), యస్తికా భాటియా (11), దీప్తి శర్మ (10), అమన్‌జోత్ కౌర్ (14) రెండెంకల స్కోరు సాధించారు. రొడ్రిగస్ (8), హర్మన్‌ప్రీత్ కౌర్ (0), హర్లీన్ డియోల్ (6) నిరాశపరిచారు. స్పిన్ మాయజాలంలో పరుగుల వేట గగనమైంది. 96 పరుగుల సవాల్‌తో కూడిన లక్ష్యాన్ని బంగ్లాదేశ్ ఛేదించటంలో చతికిల పడింది. 20 ఓవర్లలో కుప్పకూలిన ఆతిథ్య జట్టు 87 పరుగులే చేసింది. నిగార్ సుల్తానా (38, 55 బంతుల్లో 2 ఫోర్లు) ఛేదనలో కెప్టెన్సీ ఇన్నింగ్స్ నమోదు చేసినా.. సహచరుల నుంచి సహకారం లభించలేదు. భారత స్పిన్నర్ దీప్తి శర్మ (3/12), షెఫాలీ వర్మ (3/15) మూడు వికెట్ల మ్యాజిక్‌తో బంగ్లాదేశ్‌ను కట్టడి చేశారు. మిన్నూ మణి (2/9) రెండు వికెట్ల ప్రదర్శనతో రాణించింది. దీప్తి శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. సిరీస్‌లో నామమాత్రపు మూడో టీ20 గురువారం మీర్పూర్‌లోనే జరుగనుంది.

ఇక సెలక్షన్ కమిటీలు

స్పోర్ట్స్ స్కూల్స్, అకాడమీల ప్రవేశాలపై శాట్స్ చైర్మెన్

నవతెలంగాణ-హైదరాబాద్: క్రీడా రంగంలో ఆధునిక మార్పులను అధ్యయనం చేస్తూ పరిస్థితులకు అనుగుణంగా అన్వయించుకోవాలని, ఇక నుంచి రాష్ట్రంలోని క్రీడా పాఠశాలలు, స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాలపై ఉన్నతస్థాయి సెలక్షన్ కమిటీలు ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు. స్పోర్ట్స్ స్కూల్స్, అకాడమీల పని తీరు, మెరుగుదలపై వరుసగా రెండో రోజు సమీక్ష సమావేశం నిర్వహించిన శాట్స్ చైర్మెన్.. అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. 'క్రీడా పాఠశాలలు, అకాడమీల పురోగతికి నిరంతర పర్యవేక్షణ అవసరం. స్పోర్ట్స్ స్కూల్స్ పతక విజేతల ప్రాంగణాలుగా రూపుదిద్దుకోవాలి. శిక్షణ, పనితీరులో మూస ధోరణి వీడనాడాలి. అంతర్జాతీయ స్థాయిలో ఆధునిక మార్పులను అధ్యయనం చేస్తూ మన పరిస్థితులకు అనుగుణంగా అన్వయించుకోవాలి. స్కూల్స్, అకాడమీలకు ఎంపికపై నిపుణులతో కూడిన సెలక్షన్ కమిటీ అవసరం. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. స్టూడెంట్ అథ్లెట్లకు రెగ్యులర్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలి. అకాడమీలలో అవసరమైన క్రీడా సామాగ్రి అందుబాటులో ఉంచాలి. కోచ్‌లు, కిట్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలి' అని ఆంజనేయ గౌడ్ అన్నారు.

ఎల్బీ స్టేడియంలో శాట్స్ చైర్మెన్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఓఎస్‌డి డాక్టర్ కె. లక్ష్మీ, డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి సహా స్పోర్ట్స్ స్కూల్స్, అకాడమీల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



28 నుంచి ప్రొ పంజా లీగ్

బరిలో కిరాక్ హైదరాబాద్ జట్టు



హైదరాబాద్ : భారత క్రీడా విపణిలో మరో స్పోర్ట్స్ లీగ్ వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత పాపులర్ గేమ్ 'ఆర్మ్ రెజ్లింగ్'ను ప్రధాన స్రవంతి క్రీడల్లోకి తీసుకురానున్నారు. పవన్ కళ్యాణ్ నటించిన తమ్ముడు సినిమా ఫేమ్ ప్రీతి జింగానియా 'ప్రొ పంజా లీగ్' సహ వ్యవస్థాపకురాలు. న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆటగాళ్ల డ్రాఫ్ట్ పూర్తి కాగా కిరాక్ హైదరాబాద్ 30 మందితో కూడిన జట్టును ప్రకటించింది. తెలంగాణ ఆర్మ్ రెజ్లర్ అహ్మద్ ఫైజాన్ అలీ తొలి సీజన్లో కిరాక్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడని జట్టు యజమాని గౌతమ్ రెడ్డి అన్నారు. జులై 28 నుంచి ఆగస్టు 13 వరకు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ప్రొ పంజా లీగ్ నిర్వహించనున్నారు.



సుశాంత్, కీర్తి సురేష్, చిరంజీవి, తమన్నా

అన్ని వేడుకలకు జజ్జనక.. పాటే ఫస్ట్ ఛాయిస్

చిరంజీవి లేటెస్ట్‌గా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. ఈ సినిమా కోసం ఓ పాట చిత్రీకరణ జరుగుతుండగా ఒక వీడియోను చిరంజీవి లీక్ చేసిన సంగతి విదితమే. ఆ పాట మేకింగ్‌లోని గ్రాండ్‌నెస్ చూసి అభిమానులు చాలా థ్రిల్ అయ్యారు. దర్శకుడు మెహర్ రమేష్ ప్రతి విషయంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకుంటుంటే, నిర్మాత రామబ్రహ్మం సుంకర భారీ కాన్వాస్‌లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మంగళవారం మేకర్స్ ఆ వీడియోలో లీక్ అయిన పాట 'జామ్ జామ్ జజ్జనక'ను విడుదల చేశారు. ఇది 'భోళా శంకర్' గ్రాండ్ సెలబ్రేషన్ సాంగ్. మహతి స్వర సాగర్ పార్టీ, సెలబ్రేషన్ వైబ్‌లను కలిగి ఉన్న ఈ పాటని అత్యద్భుతంగా స్వరపరిచారు. అనురాగ్ కులకర్ణి, మంగ్లీ అద్భుతంగా ఆలపించారు. కాసర్ల శ్యామ్ మాస్‌ని ఆకట్టుకునే లిరిక్స్ అందించారు. మధ్యలో పాపులర్ ఫోక్ నెంబర్ నర్సపల్లెని మిక్స్ చేయడంతో పార్టీ వైబ్ మరొక స్థాయికి వెళ్ళింది. చిరంజీవి డాన్స్ మూమెంట్స్ మెస్మరైజింగ్‌గా ఉన్నాయి. పాటలో లైవ్లీగా కనిపించారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించిన ఈ పాటలో చిరంజీవితో పాటు తమన్నా, కీర్తి సురేష్, సుశాంత్ మెరవబోతున్నారు. సంగీత్, ఇతర వేడుకలకు ఈ పాట ఫస్ట్ ఛాయిస్‌గా నిలవడం ఖాయం. ఆగస్టు 11న ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

ఈ చిత్రానికి డీవోపీ: డడ్లీ, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, కథా పర్యవేక్షణ: సత్యానంద్, డైలాగ్స్: తిరుపతి మామిడాల, ఫైట్ మాస్టర్స్: రామ్-లక్ష్మణ్, దిలీప్ సుబ్బరాయన్, కాచే కంపాక్డీ, కొరియోగ్రఫీ: శేఖర్ మాస్టర్, లిరిక్స్: రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్, శ్రీమణి, సిరాశ్రీ.

నవచిత్రం

సోషల్ టీజర్ ఇంగ్లీష్ చెప్పాల్సి వస్తే?



దివ్య శ్రీపాద, సాయిధరమ్ తేజ్, హర్ష

హర్ష చెముడు, దివ్య శ్రీపాద ప్రధాన తారాగణంగా ఆర్.టి.టీమ్ వర్క్స్, గోల్డెన్ మీడియా బ్యానర్స్‌పై కళ్యాణ్ సంతోష్ దర్శకత్వంలో రవితేజ, సుధీర్ కుమార్ కుర్రు నిర్మాతలుగా రూపొందుతున్న చిత్రం 'సుందరం మాస్టార్'. సుందరం అనే టీచర్ చుట్టూ నడిచే కథే ఇది. సోషల్ స్టడీస్ చెప్పే ఓ గవర్నమెంట్ టీజర్ ఇంగ్లీష్ చెప్పాల్సి వస్తే ఏం జరిగింది అనేదే ఈ సినిమా. ఈ సినిమా టీజర్‌ను హీరో సాయితేజ్ విడుదల చేశారు.

వైజాగ్‌లో జరిగిన ఈ టీజర్ విడుదల కార్యక్రమంలో హీరో సాయితేజ్ మాట్లాడుతూ, 'సుందరం మాస్టర్ టీజర్ రిలీజ్ చేయటానికి ఐదు కారణాలు, అక్షర, రమ, రావు మొదటి మూడు కారణాలు. హర్ష వాళ్లబ్బాయే. తను బాగా నటిస్తాడు. ఇక నాలుగో కారణం.. నా ఫేవరెట్ హీరో రవితేజ. ఐదో కారణం.. ప్రేక్షకుల ప్రేమను పొందడానికే వచ్చాను. మంచి కాన్సెప్ట్‌తో తీసిన సినిమా ఇది. అందర్నీ కచ్చితంగా మెప్పిస్తుంది' అని తెలిపారు. 'నేను ఈ స్థాయికి రావడానికి కారణమైన అందరికీ థ్యాంక్స్. నాకు ఇది చాలా ఎమోషనల్ మూమెంట్' అని హర్ష చెప్పారు. దర్శకుడు కళ్యాణ్ సంతోష్ మాట్లాడుతూ, 'ఓ మంచి కథని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నాం. నిర్మాతల సహకారం అద్భుతం' అని తెలిపారు.

వినాయక చవితి కానుకగా రిలీజ్

హీరో విశాల్ 'మార్క్ ఆంటోనీ'గా మరో యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో హై వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో విశాల్‌కి జోడీగా రీతూ వర్మ నటిస్తోంది. ఎస్.జె.సూర్య, సునీల్, సెల్వ రాఘవన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఎస్.వినోద్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చివరి దశ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని వినాయక చవితి పండుగను పురస్కరించుకుని సెప్టెంబర్ 15న చిత్రం విడుదల చేస్తున్నట్టు మేకర్స్ అఫిషియల్‌గా రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో మెయిన్ లీడ్స్ అందరూ సరికొత్త రెట్రో లుక్ తో కనిపించి సినిమాపై ఆసక్తి పెంచేశారు. అలాగే ఇటీవల రిలీజైన టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. విశాల్ ఇందులో సరికొత్తగా కనిపించారు. గుబురు గడ్డంతో ఫైర్ చేస్తున్న విశాల్ లుక్, ఎస్.జె.సూర్య కామెడీ టైమింగ్ ఈ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. మార్క్ ఆంటోనీ టైమ్ ట్రావెల్ థీమ్ చుట్టూ తిరిగే కథ. భారీ యాక్షన్ సన్నివేశాలు, సైన్స్ ఫిక్షన్ అంశాలతో పాటు ఎస్.జె.సూర్య కామెడీ టైమింగ్‌తో ఈ చిత్రం ఆద్యంతం అందరినీ అలరించనుంది అని చిత్ర బృందం తెలిపింది.

ఈ చిత్రానికి రచయిత, దర్శకుడు: అధిక్ రవిచంద్రన్, నిర్మాత: ఎస్.వినోద్ కుమార్, సంగీతం: జి.వి.ప్రకాష్ కుమార్, ఫైట్స్: పీటర్ హెయిన్స్, దిలీప్ సుబ్బరాయన్, కనల్ కణ్ణన్, దినేష్ సుబ్బరాయన్, డి.ఓ.పి: అభినందన్ రామానుజం, ఎడిటర్: విజయ్ వేలుకుట్టి.



విశాల్

తెలుగులోనూ విజయం ఖాయం..

కన్నడలో సంచలన విజయం సాధించిన చిత్రం 'తారకాసుర'. ఈ చిత్రం అదే పేరుతో తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. శ్రీజా మూవీస్ పతాకంపై విజయ్ భాస్కర్ రెడ్డి పాళ్యం ఈ చిత్రాన్ని తెలుగులో అందిస్తున్నారు. రవికిరణ్, మాన్విత హరీష్ జంటగా నటించిన ఈ చిత్రంలో హాలీవుడ్ నటుడు డేని సపని ముఖ్యపాత్ర పోషించడం విశేషం. 'పద్మశ్రీ' ఫేమ్ చక్రవర్తి, తృప్తి శుక్లా సెకండ్ హీరో, హీరోయిన్లుగా, శాంసన్ యోహాన్ విలన్‌గా నటించిన ఈ చిత్రానికి చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వం వహించారు. ఈ చిత్రం త్వరలో తెలుగులో రానున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దర్శకులు నగేష్ నారదాసి, నిర్మాతలు టి.రామ సత్యనారాయణ, సాయివెంకట్, పద్మిని ముఖ్య అతిథులుగా హాజరై, కన్నడలో ఘన విజయం సాధించిన ఈ చిత్రం తెలుగులోనూ సంచలనం సృష్టించాలని ఆకాంక్షించారు. శ్రీజా మూవీస్ అధినేత విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ,'తెలుగులో ఈ చిత్రానికి కొన్ని మార్పులు, చేర్పులు చేస్తున్నాం. దీని కోసం రీ షూట్ కూడా చేస్తున్నాం. అవుట్ చాలా బాగా వస్తోంది. మా బ్యానర్ నుంచి త్వరలో ఒక స్ట్రయిట్ సినిమా కూడా ప్లాన్ చేస్తున్నాం. త్వరలోనే దాని గురించి తెలియజేస్తాం' అని చెప్పారు.



తృప్తి శుక్లా

అభినందనీయ ప్రయత్నం



కరుణకుమార్, లక్షిన్

ఎల్.వి ప్రొడక్షన్ బ్యానర్‌లో లక్షిన్ దర్శకత్వం వహించిన షార్ట్ ఫిలిం 'ధ్వని'. డెఫ్ అండ్ డంప్ కాన్సెప్ట్‌తో ఈ షార్ట్ ఫిల్మ్‌ను నీలిమ వేముల నిర్మించారు. అశ్విన్ కురమన సంగీతం అందించారు. ఈ షార్ట్ ఫిల్మ్ రిలీజ్ నిర్మాత బెల్లంకొండ సురేష్ చేతుల మీదుగా జరిగింది. ఈ వేడుకలో లక్షిన్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్‌ని అందజేశారు. పది ఏళ్ల లక్షిన్ ఇరవై ఏళ్లలోపు ఇరవై ఫిలిమ్స్ చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. 'నేను ఈ షార్ట్ ఫిల్మ్ చేయటానికి ఎంకరేజ్ చేసిన పేరెంట్స్‌కు థ్యాంక్స్. చిన్న కాన్సెప్ట్‌తో తీసిన ఈ దీనికి అందరి నుండి మంచి రెస్పాన్స్ లభిస్తోంది' అని అన్నారు. 'ధ్వని అనే డిఫరెంట్ కాన్సెప్ట్‌తో పదకొండు నిమిషాల్లో ఈ షార్ట్ ఫిల్మ్‌ని లక్షిన్ చాలా బాగా తీశాడు' అని నిర్మాత నీలిమ వేముల చెప్పారు.

మన జీవితంలో జరిగినట్టే అనిపిస్తుంది

ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య, విరాజ్ అశ్విన్ నటించిన చిత్రం 'బేబీ'. మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని ఎస్‌కెఎన్ నిర్మించారు. సాయి రాజేష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈనెల 14న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ వైష్ణవి చైతన్య మీడియాతో ముచ్చటించారు. 'యూట్యూబర్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, సోషల్ మీడియా ఇంఫ్లూయెన్సర్‌గా నేను అందరికీ సుపరిచితురాలినే. ఇది హీరోయిన్‌గా నా మొదటి సినిమా. కథ విని షాక్ అయ్యాను. ఇందులోని పాత్రను పోషిస్తానా? లేదా? అని నా మీద నాకు నమ్మకం లేనప్పుడు దర్శకుడు సాయి రాజేష్ నన్ను నమ్మారు. ఇందులో నాది ఓ బస్తీలో పెరిగే ఓ అమాయకురాలైన అమ్మాయి. బస్తీ నుంచి బయటకు వచ్చిన ఆ అమ్మాయి జీవితం ఎలా మలుపు తిరిగింది? అనేది కథ. ఆ జీవితం నుంచి ఏం నేర్చుకుంటుంది? చిన్నప్పటి నుంచే ఓ అబ్బాయితో ప్రేమలో ఉంటుంది. కాలేజ్‌కు వచ్చాక మరో అబ్బాయి లైఫ్‌లోకి వస్తాడు. ఆ తరువాత ఆ అమ్మాయి జీవితం ఎలా ప్రభావితం అయింది అనేది చక్కగా చూపించారు. ఇది మ్యూజిక్ ఓరియెంటెడ్ సినిమా. ఈ కథ విన్నప్పుడు నా జీవితమే గుర్తుకు వచ్చింది. రియల్ లైఫ్‌లోంచి తీసుకున్న కథ. ఇలాంటి పాత్ర వచ్చినందుకు ఎంతో గర్వపడుతుంటాను. అమ్మాయి కోణంలోంచి ఈ కథ నడుస్తుంటుంది. సినిమా చూస్తే ఇది మన జీవితంలో జరిగినట్టే అనిపిస్తుంది. తొలిప్రేమ అనేది జీవితంలో ఎప్పటికీ ఓ అందంగా, అద్భుతంగా ఉంటుంది. ఎప్పటికీ జీవితంలో మధురానుభూతిలా మిగిలిపోతుంది. ఈ సినిమాతోనూ అదే చెప్పబోతోన్నాం. విజయ్ బుల్గానిన్ మ్యూజిక్ ఈ సినిమాకు బెస్ట్ గిఫ్ట్. నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలే చేసేందుకు ఇష్టపడతాను. గ్లామర్ రోల్స్ కంటే.. పర్ఫామెన్స్ ఓరియెంటెడ్ సినిమాలే చేస్తాను. ఎస్‌కేఎన్ పర్ఫెక్ట్ నిర్మాత. సాయి రాజేష్‌ని నమ్మి ఈ సినిమాకు అండగా నిలబడ్డారు' అని వైష్ణవి చైతన్య అన్నారు.



వైష్ణవి చైతన్య

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

భారత్‌లో తగ్గిన పేదరికం

15 ఏండ్లలో 41.5 కోట్ల మంది దారిద్ర్యం నుండి బయటపడ్డారు • ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడి • గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫలితమే : నిపుణులు

న్యూయార్క్ : భారతదేశంలో పేదరికం గణనీయంగా తగ్గిందని ఐక్యరాజ్య సమితి నివేదిక పేర్కొంది. 15 ఏండ్ల కాలంలో మొత్తంగా 41.5 కోట్ల మంది దారిద్ర్యం నుంచి బయటపడ్డారని తెలిపింది. ప్రపంచంలోనే అధిక జనాభా కలిగిన దేశం 2005-2006 నుండి 2019-2021 మధ్య కాలంలో ఈ విషయంలో గణనీయమైన పురోగతి సాధించిందని ఆ నివేదిక పేర్కొంది. మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం వల్లే పేదరికం తగ్గుముఖం పట్టడానికి ప్రధానకారణమని గ్రామీణాభివృద్ధి రంగ నిపుణులు విశ్లేషించారు. 2006లో ప్రారంభమైన ఈ పథకం పూర్తిస్థాయిల్లో అమల్లోకి వచ్చిన నాటి నుంచే పేదరికం తగ్గుముఖం పడుతూ వచ్చిందని పేర్కొంటున్నారు. ఇటువంటి విశిష్టమైన ఈ పథకంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష కట్టినట్టు నిర్వీర్యం చేస్తోందని, ఐక్యరాజ్యసమితి నివేదిక చూసైనా మోడీ సర్కార్ కండ్లు తెరవాలని వారు పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని మరింత పటిష్టంగా అమల్జేయడంతో పాటు పట్టణాలకు కూడా విస్తరింపజేయాలని డిమాండ్ చేశారు.

ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ), ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ (ఓపీహెచ్‌ఐ)లు ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో అంతర్జాతీయ బహుముఖ దారిద్ర్య సూచిక (ఎంపీఐ)ను విడుదల చేశాయి. భారత్‌తో సహా 25 దేశాలు 15 ఏండ్ల కాలంలో తమ అంతర్జాతీయ ఎంపీఐ విలువలను విజయవంతంగా సగానికి సగం తగ్గించాయని నివేదిక పేర్కొంది. కంబోడియా, చైనా, కాంగో, హోండూరస్, భారత్, ఇండోనేషియా, మొరాకో, సెర్బియా, వియత్నాం ఈ జాబితాలో వున్నాయి. 142.86 కోట్ల జనాభాతో భారత్ ఏప్రిల్‌లో చైనాను అధిగమించి అధిక జనాభా కలిగిన దేశంగా మారింది. 2005-06లో 55.1 శాతంగా వున్న దారిద్ర్యం 2019-21 నాటికి 16.4 శాతానికి తగ్గింది. పేదరికాన్ని నిర్మూలించడమన్నది సాధించవచ్చని ఈ నివేదిక తెలియచేస్తోంది. అయితే, కోవిడ్ సమయంలో సమగ్ర డేటా కొరవడడంతో తక్షణావకాశాలను అంచనా వేయడంలో సవాళ్లు ఎదుయ్యాయని ఆ నివేదిక పేర్కొంది.



2005-06లో దాదాపు 64.5 కోట్ల మంది ప్రజలు బహుముఖ దారిద్ర్యంలో వున్నారని కానీ 2015-16 నాటికి ఈ సంఖ్య 37 కోట్లకు తగ్గిందని, 2019-21 నాటికి 23 కోట్లకు తగ్గిందని నివేదిక పేర్కొంది. పేద రాష్ట్రాలు, గ్రూపులు చాలా వేగవంతమైన పురోగతిని సాధించాయని తెలిపింది. పేదరికాన్ని అంచనా వేసేందుకు ఉపయోగించిన పలు సూచీలు ఈ కాలంలో క్షీణతను నమోదు చేశాయి. భారత్‌లో పోషకాహార లోపం 2005-06లో 44.3 శాతంగా వుండగా, 2019-21లో 11.8 శాతానికి తగ్గింది. అలాగే పిల్లల మరణాలు కూడా 4.5 శాతం నుండి 1.5 శాతానికి తగ్గాయని తెలిపింది. అలాగే వంట ఇంధనం కొరతను ఎదుర్కొనే వారి సంఖ్య 52.9 శాతం నుండి 13.9 శాతానికి తగ్గగా, పారిశుధ్య సమస్యను ఎదుర్కొనే వారి సంఖ్య కూడా 50.4 శాతం నుండి 11.3 శాతానికి పడిపోయింది. ఇక ఇదే కాలంలో తాగునీటి సూచికకు సంబంధించి చూసినట్లైతే 16.4 శాతం నుంచి 2.7 శాతానికి తగ్గింది. విద్యుత్ సూచీ 29 నుండి 2.1 శాతానికి క్షీణించగా, గృహ నిర్మాణ సూచీ కూడా 44.9 శాతం నుండి 13.6 శాతానికి తగ్గింది.

దుర్బర దారిద్ర్యంలో 110 కోట్ల మంది

110 దేశాల్లో 610 కోట్ల మందిలో 110 కోట్ల మంది దుర్బర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారని నివేదిక వెల్లడించింది. సబ్ సహారా ఆఫ్రికా, దక్షిణాసియాల్లో అయితే ప్రతి ఆరుగురిలో ఐదుగురు పేదరికంలో మగ్గుతున్నారని తెలిపింది. పేదల్లో దాదాపు మూడింట రెండు వంతుల మంది (73కోట్ల మంది) మధ్యాదాయ దేశాల్లో జీవిస్తున్నారు. ఈ దేశాల్లో చర్యలు తీసుకోవడం అంతర్జాతీయంగా దారిద్ర్యాన్ని తగ్గించడానికి కీలకం. తక్కువ ఆదాయం కలిగిన దేశాలు మొత్తం జనాభాలో కేవలం 10 శాతమే వున్నప్పటికీ అక్కడ 35 శాతం మంది పేదలు నివసిస్తున్నారు. 18 ఏండ్లలోపు పిల్లల్లో దారిద్ర్యం రేటు 27.7 శాతంగా వుంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం వేధిస్తోంది. పేదల్లో 84 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే జీవిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పట్టణ ప్రాంతాల కన్నా గ్రామీణ ప్రాంతాలే దారిద్ర్యంలో మగ్గుతున్నాయి

బిల్డర్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లోని బిల్డర్లకు మంత్రి కేటీఆర్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ హైదరాబాద్ అభివృద్ధి కోసం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు పెట్టామని చెబుతున్నారనీ, ఎక్కడ అభివృద్ధి జరిగిందని ప్రశ్నించారు. రెండు సెంటిమీటర్ల చిన్న వర్షానికే నాలాలు నిండి రోడ్లపైకి, ఇండ్లలోకి నీరు వస్తున్నాయన్నారు. నగరంలో 20 లక్షల మందికి కూడా తాగు నీరు అందట్లేదని విమర్శించారు. రాష్ట్రంలో కల్వకుంట్ల ట్యాక్స్‌కే 30 శాతం నిధులు పోతున్నాయని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లోని చిన్న నగరాలు, తక్కువ జనసాంద్రత ఉన్న చోట్ల అధిక బడ్జెట్ కేటాయిస్తున్నారనీ, ఎక్కువ జనసాంద్రత కలిగిన హైదరాబాద్ బడ్జెట్ చాలా తక్కువని చెప్పారు. మెహిదీపట్నం నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు మెట్రో ఏమైందని ప్రశ్నించారు. యాదాద్రి వరకు ఎమ్‌ఎమ్‌టీఎస్ పొడిగిస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. వ్యాపార లావాదేవీలు తప్ప వారికి హైదరాబాద్ అభివృద్ధి పట్టదని విమర్శించారు. ఎన్నికలొస్తేనే హడావిడి చేస్తారనీ, ఆ తర్వాత పూర్తిగా మర్చిపోతారని చెప్పారు. డబుల్ ఇండ్లు, మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర సర్కారు విఫలమైందని విమర్శించారు.

కల్లు ఘటం సాక బహుజన సాంస్కృతిక వైభవం

• గీత కార్పొరేషన్ చైర్మెన్ పల్లే రవికుమార్



నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవానికి ప్రతీక బోనాల ఉత్సవమనీ, అందులో కల్లు ఘటం సాక బహుజన సాంస్కృతిక వైభవమని రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మెన్ పల్లె రవి కుమార్ అన్నారు. మంగళవారం గోల్కొండ కోటలో గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన కల్లు ఘటం సాక కార్యక్రమం గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, కార్య నిర్వాహక అధ్యక్షులు బబ్బురి బిక్షపతి గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. 365 సంవత్సరాల క్రితం సామాన్య కల్లుగీత కుటుంబంలో జన్మించిన సర్దార్ సర్వాయి పాపన్న గోల్కొండ కోటలో కల్లు ఘటం సాక ఏర్పాటు చేసి ఎల్లమ్మకు గుడి కట్టి, సబ్బండ వర్గాల కు సహపంక్తి బోజనలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఆ గొప్ప సంస్కృతితోపాటు ఆయన వారసత్వాన్ని, స్ఫూర్తిగా తీసుకునొ కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత పదేండ్ల నుంచి గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కమిటీ పర్యవేక్షణలో జరుగుతున్న తీరు అబినందనీయమని అన్నారు, ఈ కార్యక్రమంలో బీసీ కమీషన్ సభ్యులు కిషోర్ గౌడ్ , గౌడ సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగోని బాలరాజు గౌడ్, పల్లే లక్ష్మణ్ గౌడ్ , అయిలి వెంకన్న, పొన్నం నారాయణ గౌడ్ , బింగి ఇందిరమ్మ , వేములయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు

కర్నాటకలో 'అన్నభాగ్య'కు నగదు బదిలీ

• కేంద్రం సహాయ నిరాకరణ ఫలితం

బెంగళూరు : నరేంద్ర మోడీ ప్రభుత్వ సహాయ నిరాకరణ నేపథ్యంలో అన్నభాగ్య పథకం అమలు కోసం కర్నాటక ప్రభుత్వం ప్రత్యక్ష నగదు బదిలీని (డీబీటీ) ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా ప్రతి లబ్దిదారుడికి బియ్యానికి బదులు నెలకు రూ.170 అతని ఖాతాలో జమ చేస్తారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం, గోధుమల అమ్మకాలను కేంద్రం నిలిపివేయడంతో సిద్ధరామయ్య ప్రభుత్వం ఈ ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసింది. ప్రతి లబ్దిదారుడికీ కేంద్రం అందించే ఐదు కిలోల బియ్యానికి అదనంగా తాను మరో ఐదు కిలోలు అందిస్తానని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఎఫ్‌సీఐ ద్వారా రాష్ట్రాలకు బియ్యాన్ని విక్రయించేందుకు తొలుత అంగీకరించిన మోడీ ప్రభుత్వం, ఆ తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకుంది. దీంతో కర్నాటక ప్రభుత్వం విధిలేని పరిస్థితుల్లో బియ్యానికి బదులు నగదు బదిలీకి శ్రీకారం చుట్టింది. కేంద్రం పేదల వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని, రాష్ట్రానికి బియ్యం అమ్మకాన్ని ఆపేసిందని సిద్ధరామయ్య మండిపడ్డారు. కర్నాటకకు అదనపు బియ్యాన్ని ఇచ్చేందుకు నిరాకరించి, ఈ-వేలం ద్వారా విక్రయిస్తోందని ఆయన విమర్శించారు. అయితే ఆ బియ్యాన్ని ఎవరూ కొనడం లేదని చెప్పారు. ఇది నీచ రాజకీయం కాదా అని ప్రశ్నించారు. బహిరంగ మార్కెట్‌లో అమ్మకం పథకం కింద బియ్యం విక్రయంపై కేంద్రం సహేతుకం కాని ఆంక్షలు విధిస్తోందని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ చెప్పారు.

టీచర్ల పదోన్నతులు, నియామకాల ప్రక్రియ

• ప్రారంభించాలి : యూఎస్‌పీసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయుల బదిలీలపై హైకోర్టులో వివాదం ఇప్పట్లో పరిష్కారమయ్యే అవకాశాలు లేనందున, పదోన్నతులు, నియామకాల ప్రక్రియను ప్రారంభించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) స్టీరింగ్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కె జంగయ్య, చావ రవి, వై అశోక్ కుమార్, పి నాగిరెడ్డి, ఎం సోమయ్య, టి లింగారెడ్డి, యు పోచయ్య, డి సైదులు, షౌకత్ అలీ, పిట్ల రాజయ్య, కొమ్ము రమేష్, ఎన్ యాదగిరి, ఎస్ హరికృష్ణ, వి శ్రీనునాయక్, కె భిక్షపతి, వై విజయకుమార్, బి కొండయ్య, ఎస్ మహేష్, జాడి రాజన్న, మేడి చరణ్ దాస్, జాదవ్ వెంకట్రావు, డి రాజనర్సు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేలాది ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఏండ్ల తరబడి ఖాళీగా ఉండటంతో సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. వేసవికి ముందే పూర్తి కావాల్సిన బదిలీలు కోర్టు స్టే కారణంగా నిలిచిపోయాయనీ, విద్యా సంవత్సరం ప్రారంభమైనా బదిలీల వివాదం పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. కాబట్టి విద్యార్థుల ప్రయోజనం దృష్ట్యా హైకోర్టు తుది తీర్పునకు లోబడి తాత్కాలికంగా పదోన్నతులు, తద్వారా ఏర్పడిన ఖాళీల్లో నూతన ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వ్యవసాయంపై రేవంత్ రెడ్డికి అవగాహన ఉందా?

• ఆయన వ్యాఖ్యలతో కాంగ్రెస్ నిజస్వరూపం బహిర్గతం • చంద్రబాబు వారసుడని నిరూపించుకున్న రేవంత్

• కాంగ్రెస్ కు ఓటేస్తే ...ప్రజలకు పాము, తేలు కాట్లే గతి : మంత్రి జగదీశ్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఒక ఎకరానికి నీరు పారాలంటే గంట కరెంట్ ఇస్తే చాలంటున్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డికి వ్యవసాయంపై అవగాహన ఉందా? అని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్ లోని బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రేవంత్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపం బహిర్గతమైందనీ, ఆయన చంద్రబాబు వారసుడని మరోసారి నిరూపించుకున్నారని విమర్శించారు. చంద్రబాబు ఏపీకి వెళ్లినా... ఆయన నీడలు, జాడలు ఇంకా ఇక్కడే ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఇక కాంగ్రెస్ కు ఓటేస్తే ప్రజలకు పాము, తేలు కాట్లే మిగులుతాయని తెలిపారు.

'2004 నాటి పరిస్థితులను 20 యేండ్ల తర్వాత గుర్తుకు తెచ్చుకోవాల్సిన దౌర్భాగ్యం ఏర్పడింది. నాడు చంద్రబాబు ఉచిత విద్యుత్‌పై ఏం మాట్లాడారో నేడు రేవంత్ అదే మాట్లాడారు. ఉచిత విద్యుత్ పై రేవంత్ మాట్లాడిన మాటలు రైతులకు పిడుగుపాటు లాంటివే. రైతాంగం అన్ని బాధల నుంచి శాశ్వత విముక్తి పొందింది అనుకుంటున్న తరుణంలో రేవంత్ రూపంలో కొత్త భాద వచ్చిపడింది. గతంలో కాంగ్రెస్ ఏడు గంటలపాటు కూడా రైతులకు కరెంటు ఇవ్వలేక పోయింది. రైతుకు మొదటి శత్రువు ఆ పార్టీయే. రాష్ట్ర రైతాంగం కూడా రేవంత్ వ్యాఖ్యలపై ఆలోచించుకోవాలి. ఇక కాంగ్రెస్ జెండా పట్టుకున్న రైతులు ఆలోచించుకోవాలి. గతంలో కాంగ్రెస్ ఆరు గంటలు కరెంటు ఇస్తే రేవంత్ తదితర టీడీపీ నేతలే కదా ధర్నాలు చేసింది. ...' అని మంత్రి విమర్శించారు.

రేవంత్ రెడ్డి ఇంట్లో 24 గంటల కరెంటు ఉండాలే...కానీ రైతులకు 24 గంటలు ఇవ్వొద్దా అంటూ జగదీశ్ రెడ్డి ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులంటే కాంగ్రెస్ పార్టీకి చిన్నచూపని విమర్శించారు. ఎప్పుడంటే అప్పుడు కరెంట్ ఆన్ చేసుకునే సౌకర్యం రైతుకుండాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించారని గుర్తుచేశారు. రేవంత్ వ్యాఖ్యలు వ్యక్తిగతం కాదనీ, ఆయన టీపీసీసీ అధ్యక్షునిగా చేశారనీ, ఇక కాంగ్రెస్ ప్రజల నుంచి తప్పించుకోలేదని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ రాష్ట్రానికి వచ్చి మూడు గంటల పాటే కరెంట్ సరఫరా చేస్తామని చెప్పినా ఆశ్చర్యపోయేదేమీ లేదన్నారు. కాంగ్రెస్ అంటేనే రద్దుల పార్టీ అని, ఉచిత విద్యుత్‌ను రేవంత్, యాదాద్రి ప్లాంటును ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి రద్దు చేస్తామంటున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ నేతలు ఏ పార్టీతో టచ్‌లో లేరనీ, ప్రజలంతా కేసీఆర్‌తోనే టచ్‌లో ఉన్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు

యూనిఫాం సివిల్ కోడ్‌పై వెనక్కిపోం

• దక్షిణాదిలో విస్తరిస్తాం : ఎంపీ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యూనిఫాం సివిల్‌కోడ్‌పై కేంద్ర ప్రభుత్వం వెనక్కిపోదని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరణకు యాక్షన్ ప్లాన్ తయారుచేసుకున్నామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ ఆఫీస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అవినీతిలో కూరుకుపోవటంతోనే ప్రధాని మోడీ సభలకు కేసీఆర్ మొహం చాటేస్తున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ఈ 30శాతం కమీషన్ ప్రభుత్వాన్ని ప్రజలు తరిమి కొడతారన్నారు. కేసీఆర్ అవినీతి పై దర్యాప్తు సంస్థలు వాటి పని అవి చేసుకుంటూ వెళ్తాయని చెప్పారు. కాంగ్రెస్ పట్ల ఉన్న భ్రమలు ప్రజలకు తొలగిపోయాయన్నారు. మోడీ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి చెప్పేందుకు మేధావులను కలుస్తామన్నారు. జూలై 15 నుంచి 31 వరకు 30 వేల మందిని వ్యక్తిగతంగా కలిసి బీజేపీ పట్ల విశ్వాసం కల్పిస్తామని చెప్పారు. పతి నెలా టిఫిన్ బైటక్ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రంలోని 31 ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల మీద ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ బీఆర్ఎస్ మైత్రి బంధాన్ని బయట పెడతామన్నారు. కాంగ్రెస్ దూతగా కేసీఆర్‌ను అఖిలేష్ యాదవ్ కలిశారని విమర్శించారు. కొత్త ఓటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రతి 10రోజులకి ఒక్కసారి ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారురాజస్తాన్‌లో నాలుగేండ్లనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ అమలు చేయలేదని విమర్శించారు. 24 గంటల ఉచిత కరెంట్ పై చర్చించి మేనిఫెస్టో లో చేరుస్తామన్నారు.

26న ప్రధాని వీడియోకాన్ఫరెన్స్

• ఎన్‌హెచ్‌లు, హర్‌ఘర్‌జల్ తదితనాలపై సమీక్ష ఎన్నికల ప్రచారానికే

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి -హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టుల అమలుతీరు తెన్నులపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈనెల 26న వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమాచారం అందించింది. దీంతో అధికార యంత్రాంగం సన్నాహాలు ఇప్పటికే ప్రారంభించింది. ఆయా శాఖలకు సంబంధించి సమాచారం తెప్పించుకోవాలని ప్రధాన కార్యదర్శి కార్యాలయం ప్రభుత్వ కార్యదర్శులు, హెచ్‌వోడీలకు తెలియజేశారు.దాదాపు మూడు గంటలపాటు ప్రధాని వీడియోకాన్ఫరెన్స్‌లో ఉంటారని తెలిసింది. రాష్ట్రానికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో మాట్లాడనున్నారు. రాష్ట్రంలో అమలవుతున్న మిషన్ భగీరథ ప్రాజెక్టును ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా హర్‌ఘర్‌జల్ పథకాన్ని చేపట్టిన విషయం విదితమే. దాదాపు 16 రాష్ట్రాలకు మిషన్ భగీరథ డీపీఆర్లను పంపి, ఆ తరహా ప్రాజెక్టులను చేపట్టాలని 2019లోనే కేంద్రం సూచించింది. అలాగే భగీరథకు కాపీలా హర్‌ఘర్‌జల్ పథకాన్ని తీసుకొచ్చింది. ఇకపోతే జాతీయ రహదారులకు సంబంధించి సమీక్ష చేయనున్నారు. ఇదిలావుండగా సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడనున్నారు. కాగా రాష్ట్రానికి జాతీయ ప్రాజెక్టును ఇవ్వాలంటూ ఈ సందర్భంగా అడిగే అవకాశాలు ఉన్నాయని సమాచారం. గతంలో మిషన్‌భగీరథకు, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని అడిగిన సంగతి తెలిసిందే. అలాగే నిటిఆయోగ్ సైతం సిఫారసు చేసింది. అయినా కేంద్రం పెడచెవిన పెట్టింది. ఇదిలావుండగా ప్రధాని వీడియోకాన్ఫరెన్స్ వచ్చే ఎన్నికల ప్రచారానికేనని అంటున్నవారూ లేకపోలేదు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అనుకూల కార్యక్రమాలు చేపట్టాలంటూ మార్గదర్శకాలు పంపారనే ప్రచారం జరుగుతున్నది. దీనిపై అధికారులను వివరణ కోరగా స్పందించడానికి నిరాకరించారు

బిజినెస్

ఒప్పో నుంచి రెనో 10 5జి సీరిస్



న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీదారు ఒప్పో కొత్తగా రెనో 10 5జి సీరిస్‌ను విడుదల చేసింది. 6.7 అంగుళాల డిస్‌ప్లే కలిగిన ఈ ఫోన్‌ను ట్రిపుల్ రేర్ కెమెరాలతో తెచ్చింది. ఇందులో టాప్ వేరియంట్ రెనో 10 ప్రో ధరను రూ.594999గా నిర్ణయించింది. జులై 11నుంచి ఇది ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో లభించనుందని పేర్కొంది. 64ఎంపి ఒవి64బి సెన్సార్ కెమెరాతో దీన్ని విడుదల చేసినట్లు తెలిపింది.

ఏఐతో 90 శాతం ఉద్యోగాలు ఫట్

• స్టార్టప్ దుకాన్‌లో సిబ్బందికి ఎసరు



న్యూఢిల్లీ : వ్యాపారులు తమ స్వంత ఇ-కామర్స్ పోర్టల్‌ను ఏర్పాటు చేసుకోవడానికి మద్దనిచ్చే స్టార్టప్ సంస్థ దుకాన్ తమ ఉద్యోగుల్లో 90 శాతం మందికి ఉద్వాసన పలికింది. వీరి స్థానంలో కృత్రిమ మేథా(ఏఐ)ని ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. కస్టమర్ సపోర్ట్ టీమ్‌లో 90 శాతం ఉద్యోగుల స్థానంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్‌తో రిప్లేస్ చేస్తున్నట్లు దుకాన్ ఫౌండర్, సిఇఒ సుమిత్ షా సోషల్ మీడియాలో వెల్లడించారు. దీంతో తమకు 85 శాతం ఖర్చులు తగ్గనున్నాయన్నారు. సుమిత్ షా నిర్ణయంపై ట్విట్టర్‌లో ఆయనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది సిగ్గు, మానవత్వం లేని చర్య అని నెటిజన్లు విమర్శలు గుప్పించారు.

మైక్రోసాఫ్ట్‌లో మళ్లీ ఉద్వాసనలు

టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లో మరోమారు తొలగింపులు చోటు చేసుకోనున్నాయని రిపోర్ట్‌లు వస్తోన్నాయి. ఇప్పటికే 10వేల మందికి ఉద్వాసన పలుకుతున్నామని ఈ ఏడాది ప్రారంభంలో ఆ కంపెనీ ప్రకటించింది. వీటికి అదనంగా మరోమారు కోతలకు సిద్ధం అవుతోందని తెలుస్తోంది. తాజా తొలగింపుల్లో భాగంగా వాషింగ్టన్ కార్యాలయంలోని ఉద్యోగుల్లో 276 మందిని ఇంటికి పంపించిందని సమాచారం. రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఉద్యోగుల తొలగింపులు ఉండొచ్చని రిపోర్ట్‌లు వస్తోన్నాయి.

వేదాంతకు భారీ షాక్

• టాటాతో ఫాక్స్‌కాన్ జట్టు..!




న్యూఢిల్లీ : కార్పొరేట్ దిగ్గజం అనిల్ అగర్వాల్‌కు తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ భారీ షాక్ ఇచ్చింది. భారత్‌లో చిప్‌ల తయారీకి వేదాంతతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోగా.. తాజాగా టాటా గ్రూపునతో కలిసి ముందుకు సాగాలని భావిస్తోన్నట్లు సమాచారం. ఇందుకోసం టాటా గ్రూపునతో సంయుక్త భాగస్వామ్యం కోసం చర్చలు జరుపుతోందని రిపోర్టులు వస్తోన్నాయి. మరో రెండు కంపెనీలతోనూ చర్చిస్తున్నట్లు సమాచారం. భారత్ ఒక బలమైన సెమీకండక్టర్ తయారీ పర్యావరణ వ్యవస్థను విజయవంతంగా స్థాపించాలని చూస్తోన్నామని ఫాక్స్‌కాన్ తెలిపింది. సరైన భాగస్వాముల కోసం సమీక్షిస్తున్నామని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. దేశీయ, అంతర్జాతీయ వాటాదారులను స్వాగతించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. గుజరాత్‌లో రూ.1.5 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్ ఏర్పాటుకు గతేడాది వేదాంతో ఒప్పందం కుదుర్చుకుంది. తాజాగా పరస్పర ఆలోచనలతోనే ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. సరైన భాగస్వామి దొరక్కపోతే సొంతగానే ప్లాంట్ పెట్టాలనే యోచనలో ఉన్నట్లు రిపోర్ట్‌లు వస్తోన్నాయి.

అదానీ గ్రూపునపై ఆగస్టులో సుప్రీం విచారణ



న్యూఢిల్లీ : అదాని గ్రూపు కంపెనీలు తీవ్ర ఆర్థిక అవకతవకల ఆరోపణలపై సెబీ సమర్పించిన రిపోర్ట్‌పై ఆగస్ట్‌లో విచారణ జరపనున్నట్టు సుప్రీంకోర్టు తెలిపింది. అదాని కంపెనీలు మోసాలకు పాల్పడుతున్నాయనే హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌పై సెబీ విచారణ జరిపి 41 పేజీలతో కూడిన నివేదికను సోమవారం అత్యున్నత న్యాయస్థానానికి అందించింది. దీనిపై ఇంకా విచారణ జరుగుతుందని.. కొంత సమయం ఇవ్వాలని సెబీ కోరడంతో న్యాయస్థానం మంగళవారం అంగీకరించింది. ఈ కేసును ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచుడ్ ధర్మాసనం విచారిస్తూ.. ఆగస్టు 14 వరకు పూర్తి విచారణ రిపోర్ట్‌కు గడువు ఇచ్చింది. నికర ఆస్తులతో సంబంధం లేకుండా అదానీ గ్రూపు కంపెనీల షేర్లు కృత్రిమ పద్ధతిలో భారీగా పెంచుతున్నారనే హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో ఇన్వెస్టర్లు లక్షల కోట్లు నష్టపోయిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరపాలని.. ఇన్వెస్టర్ల ఆసక్తులను కాపాడాలని సెబీని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

బైజూస్ ఖాతాల తనిఖీ..!



న్యూఢిల్లీ : కరోనా కాలంలో భారీ ఆదాయాలను ఆర్జించి.. ఓ వెలుగు వెలిగిన ఎడ్‌టెక్ స్టార్టప్ బైజూస్ తీవ్ర చిక్కుల్లో పడింది. ఆ సంస్థ ఖాతాలను కార్పొరేట్ మంత్రిత్వ శాఖకు తనిఖీ చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్‌కు బాధ్యతలు అప్పగించిందని సమాచారం. ఇటీవలే ఆ సంస్థను ముగ్గురు బోర్డు సభ్యులు, ఆడిటర్ వీడారు. రూ.10వేల కోట్ల నిధుల సమీకరణలో ఉన్న బైజూస్‌ను ప్రభుత్వ నిర్ణయం మరింత చిక్కుల్లో పడే అవకాశం ఉంది. బైజూస్ ఖాతాల వివరాలను తమకు ఆరు వారాల్లో అందించాలని మంత్రిత్వ శాఖ కోరినట్లు సమాచారం. దీనిపై ఇరు వర్గాలు కూడా అధికారికంగా స్పందించాల్సి ఉంది.

రేవంత్ వ్యాఖ్యలపై మండిపడ్డ బీఆర్ఎస్

- రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉచిత విద్యుత్తు అవసరం లేదంటూ పీసీసీ చీఫ్ రేవంత్ వ్యాఖ్యానించినట్టుగా కొన్ని ఛానళ్లలో వార్తలు రావడంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ వ్యవసాయ, రైతు వ్యతిరేక ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా మంగళ, బుధవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలపాలని సూచించింది. ప్రతి గ్రామంలోనూ కాంగ్రెస్ దిష్టిబొమ్మలు దహనానికి పిలుపునిచ్చింది. ఉచిత విద్యుత్ కార్యక్రమాన్ని రద్దు చేయాలన్న దుర్మార్గపు ఆలోచన కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు. గతంలో కూడా విద్యుత్ ఇవ్వకుండా రైతులను గోసపెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని సూచించింది. మరోసారి తన రైతు వ్యతిరేక విధానాలను అది బయటపెట్టుకుందని తెలిపింది. దీన్ని తెలంగాణ రైతాంగం, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని కోరింది.

నాడు తెలంగాణ ఉద్యమంపై తుపాకీ ఎక్కుపెట్టిన మనిషే, నేడు పచ్చబడ్డ తెలంగాణను చూసి విషం కక్కుతున్నాడని రేవంత్ రెడ్డిపై మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన పార్టీ మారినా మనిషి మారలేదని, రేవంత్ మనసు కరగలేదని విమర్శించారు. తెలంగాణ సమాజంపై పగబట్టినట్టు వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ అధ్యక్షునికి రైతులు తగిన శాస్తి చేయాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డిపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఫైర్ అయ్యారు. రైతులు అన్ని విషయాలనూ గమనిస్తున్నారని హెచ్చరించారు. రాష్ట్రాన్ని కరువుపీడిత ప్రాంతాలుగా మార్చిందే కాంగ్రెస్ పార్టీ అని మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలను రైతాంగం తిప్పికొట్టాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. రైతులే రేవంత్‌కు తగిన బుద్ధి చెబుతారని మంత్రి సత్యవతి రాథోడ్ హెచ్చరించారు. రేవంత్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపం బయటపడిందని రెడ్కో చైర్మెన్ సతీష్ రెడ్డి, బీఆర్ఎస్ హైదరాబాద్ ఇన్ ఛార్జీ దాసోజు శ్రవణ్ తెలిపారు.

రేవంత్‌రెడ్డి మాటలకు బీఆర్ఎస్ వక్రీకరణ

- రైతులకు 24 గంటల విద్యుత్ అనేది కాంగ్రెస్ విధానమే :టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధు యాష్కీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతులకు ఉచిత విద్యుత్ విషయంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు వక్రీకరిస్తున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధు యాష్కీ విమర్శించారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వటమే కాంగ్రెస్ విధానమని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పలువురు నేతలు వేర్వేరుగా విలేకర్లతో మాట్లాడారు. 24 గంటల కరెంట్ పేరుతో రైతులను కేసీఆర్ మోసం చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి కేటీఆర్ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బషీర్‌బాగ్ విద్యుత్ కాల్పులు జరిగినప్పుడు టీడీపీలో ఉన్న కేసీఆర్ ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. ఆనాడు టీడీపీ సర్కారు విద్యుత్ కాల్పుల్లో కేసీఆర్ భాగస్వామి అని గుర్తు చేశారు. 24 గంటల కరెంట్ వెనుక ఎంత అవినీతి జరిగిందో తమ దగ్గర ఆధారాలున్నాయని తెలిపారు. విద్యుత్ కొనుగోలు అవినీతిలో కేసీఆర్ కుటుంబం పాత్ర ఉందని ఆరోపించారు. రైస్ మిల్లర్లతో కలిసి ఆ కుటుంబం దోపిడీకి పాల్పడిందన్నారు.

ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పథకమే : మల్లు రవి

ఉచిత విద్యుత్‌కు పేటెంట్ హక్కు కాంగ్రెస్‌దేనని టీపీసీసీ ఉపాధ్యక్షులు రేవంత్‌రెడ్డి చెప్పారంటూ పార్టీ ఉపాధ్యక్షులు మల్లు రవి చెప్పారు. అమెరికాలో ఎన్ఆర్ఐల సమావేశంలో ఒక ప్రశ్నకు మాధానంగా ఉచిత విద్యుత్ గురించి రేవంత్ మాట్లాడారని తెలిపారు. విద్యుత్ కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై ఆయన వ్యాఖ్యానించారని చెప్పారు. అక్కడ విదానపరమైన నిర్ణయాన్ని ప్రకటించలేదని వివరించారు. రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు పని చేస్తామన్నారు. రైతులను తప్పు దోవ పట్టించేందుకు మంత్రి కేటీఆర్ ఇలాంటి చీప్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు.

విద్యుత్‌కు రూ 36వేల కోట్లకు ఎందుకు కొంటున్నారు : అద్దంకి దయాకర్

పవర్ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి అయితే, మరి రూ 36వేల కోట్లకు ఎందుకు కొంటున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 12,000 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు 2,000 మెగావాట్ల విద్యుత్‌ను ప్రభుత్వం ఖర్చు పెడుతోందని చెప్పారు. బీజేపీకి ఎంఐఎం రహస్య మిత్రుడని, వారికి సీఎం కేసీఆర్ జిగిరీ దోస్తు అని ఆరోపించారు.

24 గంటల కరెంట్ ఇచ్చే గ్రామాన్ని చూపించగలరా? : సుంకెట అన్వేష్‌రెడ్డి

రైతులకు 24 గంటల కరెంట్ వచ్చే ఒక్క గ్రామాన్ని చూపించగలరా? అని కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ సుంకెట అన్వేష్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. రెండు నెలలుగా వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే చుక్క నీరైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం కాలువల ద్వారా నీళ్లు ఇస్తామని కేసీఆర్... చుక్క నీరు ఇవ్వడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ ఉచిత విద్యుత్‌కు కట్టుబడి ఉందని కిసాన్ కాంగ్రెస్ జాతీయ నేత కోదండరెడ్డి స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌ది రేవంత్‌రెడ్డి : ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి...రేవంత్‌రెడ్డే కాంగ్రెస్ అని అనడం జోక్ అని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 'కాంగ్రెస్‌లో పీసీసీ నిర్ణయం ఫైనల్ కాదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఏం మాట్లాడారో పూర్తిగా నాకు తెలియదు అన్నారు. సీతక్క సీఎం అనే వ్యాఖ్య అనవసరమని పేర్కొన్నారు. వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలో 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తామంటూ బుధవారం రేవంత్ ప్రకటిస్తారని తెలిపారు. రైతులు బీఆర్ఎస్ మాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'కాంగ్రెస్ అంటే రైతులు. రైతులంటే కాంగ్రెస్. దేశంలో రైతులకు అనుకూలంగా పని చేసిన పార్టీ కాంగ్రెస్ ఒక్కటే. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను బీఆర్ఎస్ వక్రీకరించింది. మంత్రులంతా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. ఆయన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు' అని విమర్శించారు.

ఆగస్టు 19న హైదరాబాద్‌లో మహాధర్నా : తపస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాటాలను చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నిర్ణయించింది. ఆ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఏర్పడినప్పుడు ఉపాధ్యాయుల సమస్యలన్నీ తొలగిపోతాయని భావించామని తెలిపారు. ఏడేళ్లు అవుతున్నా ఏళ్ల నాటి వరకూ విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలేవీ పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. కనీసం బదిలీలు, పదోన్నతులు కూడా సరిగా చేపట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 317 జీవో ద్వారా అనేకమంది ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిన విషయాలను అనేకసార్లు అధికారులు, విద్యాశాఖ మంత్రి దృష్టికి తెచ్చినా పరిష్కారం కాలేదని తెలిపారు. వాటి పరిష్కారం కోసం ఈనెల 18 నుంచి 22 వరకు కాంప్లెక్స్ స్థాయిలో సంతకాల సేకరణ చేసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేస్తామని తెలిపారు. 25న తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం, 31న ఆర్డీఓలకు వినతిపత్రాలను అందజేస్తామని పేర్కొన్నారు. వచ్చేనెల ఐదున జిల్లా కలెక్టరేట్ల ముందు, 19న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద రాష్ట్రస్థాయి మహాధర్నా చేపడతామని వివరించారు.

ఆగస్టు 2 నుంచి రోజువారీ విచారణ

- ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన రాజ్యాంగంలోని అధికరణ 370ను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై రోజు వారీ విచారణ జరుపుతామని అత్యున్నత న్యాయస్థానం మంగళవారం తెలిపింది. ఆగస్టు రెండు నుంచి సోమవారం, శుక్రవారం మినహా మిగిలిన పని దినాల్లో వీటిపై విచారణ జరుగుతుందని పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం దీనిపై విచారించనున్నది. ఈ కేసులో దస్త్రాలు, రాతపూర్వక వివరణల సమర్పణకు జులై 27ను తుది గడువుగా నిర్ణయించింది. ఈ అధికరణ రద్దును సవాలు చేసిన పిటిషనర్ల జాబితా నుంచి తమ పేర్లను తొలగించాలని కోరుతూ మాజీ ఐఏఎస్ అధికారి షా ఫైజల్, జేఎన్‌యూ మాజీ విద్యార్థి నేత షెహ్లా రషీద్ చేసిన అభ్యర్థనకు సర్వోన్నత న్యాయస్థానం అనుమతినిచ్చింది. కేంద్ర ప్రభుత్వం సోమవారం దాఖలు చేసిన అఫిడవిట్‌లో అధికరణ 370 రద్దు తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో పరిస్థితి సాధారణ స్థితికి చేరిందని తెలిపింది. మూడు దశాబ్దాల సంక్షోభం తర్వాత మునుపెన్నడూ లేని అభివృద్ధి, ప్రగతి, భద్రత, స్థిరత్వం రావడానికి ఈ చర్య దోహదపడిందని తెలిపింది. మూడేండ్ల నుంచి పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ వ్యవస్థలు నిరాటంకంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, ఎటువంటి సమ్మెలు, ఆందోళనలు జరగడం లేదని పేర్కొంది. అయితే రాజ్యాంగపరమైన అంశాల గురించి వాదించేటప్పుడు ఈ అఫిడవిట్‌పై ఆధారపడబోమని కేంద్రం తరపు వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు చెప్పారు. దీనిని ధర్మాసనం నమోదు చేసింది. కేంద్ర ప్రభుత్వం 2019 ఆగస్టు 5న అధికరణ 370ను రద్దు చేసింది. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. దీనిని కూడా పిటిషనర్లు సవాలు చేశారు.

వీఓఏలకు జాబ్‌చార్ట్ ఇవ్వాలి

- అన్ని పనులూ చేయించడం సరిగాదు
- ఐబీ డైరెక్టర్‌కు తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వీఓఏలతో అన్ని పనులు చేయించడం సరిగాదనీ, వారికంటూ ఒక జాబ్ చార్ట్ విడుదల చేయాలని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. మంగళవారం ఈ మేరకు హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయంలో ఐబీ డైరెక్టర్ వైఎల్‌శ్రీనివాస్‌కి వినతిపత్రాన్ని ఆ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్వీ రమ, రాష్ట్ర అధ్యక్షులు కె.రాజ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న వీఓఏకు ఒక జాబ్ చార్టు లేకపోవడంతో అన్ని పనులు చేయాల్సి వస్తున్నదని చెప్పారు. గ్రామ సంఘం పుస్తక నిర్వహణతో పాటు చిన్న సంఘాలకు బ్యాంక్ లోన్స్, స్త్రీనిధి లోన్స్ ఇప్పించడం, తిరిగి కట్టించడం, బ్యాంక్ లోన్స్ ఎంసీపీలు చేయడం, చిన్న సంఘాల సభ్యులకు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేలా అవగాహన కల్పించడం, ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించడం, ప్రభుత్వ కార్యక్రమాలలో ఎస్‌హెచ్‌జి సభ్యులు పాల్గొనడం, ఎస్‌హెచ్‌జి సమావేశాలు నిర్వహించడం, పుస్తకాలు రాయడం వంటివి చేస్తున్నామని తెలిపారు. వాటితోపాటు ఆన్‌లైన్ వర్క్‌లో మీటింగ్‌లో పాల్గొనడం, అకౌంటింగ్ చేయడం, యాప్‌లను నిర్వహించడం భారంగా మారిందని చెప్పారు. వీఓఏలతో ఇలా గొడ్డుచాకిరీ చేయించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఎస్‌హెచ్‌జి, వీఓ లైవ్ మీటింగ్స్, అకౌంటింగ్‌లను వీఓఏలు చేయడానికి సెర్ప్ నుంచి ప్రతి వీఓఏకు ఒక ట్యాబ్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎస్‌హెచ్‌జి అకౌంటింగ్ వీఓఏలకు లాగిన్ ఇవ్వాలనీ, బకాయి వేతనాలు త్వరగా ఇప్పించాలని కోరారు.

ఏపీ, తెలంగాణల మధ్య సమానంగా నీటి పంపకాలు చేయాలి

- ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా పోలవరం ప్రాజెక్టులోకొత్త ప్రాజెక్టులు
- అనుమతులు లేని ప్రాజెక్టులను ఆపాలని ఏపీని ఆదేశించండి : జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు మంత్రి టి.హరీశ్ రావు విజ్ఞప్తి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య 50:50 నిష్పత్తిలో నీటి పంపకాన్ని సవరించాలని మంత్రి టి.హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈమేరకు కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే వరద జలాలను ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా పోలవరం ప్రాజెక్టులో భాగమైన కొత్త ప్రాజెక్టులను నిర్మిస్తోందని కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేశారు. కుడి ప్రధాన కాలువ, ఎడమ ప్రధాన కాలువ విస్తరణ జరుగుతుందని, తద్వారా ఈ కాలువల ప్రస్తుత సామర్థ్యం చట్టబద్ధంగా అనుమతించబడిన దానికంటే రెండు నుండి మూడు రెట్లు ఎక్కువ నీటిని కలిగి ఉంటుందని తెలిపారు. 493 టీఎంసీల కేటాయింపులకు వ్యతిరేకంగా ఏపీదారువు 1,500 టీఎంసీల వాహక సామర్థ్యాన్ని సృష్టిస్తోంది. ఇది గోదావరి దిగువ జలాలపై తెలంగాణ వాదనలపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆమోదం లేని ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వెంకటనగరం, ఎల్ఐసి, చింతలపూడి ఎల్ఐఎస్ (ఫేజ్-1, ఫేజ్- 2), గోదావరి-పెన్నార్ లింక్ వంటి అనేక ప్రాజెక్టుల నిర్మాణంతో ముందుకు వెళు తోంది. పోలవరం ఆమోదిత కమాండ్ ఏరియాల్లో భాగం కాని, సిడబ్ల్యుసి స్వతంత్ర ప్రాజెక్టులుగా ఆమోదించని ఈ అక్రమ ప్రాజెక్టుల కింద లక్షల ఎకరాల కొత్త కమాండ్ ఏరియాలకు నీటిని అందించడానికి అక్రమంగా విస్తరించిన ఎల్ఎంసీ, ఆర్ఎంసీ రెండింటి ద్వారా కేటాయించిన నీటిని అక్రమంగా తరలిస్తుంది. అలాగే తాగునీటి ఇవ్వాలనే ఉద్దేశంతో, పోలవరం డెడ్ స్టోరేజ్ నుండి కొత్త లిఫ్ట్ స్కీమ్‌ను ఏపీ ప్లాన్ చేసింది. పోలవరం జాతీయ ప్రాజెక్ట్ అయినందున, వాస్తవానికి ఆమోదించబడిన సాంకేతిక పరిమితుల ప్రకారం ఈ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని నిర్ధారించాలని, పరిధి వెలుపల ప్రాజెక్టుల విస్తరించడం, నిర్మించడం వంటివి జరగకుండా చూడాలని కోరారు. ఎల్ఎంసీ, ఆర్ఎంసీ అనధికారిక విస్తరణ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వెంకటనగరం, చింతలపూడి ఎల్ఐఎస్ (ఫేజ్-1, ఫేజ్-క్కక్కి) వంటి అనుమతులు లేని ప్రాజెక్టుల నిర్మాణాన్ని ముందుకు సాగకుండా ఆపాలని జోక్యం చేసుకుని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. గోదావరి-పెన్నార్ లింక్, పోలవరం రిజర్వాయర్ డెడ్ స్టోరేజీ నుంచి లిఫ్ట్ స్కీమ్ ఆమోదం పొందని నిర్మాణం కూడా తెలంగాణ నది హక్కులను ప్రభావితం చేస్తుందని తెలిపారు.

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్ల నమోదుకు నేడే ఆఖరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియలో వెబ్‌ఆప్షన్ల నమోదుకు గడువు బుధవారంతో ముగియనుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు 72,321 మంది వెబ్‌ఆప్షన్ల నమోదు చేశారని వివరించారు. వారు 45,56,659 ఆప్షన్లు నమోదు చేశారని తెలిపారు. ఒక అభ్యర్థి అత్యధికంగా 1,104 ఆప్షన్లను నమోదు చేశారని పేర్కొన్నారు. ఈనెల 16న ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో తొలివిడత సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

ఉచిత కరెంటు అందించిన చరిత్ర కాంగ్రెస్‌దే : భట్టి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉచిత కరెంటు గురించి ఎవరు ఆలోచన చేయని రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం 2004లోనే ఆ పథకాన్ని అమలు చేసిన విషయం దేశ ప్రజలందరికీ తెలుసని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు ఉచిత కరెంటు ఇవ్వడం అనేది కాంగ్రెస్ పార్టీకి పేటెంట్ అని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆరకొర నిధులున్న సమయంలోనే వ్యవసాయానికి ఉచిత కరెంటు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదని స్పష్టం చేశారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- ఆర్టీసీ ఎమ్‌డీ సజ్జనార్‌కు తెలంగాణ మజ్దూర్ యూనియన్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.థామస్‌రెడ్డి యాజమాన్యాన్ని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆర్టీసీ వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ముఖ్య సలహాదారులు బి.యాదయ్య, అధ్యక్షులు కమలాకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం థామస్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పెండింగ్‌లోని 2017, 2021 వేతన సవరణలను తక్షణమే అమలు చేయాలని కోరారు. అధికారుల వేధింపులు నుంచి కార్మికులను రక్షించాలని విజ్ఞప్తి చేశారు. సీసీఎస్ డబ్బులను తక్షణమే చెల్లించాలని కోరారు. రెస్ట్ రూమ్ సౌకర్యం లేకుండా నైట్ డ్యూటీలు వేయడం సరిగాదన్నారు. అన్‌ఫిట్ ఉద్యోగుల, ఆర్టీఎస్ బాండ్ మొత్తాలు, రిటైర్డ్ ఉద్యోగుల సెటిల్మెంట్ మొత్తాలను చెల్లించాలని కోరారు. త్వరలో వేతన సవరణ, యూనియన్ల పునరుద్ధరణ అంశాలపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి హరీశ్‌రావు హామీఇచ్చారని తెలిపారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో 15 రోజుల్లో ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మెను పరిష్కరించాలి : ప్రజాపంథా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెను పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వారి వేతనాలను పెంచాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 60 వేల మంది గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతును ప్రకటించారు. చాలీచాలని జీతాలతో జీవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలకు నోచుకోవడం లేదని తెలిపారు. పీఆర్సీలో కనీస వేతనం రూ.19 వేలు నిర్ధారించారని పేర్కొన్నారు. కానీ జీపీ కార్మికులకు నెలకు రూ.8,500 మాత్రమే ఇస్తున్నారని వివరించారు. పీఆర్సీ నివేదిక జీవోనెంబర్ 60 ప్రకారం వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రతి పౌర్ణమికి అరుణాచల గిరికి ప్రత్యేక బస్సులు

- భక్తుల సౌకర్యార్థం జిల్లా కేంద్రాల నుంచి బస్సులు : ఆర్టీసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమిళనాడులోని అరుణాచలేశ్వరుని గిరిప్రదర్శన చేయాలనుకునే భక్తుల సౌకర్యార్థం ప్రతి పౌర్ణమికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) నిర్ణయించింది. ఈ మేరకు టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్‌డీ వీసీ సజ్జనార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తిగల వారు ప్రతి పౌర్ణమికి 10 రోజుల ముందుగా ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ ష్టటష.ఱఱశ.tsrtconline.in ను సందర్శించి ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని పేర్కొన్నారు. ప్రతి నెలలోని పౌర్ణమికి రెండ్రోజుల ముందు హైదరాబాద్ తో సహా అన్ని జిల్లా కేంద్రాల నుంచి ప్రత్యేక సర్వీసులను నడిపేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ టూర్‌లో కాణిపాకం విఘ్నేశ్వరాలయం, అరుణాచల గిరి ప్రదర్శన, వెల్లూరులోని గోల్డెన్ టెంపుల్ సందర్శన ఉంటుందని తెలిపారు. అవసరమైతే ఏసీ బస్సులను నడిపేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

తిరుగుబాటు చేసిన

ప్రిగోజిన్, వాగ్నర్ కమాండర్లను కలిసిన పుతిన్



ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని తీవ్రతరం చేయటం కోసం ప్రణాళికలను రచించటానికి విల్నియస్ లో జరగనున్న నాటో శిఖరాగ్ర సభకు ముందు, జూన్ 29 నాడు అంటే తిరుగుబాటు విఫలమైన తరువాత కేవలం 5రోజుల తరువాత రష్యా అధ్యక్షుడు, పుతిన్ ఎవ్జెనీ ప్రిగోజిన్ ని కలవటం జరిగింది. ఈ వార్తను మొట్టమొదటిసారి శుక్రవారం ఫ్రెంచ్ వార్తాపత్రిక లిబరేషన్ ప్రచురించింది.

రష్యన్ సైనికాధికారులతో నెలల తర బడి తగవులాడిన మితవాది, నేరస్థుడిగా నిరూపించ బడినవాడు, ఈ కోటీశ్వరుడు అయిన ప్రిగోజిన్ జూన్23వ తేదీనాడు తిరుగుబాటు చేపట్టటం కాకుండా రష్యన్ సంపన్న ఒలిగార్క్ వర్గానికి, ప్రభుత్వ యంత్రాంగంలోని నాటో అనుకూల వర్గాల కు మద్దతు కోసం పిలుపు చేశాడు. ఉక్రెయిన్ యుద్ధాన్ని నడిపే మిలిటరీ కేంద్ర కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోవటమే కాకుండా రక్షణ మంత్రి, సెర్గీ షొయిగు, చీఫ్ ఆఫ్ స్టాఫ్ వలరీ జెరాసిమోవ్ లను పదవులనుంచి తొలగించాలని డిమాండ్ చేశాడు.

తిరుగుబాటు విఫలం అయిన తరువాత కేవలం ఐదు రోజులకు పుతిన్ 35మందిని ఆహ్వానించాడు. వీరిలో వాగ్నర్ సంస్థకు చెందిన కమాండర్లందరూ ఉన్నారు. రష్యా విదేశీ గూఢచార సంస్థ ప్రధానాధికారి, సెర్గీ నరిష్కిన్, తిరుగుబాటును అణచటానికి సమీకరించిన నేషనల్ గార్డ్ హెడ్ అయిన విక్టర్ జోలోటోవ్ కూడా ఉన్నారు. సమావేశానికి సంబంధించిన వివరాలను క్రెమ్లిన్ అధికార ప్రతినిధి, డిమిట్రీ పెస్కోవ్ ఇవ్వనప్పటికీ పుతిన్ కి, వాగ్నర్ కమాండర్లకు మధ్యన ఒక ఒప్పందం కుదిరిందని స్పష్టమైన సూచన ఉంది.

తిరుగుబాటు తరువాత బైలోరష్యా ప్రెసిడెంట్ అలెగ్జాండర్ లుకషెంకో పుతిన్ కు, ప్రిగోజిన్ కు మధ్య రాజీ కుదిర్చాడు. ఆ రాజీ ప్రకారం ప్రిగోజిన్ కు, వాగ్నర్ కమాండర్లందరికూ క్షమాభిక్ష పెట్టబడి కాకుండా వారిని బైలోరష్యాలో నివసించటానికి పంపటం జరుగుతున్నది. అయితే వీరిని బైల్ ప్రవాసంలోకి పంపటం జరిగేదే. ఇప్పటికీ ప్రిగోజిన్ రష్యాలోనే ఉన్నాడు. వాగ్నర్ కోసం సైనికులను చేర్చుకుంటూనే ఉన్నాడు. పది దేశాలకు పైగా విస్తరించిన వాగ్నర్ సామ్రాజ్యాన్ని, వేలాదికోట్ల ప్రిగోజిన్ సంపదను నియంత్రించే ఉద్దేశం రష్యాకు ఉన్నదా అనేది సందేహస్పదంగా ఉంది.

ఉక్రెయిన్ యుద్ధంలో నాటో ప్రమేయంలేదనే అబద్ధాన్నిప్రచారం చేస్తూ తిరుగుబాటు చేసిన ప్రిగోజిన్ ను ఉపేక్షించటమంటే రష్యా పాలక వర్గాలలోను, రష్యా యంత్రాంగంలోను సంక్షోభం, చీలికలు ఉన్నాయని అర్థమౌతుంది. రష్యా పాలక వర్గాల చీలిక, సంక్షోభం మూలాలు సోవియట్ పతనంలోను, పెట్టుబడిదారీ వ్యవస్థ పునఃస్థాపన లోను ఉన్నాయి. రష్యా ఆశ్రిత వనరులను పెట్టుబడి దారీ వర్గ, ప్రభుత్వంలో అధికారులుగాఉన్న ఎలైట్ వర్గాలకు పుతిన్ అందుబాటులో ఉంచటాన్ని వ్యతిరేకిస్తున్న సోవియట్ పతనం తరువాత అనతి కాలంలో రకరకాల ఆక్రమాలద్వారా అపార సంపదను పోగుచేసుకున్న ఒలిగార్క్‌లుగా పిలువబడుతున్న సంపన్న వర్గంలోని ప్రధానమైన గ్రూపుకు ప్రిగోజిన్ ప్రాతినిధ్యంవహిస్తున్నాడు.

ఈ వర్గాల మధ్య సమతౌల్యాన్ని సాధించటానికి ,వనరుల వ్యతిరేకించుకునే ఒలిగార్క్‌లకు, ముఠాల మధ్య సామరస్యాన్ని సాధించటానికి పుతిన్ చేస్తున్న ప్రయత్నం ఉక్రెయిన్ యుద్ధ సఖ్యాన్ని నియంత్రి స్తుంది. రష్యా పెట్టుబడిదారీ రాజ్య న్యాయమైన భద్రతా సమస్యలను కార్డుపాటు సైనిక వర్గతితో అమె రికా నేతృత్వంలోని సామ్రాజ్యవాదులు గుర్తిస్తారనే నమ్మకంతో ఉక్రెయిన్ లో పుతిన్ తన "ప్రత్యేక సైనిక చర్య"ను మొదలెట్టాడు. ఈ అంచనా తప్పని ఆచరణలో రుజువౌతోంది. 11వ తేదీ నుంచి లిథ్వేనియా రాజధాని విల్నియస్‌లో జరుగుతున్న నాటో శిఖరాగ్ర సభ పెంచనున్న ఉక్రెయిన్ యుద్ధ తీవ్రతను పుతిన్ ఎలా ఎదుర్కొనున్నాడో వేచి చూడాలి.

ఎన్ఆర్ఐలు అభివృద్ధికి చోదకశక్తులు

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మన దేశ, రాష్ట్రాల అభివృద్ధికి ఎన్ఆర్ఐలు చోదకశక్తులని, అమెరికా, ఇండియా దేశాలకు వారధులని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కొనియాడారు. అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఫిలడెల్ఫియాలో నిర్వహిస్తున్న తానా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సభలు ముగిసిన తర్వాత పలు వురు ఎన్ఆర్ఐలను కలవడంతో పాటు వారి ఆతిథ్యాన్ని స్వీకరిస్తున్నారు. అక్కడి ప్రముఖ ప్రాంతాలను సందర్శిస్తున్నారు. అందులో భాగంగా నే మంగళవారం సాయంత్రం ఆలయాల నికి వెళ్లి పూజలు చేశారు. ఈ సంద ర్భంగా దయాకర్ రావు మాట్లాడు తూ.. ఎక్కడున్నా మన దేశ భక్తిని, కన్న తల్లిని, పుట్టిన ఊరిని మరవని పౌరులు మీరు. దేశ సంపద పెంపులో, నిర్మాణంలో ఎన్ఆర్ఐలు ముందు వరుసలో ఉన్నారని, భవిష్యత్తులో ఇది మరింత కొనసాగాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ అధ్వర్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తోందన్నారు. విదిపోయాకరి రెండు రాష్ట్రాలూ వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు.

రైతులకు ప్రథమ శత్రువు కాంగ్రెస్ పార్టీ

-చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ నేతలకు వారి ఇండ్లల్లో 24 గంటల విద్యుత్ ఉండాలి గానీ, రైతులకు వద్దా..? అని చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి ప్రశ్నించారు. 24 గంటల ఉచిత కరెంట్‌ను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ పార్టీ రైతులకు ప్రథమ శత్రువని ఫైర్ అయ్యారు. రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ... మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని నాశనం చేసేందుకు కుట్ర చేస్తున్నదని, వైఎస్ఆర్ హయాంలో 9 గంటల విద్యుత్ ఇవ్వలేదని రైతులే రోడ్డెక్కి ధర్నా చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి రైతు వ్యతిరేక విధానాలను రైతులు గమనిస్తున్నారనీ ఉన్నారనీ, ఆ పార్టీకి రైతులే తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

రేవంత్ వ్యాఖ్యలపై భగ్గుమన్న కోలేటి

రాష్ట్రంలో రైతులకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌ను రద్దు చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ దుష్ట పన్నాగమని తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ లిమిటెడ్ చైర్మెన్ కోలేటి దామోదర్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు ఇచిత విద్యుత్ ను అమలుచేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, వైఎస్ రాజశేఖర్ రెడ్డిదని గొప్పలు చెప్పుకునే ఆ పార్టీ నేతలు రేవంత్ వ్యాఖ్యలపై ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను ఢీ కొట్టేంత సీన్ కాంగ్రెస్‌కు లేదని తెలిసిపోవడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. దేశంలోనే అత్యధిక వరిపంటను పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందంటే అది ఉచిత విద్యుత్ వల్లేనని తెలిపారు. రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని రైతులను క్షమాపణ కోరాలని ఆయన డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్‌లో మహారాష్ట్ర నుంచి చేరికలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీలోకి మహారాష్ట్ర నుంచి చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి, వేర్వేరు పార్టీలకు చెందిన రాజకీయ నేతలు, సామాజిక సంస్థల నేతలు, ప్రజా ప్రతినిధులు, మేధావులు బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ సమక్షంలో మంగళవారం పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి, ఆదినేత పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో.. చంద్రాపూర్ జిల్లా సీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్, జిల్లా సహకారి బోర్డ్ ఉపాధ్యక్షుడు, ఎన్సీపీ బర్రోరా పూర్వ అధ్యక్షుడు వసంత్ మరోల్ రావ్ బోర్ తో, దివంగత మాజీ మంత్రి వామన్ రావు గడివార్ సోదరుడు తదితరులున్నారు.

రష్యా సరిహద్దులో నాటో సైనిక దళాలను శాశ్వతంగా మోహరించాలి

లిథ్వేనియా అధ్యక్షుడు



రష్యా అణ్వాయుధ సామర్థ్యాన్ని పట్టించుకోకుండా రష్యా సరిహద్దు వెంట నాటో దళాలను మోహరించాలని లిథ్వేనియా అతిథ్యంలో విల్నియస్ లో అమెరికా నాయకత్వంలోని నాటో సైనిక కూటమి శిఖరాగ్ర సభ 11వ తేదీ నుంచి జరుగుతున్నసందర్భంగా ఆ దేశ అధ్యక్షుడు, గిటనాస్ నౌసెడా బ్రిట్‌న్ వార్తా పత్రికకు చెప్పాడు.

రష్యా భూభాగానికి చేరువలో సైనిక దళాలను శాశ్వత ప్రాతిపదికన మోహరించరాదని 1997లో రష్యాకు, నాటో కు మధ్య జరిగిన ఒప్పందాన్ని రద్దు చేయాలని కూడా ఆయన వాదించాడు. 4000 మంది జర్మన్ సైన్యాన్ని శాశ్వతంగా తన దేశంలో ఉంచాలని లిథ్వేనియా కోరుతోంది.

బైలో రష్యా అభ్యర్థన మేరకు రష్యా తన అణ్వస్త్ర ఆయుధాలను బైలో రష్యాకు తరలించింది. అణ్వస్త్ర ఆయుధాలు లేని దేశాలైన జర్మనీ, ఇటలీ, స్వీడన్, టర్కీలలో అనేక దశాబ్దాలుగా తన అణ్వస్త్ర ఆయుధాలను ఉంచిన చరిత్ర అమెరికాకు ఉంది. అయితే రష్యా చర్యను "న్యూక్లియర్ బ్లాక్ మెయిల్"గా పశ్చిమ దేశాలు అభివర్ణిస్తున్నాయి. నాటో సైనిక దళాల ఉనికి తమ పూర్వపు దేశాలలో పెరిగినందువల్లే బైలో రష్యా అణ్వస్త్ర ఆయుధాల కోసం రష్యాను అభ్యర్థించిందని ఆ దేశం పేర్కొంది. నాటోను రష్యా సరిహద్దులదాకా విస్తరించటం ద్వారా ఉక్రెయిన్‌లో కీలుబొమ్మ ప్రభుత్వంతో యుద్ధాన్ని కొనసాగిస్తూ 1980వ, 1990వ దశకాలలో రష్యాకు ఇచ్చిన హామీలను ఉల్లంఘించి తమ దేశ భద్రతకు నాటో సైనిక కూటమి ప్రమాదాన్ని కొనితెచ్చిందని రష్యా ఆరోపిస్తున్నది. ఉక్రెయిన్ యుద్ధం జరగటానికి ఒక సంవత్సరం ముందు నాటో దేశాలను రాయితీలకోసం రష్యా ప్రయత్నించిన ఫలితంలేకుండా పోయింది.

హిమాచల్‌లో చిక్కుకున్న ఉస్మానియా డాక్టర్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉస్మానియా ఆస్పత్రికి చెందిన ఐదుగురు డాక్టర్లు హిమాచల్ ప్రదేశ్‌కు పర్యటనకు వెళ్లి చిక్కుకుపోయారు. వారి ఆచూకీ లభ్యం కాకపోవడంతో సహచర వైద్యులు, వైద్యుల సంఘాలు ఆందోళనకు గురయ్యారు. అక్కడి వరదల్లో డాక్టర్ బానోత్ కమల్ లాల్, డాక్టర్ రోహిత్ సూరి, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు చిక్కుకున్నారు. ఇదే విషయాన్ని ఢిల్లీలోని రెసిడెంట్ కార్యాలయంతో పాటు మంత్రి హరీశ్ రావు దృష్టికి తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం, ఇతర వైద్య సంఘాల నాయకులు తీసుకెళ్లారు. దీంతో, వారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.